శుక్రవారం
25•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 120
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




- ఆర్టీసీ సమ్మెకు ముగింపు, ఆర్టీసీ ముగింపే
- ఇక సంస్థ ఈ రూపంలో ఉండే అవకాశమే లేదు
- ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులతో పంచాయితీ లేదు
- రాజకీయాలు లేకుంటే వారికీ లక్ష బోనస్ వచ్చేది
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం సులభం కాదు
- కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రాల్లో విలీనంచేయలేదే?
- రాష్ట్ర బీజేపీ నేతలది వితండవాదం
- మోదీ తెచ్చిన చట్టాన్నే అమలుచేస్తున్నాం
- ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఐదారురోజుల్లో నిర్ణయం
- ఏడువేల బస్సులకు ఏ రూట్లోనైనా పర్మిట్లు ఇస్తాం
- హుజూర్‌నగర్ ప్రజలకు రుణపడి ఉంటాం
- పనిచేస్తున్న ప్రభుత్వానికి ఇది టానిక్‌వంటిది
- శనివారం హుజూర్‌నగర్‌లో కృతజ్ఞత సభకు వస్తా
- నవంబర్‌లోపే మున్సిపల్ ఎన్నికలు



గురువారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

# ఆర్టీసీ పాపం యూనియన్లదే

## సంస్థను ముంచుతున్నది కార్మికసంఘాలే

### యూనియన్ ఎన్నికల కోసమే పనికిమాలిన సమ్మె: సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీని యూనియన్లే ముంచుతున్నాయని, ఆ పాపం కార్మికసంఘాలదేనని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. వాళ్లు చేసే సమ్మెకు అర్థం, ఆలోచన ఉన్నదా? అని ప్రశ్నించారు. మూడు నాలుగేండ్లకోసారి వచ్చే దిక్కుమాలిన యూనియన్ ఎన్నికల కోసమే పనికిమాలిన సమ్మె చేస్తున్నారని మండిపడ్డారు. అలవికాని కోరికలు పెట్టి, ఓట్లు రాబట్టుకునేందుకే రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. ఆర్టీసీ కథే ముగుస్తుంటే, సమ్మె ముగింపెక్కడిదని ప్రశ్నించారు. 'చర్చలు వదిలేసి మధ్యలో వెళ్లినవారిని ఎవరు కాపాడుతరు? ఆర్టీసీని ఎవరూ కాపాడలేరు. మా అంతట మేమే మోసపోతామన్న తీరుగా ఆర్టీసీ సంఘాలు వ్యవహరిస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. యూనియన్ల పేరుమీద వాళ్లు మహానేరం, మహాపాపం చేస్తున్నారని అన్నారు. అమాయక కార్మికుల గొంతుకోస్తూ, వాళ్ల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆర్టీసీని వాళ్లే స్వయంగా ముంచుకుంటున్నరు.. ముగించుకుంటున్నరు. ఈ ప్రపంచంలో ఎవ్వడూ ఆర్టీసీని కాపాడలేడు. నా దృష్టిలో అయిపోయినకిందనే లెక్క' అని తేల్చిచెప్పారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. టీఆర్‌ఎస్‌ను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు స్వయంగా కృతజ్ఞతలు తెలియజేసేందుకు శనివారం సాయంత్రం హుజూర్‌నగర్‌లో నిర్వహించే సభకు హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై మాట్లాడిన సీఎం.. మీడియా ప్రశ్నలకు సమాధానాలు

> కార్మికులు అమాయకులే అయితే దరఖాస్తు పెట్టుకొని ఎక్కడోళ్లు అక్కడే ఉద్యోగంలో చేరాలి. అలాకాకుండా మాకు మేమే గొంతు కోసుకుంటం, మేము విధులకు రాము, సమ్మె ఆగదు అంటే మేమేం చేయగలం? ముఖ్యమంత్రిపైనా ఇష్టారీతిగా వ్యాఖ్యలు చేస్తరా? సంస్థ లేకుంటే యూనియన్ ఎక్కడిది? ఉన్మాదస్థితికి లోనై, కార్మికుల్లో పిచ్చి ఆలోచనలు పెట్టి, వాళ్ల బతుకులు నాశనంచేస్తున్నరు. ఆర్టీసీ మునగక తప్పదు. ఎవ్వడూ కాపాడలేడు. ఇవ్వాళ ఆర్టీసీ దివాలా తీసింది.
> ఆర్టీసీ కార్మికులు, అధికారులు మంచివాళ్లే. వారు చాలా సమర్థులు. ఆర్టీసీకి చాలా అవార్డులు కూడా వచ్చాయి. కార్మికులు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ పంచాయితీ అంతా యూనియన్లదే. యూనియన్ల విషకౌగిలి నుంచి బయటపడితేనే కార్మికులు బతుకుతరు. విధుల్లో చేరటంపై కార్మికులు ఆలోచించుకోవాలి. నీ రక్తం నీవే పీల్చుకుంటున్నవు. నీ ఆర్టీసీని నీవే కాలబెట్టుకుంటున్నవు. సంస్థ కొమ్మను నరుక్కుంటున్నవు.
> :- సీఎం కేసీఆర్ -:

మిగతా 2వ పేజీలో

# సైసై టీఆర్‌ఎస్

## కారుకే జీ హుజూర్

### ఉత్తమ్ కోట బద్దలు.. హుజూర్‌నగర్‌లో ఎగిరిన గులాబీ జెండా

**ఉపఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి ఘనవిజయం.. కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిపై 43 వేల ఓట్ల ఆధిక్యం**

హుజూర్‌నగర్ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ.. ప్రతిరౌండ్‌లోనూ కనిపించిన గులాబీ ఆధిపత్యం

మూడోస్థానం కోసం స్వతంత్ర అభ్యర్థితో పోటీపడి ఓడిన బీజేపీ

**పీసీసీ** చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కంచుకోట బద్దలైంది. ఉత్తమ్ వరుసగా గెలుస్తున్న హుజూర్‌నగర్‌లో ఓటర్లు ఈసారి తిరుగులేని గుణపాఠం నేర్పారు. తెలంగాణ సమాజం కేసీఆర్ వెంట ఉన్నదని హుజూర్‌నగర్ ఉపఎన్నిక మరోసారి రుజువుచేసింది. నియోజకవర్గ చరిత్రలోనే ఓటర్లు కనీవినీ ఎరుగని భారీ మెజార్టీని (43,358) కట్టబెట్టి టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి అద్భుతమైన విజయాన్ని అందించారు. ప్రధాన ప్రత్యర్థి.. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భార్య, కోదాడ మాజీ ఎమ్మెల్యే నల్లమాద పద్మావతి.. ఏ దశలోనూ సైదిరెడ్డికి పోటీ ఇవ్వలేకపోయారు. ఒకట్రెండు పోలింగ్‌స్టేషన్లు మినహా మరెక్కడా కాంగ్రెస్ పార్టీ చెప్పుకోదగ్గ ప్రదర్శన చూపలేకపోయింది. సైదిరెడ్డి 1,12,095 ఓట్లు సాధించగా.. పద్మావతి 69,737 ఓట్లతో రెండోస్థానంలో నిలిచారు. ఎన్నికల ప్రచారంలో బీరాలు పలికిన బీజేపీ.. మూడోస్థానం కోసం స్వతంత్ర అభ్యర్థితో పోటీపడి.. చివరకు నాలుగోస్థానానికి పరిమితమైంది. హుజూర్‌నగర్‌లో సైదిరెడ్డి గెలుపుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతోషం వ్యక్తంచేశారు. విజయానికి కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి ఓట్లేసిన నియోజకవర్గ ప్రజలకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. సీఎంపై తమకున్న అచంచలమైన విశ్వాసంతోనే హుజూర్‌నగర్ ప్రజలు సైదిరెడ్డిని గెలిపించారని రాష్ట్ర మంత్రులు, టీఆర్‌ఎస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. సైదిరెడ్డి గెలుపుతో హుజూర్‌నగర్ నియోజకవర్గంతోపాటు, హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో, జిల్లాల్లో టీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి.



> గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా.. అభివృద్ధికి పాటుపడతా
> – శానంపూడి సైదిరెడ్డి

గురువారం సూర్యాపేటలో కౌంటింగ్ కేంద్రం వద్ద గెలుపు అనంతరం విజయ సంకేతం చూపుతున్న టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

| | |
|---|---|
| పోలైన ఓట్లు | 2,00,766 |
| టీఆర్‌ఎస్ | 1,13,095 |
| కాంగ్రెస్ | 69,737 |
| స్వతంత్ర అభ్యర్థి | 2697 |
| బీజేపీ | 2639 |
| టీఆర్‌ఎస్ ఆధిక్యం | 43,358 |
| నోటా | 506 |
| చెల్లని ఓట్లు | 12 |



సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుండ్లపహాడ్‌లో సంబురాల్లో టీఆర్‌ఎస్ శ్రేణులు

## కుట్రలు ఛేదించినం

టీఆర్‌ఎస్‌ను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు: మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టిండ్రు: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

3

**నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

హుజూర్‌నగర్‌లో గులాబీ జెండా నింగికెగిసింది. పీసీసీ చీఫ్ ఉత్తమ్ వరుసగా గెలుస్తున్న కాంగ్రెస్ కోటలో టీఆర్‌ఎస్ కారు జోరుగా దూసుకెళ్లింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనకు హుజూర్‌నగర్ ప్రజలు జై కొట్టారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకుసాగుతున్న టీఆర్‌ఎస్ పాలనకు మరింత మద్దతు పలికారు. ఈ అసెంబ్లీ స్థానంకోసం ఈ నెల 21న జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 43,358 ఓట్ల భారీ ఆధిక్యంతో కాంగ్రెస్‌పై ఘనవిజయం సాధించారు. హుజూర్‌నగర్ చరిత్రలో ఏడుసార్లు ఎన్నికలు జరగ్గా.. ఇప్పటివరకు ఏ పార్టీ సాధించని అత్యధిక మెజార్టీతో టీఆర్‌ఎస్ సరికొత్త చరిత్రను సృష్టించింది. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి భార్య, కోదాడ మాజీ ఎమ్మెల్యే అయిన నల్లమాద పద్మావతిపై సైదిరెడ్డి గెలుపొందారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి మొత్తం 1,12,095 ఓట్లు సాధించగా..

మిగతా 3వ పేజీలో



## టీఎస్‌ఈఆర్సీ కమిషన్ చైర్మన్‌గా శ్రీరంగారావు

- సభ్యులుగా మనోహర్‌రాజు, కృష్ణయ్య నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ -టీఎస్‌ఈఆర్సీ) చైర్మన్‌గా ప్రముఖ న్యాయవాది తన్నీరు శ్రీరంగారావు నియమితులయ్యారు. ఆయనతో పాటు టెక్నికల్ సభ్యుడిగా ఎండీ మనోహర్‌రాజును, ఫైనాన్స్ సభ్యుడిగా బండారు కృష్ణయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరంతా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి ఐదేండ్ల

మిగతా 6వ పేజీలో

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 383.00 | రంగారెడ్డి | 383.00 |
| మెదక్ | 383.00 | కరీంనగర్ | 386.00 |
| వరంగల్ | 386.00 | చిల్లర ధర | 4.45 |

# విజేత బీజేపీ!

## మహారాష్ట్రలో గెలుపు, హర్యానాలో హంగ్!

ఇండిపెండెంట్ల మద్దతుకు కమలనాథుల యత్నాలు

మహారాష్ట్రలో పుంజుకున్న ఎన్సీపీ

తారుమారైన ఎగ్జిట్‌పోల్ అంచనాలు



విజయ సంకేతం చూపుతున్న ప్రధాని మోదీ




శివసేన అధినేత ఉద్ధవ్‌ఠాక్రే



మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్




హర్యానా కింగ్‌మేకర్ దుష్యంత్ చౌతాలా



హర్యానా సీఎం ఖట్టర్

**ఐదు** నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేంద్రంలో రెండోసారి అధికారానికి వచ్చిన కమలనాథులకు రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. మహారాష్ట్రలో ప్రభంజనం సృష్టిస్తాయనుకున్న బీజేపీ-శివసేనలు సాధారణ మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకున్నాయి. ఇక హర్యానాలో మెజారిటీ సీట్లు సాధించి రెండోసారి పగ్గాలు చేపట్టాలనుకున్న కమలనాథులకు చుక్కెదురైంది. ఆ రాష్ట్ర ప్రజలు ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీని ఇవ్వకపోవడంతో అక్కడ హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. అయితే అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ స్వతంత్రుల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పావులు కదుపుతున్నది. దేశవ్యాప్తంగా ఉప ఎన్నికలు జరిగిన 51 అసెంబ్లీ స్థానాల్లో కూడా బీజేపీకి ఆశించిన ఫలితాలు లభించలేదు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సైతం కొన్ని సీట్లను ఇతర పార్టీలకు కోల్పోయింది. 18 రాష్ట్రాల పరిధిలోని 51 స్థానాల్లో బీజేపీ 26 సీట్లను గెలుచుకోగా, కాంగ్రెస్ 12 స్థానాలను దక్కించుకుంది. మిగిలిన సీట్లను ప్రాంతీయ, ఇతర పార్టీలు గెలుచుకున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం మొదటిసారిగా బీహార్‌లో తన ఖాతాను తెరిచింది. ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ స్పందిస్తూ దీపావళికి ముందే ప్రజలు తమను ఆశీర్వదించారని పేర్కొన్నారు. మహారాష్ట్ర, హర్యానా ఫలితాలు తమ పాలనకు గీటురాయి అని

మిగతా 5వ పేజీలో

## 1,027 మందికి గ్రూప్-2 కొలువులు

తుది ఫలితాలు విడుదలచేసిన టీఎస్‌పీఎస్సీ

6

సరైన అభ్యర్థులు లేక ఖాళీగా ఐదు పోస్టులు .. వెబ్‌సైట్‌లో ఎంపికైనవారి జాబితా





గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి , ఎంపీ మాలోతు కవిత, మండలిలో చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, సుంకె రవిశంకర్, నన్నపునేని నరేందర్, బాల్క సుమన్, నల్లమోతు భాస్కర్‌రావు, కార్పొరేషన్ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, సీహెచ్ రాకేశ్, వాసుదేవరెడ్డి, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు ఉన్నారు



# ఆర్టీసీ పాపం యూనియన్లదే

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. నవంబర్ ముగిసేలోపు మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని ప్రకటించారు. తర్వాత నెల రోజులు లేదా 20 రోజులపాటు పట్టణ ప్రగతి కార్యక్రమంచే పడుతామనితెలి పారు.

## ఆర్టీసీ ఈ రూపంలో ఉండే అవకాశమే లేదు

ఆర్టీసీ సమ్మె చట్టవిరుద్ధమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. ఎస్మా ఉండగా సమ్మెకు పోయారని తెలిపారు. సమ్మె చట్ట విరుద్ధమని ఇప్పటికే లేబర్ డిపార్ట్‌మెంట్ ప్రకటించిందని చెప్పారు. ఆర్టీసీ యాజమాన్యం వద్ద డబ్బులేదని, ప్రభుత్వం ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర కూడా డబ్బులేదని తెలిపారు. ఇప్పటికే 10 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులు 2600 ఉన్నాయని, వాటిని వెంటనే మార్చాల్సి ఉన్నదన్నారు. అందుకు రూ.800 కోట్ల నుంచి వెయ్యి కోట్లు ఖర్చవుతాయన్నారు. ప్రస్తుతం కోటి రూపాయలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని, ఇక అంతడబ్బు ఎక్కడనుంచి తెస్తామని ప్రశ్నించారు. సమ్మె ఫలితంగా పాత ఆర్టీసీ ఉండే ఆస్కారం లేదని స్పష్టంచేశారు. యూనియన్లు, వాటికి సపోర్ట్ చేసే రాజకీయపార్టీలే ఇందుకు కారణమని విమర్శించారు. ఒకవేళ ఆర్టీసీ కార్మికులు చర్చలకు రావాలనుకుంటే రమ్మనండని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పనికిమాలిన యూనియన్లు, చిల్లర రాజకీయాలతో ఆర్టీసీ బతికి బట్టకట్టే పరిస్థితి, భవిష్యత్ ఉండదని బాధ్యత గల సీఎంగా చెప్తున్నానన్నారు. ఆర్టీసీ సమ్మెకు ముగింపు.. ఆర్టీసీ ముగింపేనన్నారు. యూనియన్ ముసుగులో.. పనిచేసే కార్మికులను పనిచేయనీయకుండా, రాజకీయాలకోసం వారి ఆలోచనలను కలుషితం చేసి, వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యకంచేశారు. ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులతోనే తనకు ఎలాంటి పంచాయితీ లేదని తేల్చిచెప్పారు. విద్యుత్ ఉద్యోగులు విజయం సాధించారని, నష్టాల్లో ఉన్న సింగరేణిని ఆ సంస్థ కార్మికులు కాపాడుకున్నారని గుర్తుచేశారు. ఫలితంగా సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్‌గా రూ.2 లక్షలు తానే ప్రకటించానని తెలిపారు. యూనియన్లు, రాజకీయాలు లేకుండా ఆర్టీసీ బతకాలని కార్మికులు పనిచేస్తే రెండేండ్లలో వాళ్లకూడా లక్ష రూపాయలు బోనస్ తీసుకునే పరిస్థితి వచ్చేదన్నారు.

## విలీనం అంత ఈజీ కాదు

'ఎవరుపడితేవారు ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపాలంటరు. ఆర్టీసీని విలీనం చేయడం అంత ఈజీనా?' అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. మిగిలిన 57 కార్పొరేషన్లు మమ్మల్ని కూడా ప్రభుత్వంలో కలపాలని దరఖాస్తు పెడితే ఏం చేయాలె? ఆర్టీసీని కలిపినప్పుడు మిగిలిన కార్పొరేషన్లను ఎందుకు కలుపరని కోర్టులు ప్రశ్నిస్తే ఏం చెప్పాలే? అని నిలదీశారు. 'ఆర్టీసీ విలీనం అనే అసంబద్ధ, అర్థరహిత, తెలివితక్కువ నినాదం పట్టుకుని, పనికిమాలిన రాజకీయ నాయకులు, తలకాయ మాసిపోయి నోడు.. వీళ్లా.. మాట్లాడేది? అని మండిపడ్డారు. ప్రస్తుతం చాలా రాష్ట్రాలు ఆర్టీసీని తీసేశాయని, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లో ఆర్టీసీ లేనే లేదని చెప్పారు. సీపీఎం 35 ఏండ్లపాటు పశ్చిమబెంగాల్‌ను పాలించి ఆర్టీసీని మూసేసిందని తెలిపారు. బీహార్‌లో అతి తక్కువసంఖ్యలో ఉన్నాయని, అవీ అద్దెబస్సులేనని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో ఆర్టీసీని మూసింది కాంగ్రెస్ సీఎం దిగ్విజయ్ కాదా? బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు విలీనం చేయడంలేదు? అని ప్రశ్నించారు. ఏపీ సీఎం జగన్ ఆర్టీసీ విలీనంపై కమిటీనే వేశారని, ఐదారునెలల్లో చెప్తామన్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఏమవుతుందో దేవుడికే ఎరుక అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అసంభవమని, భూగోళం ఉన్నంతకాలం అది జరుగదని తేల్చిచెప్పారు. ఆర్టీసీవాళ్ల గొంతెమ్మ కోరికలు ఎవరు తీర్చాలని ప్రశ్నించారు. ఇప్పుడు బుదరకిచ్చి మాట్లాడి.. ఆర్టీసీని కాపాడితే అలా ఎన్నాళ్లు కాపాడుతామని అన్నారు. సంస్థ నడవాలంటే ఒక పద్ధతి ఉంటుందని, దాన్ని పాటించాలని స్పష్టంచేశారు.

## త్రిసభ్య కమిటీ వేసినా.. పట్టించుకోలేదు?

ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన త్రిసభ్య కమిటీ వేసినట్లు సీఎం కేసీఆర్ చెప్పారు. తాను చొరవ తీసుకోకుండా కమిటీ ఎలా వస్తుందన్నారు. ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌లతో కమిటీ వేస్తే కార్మికసంఘాలు చర్చించే ఓపికలేకుండా వెళ్లిపోయాయన్నారు. 'చర్చలు వదిలేసి వెళ్లినవారిని ఎవరు కాపాడుతారు? మా అంతట మేమే మోసపోతామన్నట్టు సంఘాలు వ్యవహరిస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. ఆర్టీసీకి రూ.60వేల కోట్ల ఆస్తులున్నాయనడం అర్థరహితమన్నారు. సమ్మె దురహంకారపూరిత, ఆలోచనారహిత, అర్థంపర్థం, బుద్ధిజ్ఞానం లేనిదని పేర్కొన్నారు. మెడమీద తలకాయ ఉన్నోడు.. సంస్థ మనుగడతో, కార్మికుల భవిష్యత్, జీవితాలు, వారి కుటుంబాలతో ఆడుకోరాదనే కనీస జ్ఞానం ఉన్నోడు ఇలాంటి సమ్మె చేయడని వ్యాఖ్యానించారు.

## ఉనికికోసమే సంఘాల పోరాటం

కార్మికసంఘాలు ఉనికి కోసమే సమ్మెకు దిగాయని సీఎం కేసీఆర్ విమర్శించారు. సమ్మెలో రాజకీయాలు ఉన్నాయని వివరించారు. ఎన్ఎంయూ అనే యూనియన్ అతి తెలివికిపోయి సెప్టెంబర్ వేతనాలకోసం కేసు వేసిందని, ఆర్టీసీ జేఏసీలో ఉన్నట్టే నటిస్తూ వాళ్లను దెబ్బకొట్టేందుకే కేసు వేసిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు ఎత్తుకున్నది ఒక పిచ్చి పంథా అని, అనవసరమైన, అర్థంపర్థంలేని, దురహంకారపూరితమైన పద్ధతిని అవలంబించారని సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.



## నాలుగేండ్లలో 67% జీతాలు పెంచాం

గతంలో తాను రవాణామంత్రిగా బాధ్యతలు చేపట్టేనాటికి సంస్థ రూ.13.80 కోట్ల నష్టంలో ఉన్నదని, ఎంతో ఆలోచన చేసి ఏడాదిన్నరలో నష్టాన్ని పూడ్చి, మరో రూ.14 కోట్ల లాభంలోకి తీసుకొచ్చానని గుర్తుచేశారు. ఆర్టీసీపై తనకున్నంత లోతైన అవగాహన, సానుభూతి ఇంకొకరికి లేదని చెప్పారు. తాను సీఎం అయిన తర్వాత ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమై, ఏంచేస్తే సంస్థ బాగుపడుతుందో సలహాలు ఇచ్చానని, కార్మికుల జీతాలు 44% పెంచి, మంచిగా పనిచేయాలని సూచించానన్నారు. 2018 ఎన్నికల ముందు ఐఆర్ కోరితే మళ్లీ 14% ఇచ్చామని చెప్పారు. నాలుగేండ్లలో కార్మికుల జీతాలు 67% శాతం పెంచిన చరిత్ర దేశంలో ఉన్నదా? అని ప్రశ్నించారు. ఇంతచేసినా ఇంకా గొంతెమ్మ కోరికలు కోరితే అర్థం ఏముంటుందన్నారు.

## దరఖాస్తు పెట్టుకొని ఉద్యోగంలో చేరాలి

కార్మికులు అమాయకులే అయితే దరఖాస్తు పెట్టుకొని ఎక్కడోళ్లు అక్కడే ఉద్యోగంలో చేరాలని సీఎం కేసీఆర్ సూచించారు. అలాకాకుండా మాకు మేమే గొంతు కోసుకుంటం, మేము విధులకు రాము, సమ్మె ఆగదు అంటే తామేం చేయగలమని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి పైనా ఇష్టారీతిగా వ్యాఖ్యలు చేస్తరా?' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సంస్థ లేకుంటే యూనియన్ ఎక్కడిదో ఆలోచించుకోవాలన్నారు. ఉన్మాదస్థితికి లోనై, కార్మికుల్లో పిచ్చి ఆలోచనలు పెట్టి, వాళ్ల బతుకులు నాశనంచేస్తున్నారని సంఘాలపై మండిపడ్డారు. పనిచేయకుండా చెప్పకుండా వెళ్లిపోతే అదే సెల్ఫ్‌డిస్మిస్ అని చెప్పారు. కార్మికులను ఎవరూ వెళ్లగొట్టలేదని, వాళ్లే వెళ్లిపోయారని చెప్పారు. పదిరోజుల్లో బస్సులు వస్తాయని, భారీ పోటీ ఉన్నదని, ఇప్పటికే హైర్ బస్సుల కోసం ఇచ్చిన ప్రకటనకు 2350 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

## ఆర్టీసీకి నష్టాలెందుకు?

హైదరాబాద్‌లో అనేక ప్రైవేట్ ట్రావెల్స్ లాభాల్లో నడుస్తున్నాయని, ఆర్టీసీ మాత్రం నష్టాల్లో నడువటం ఆశ్చర్యంగా ఉన్నదని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ తేడా ఎందుకని ప్రశ్నించారు. ఆర్టీసీలో 2100 అద్దె బస్సులు, 8 వేల సొంతబస్సులు ఉన్నాయని, ఆర్టీసీకి ఒక్కొక్క అద్దెబస్సు మీద కిలోమీటరుకు 75 పైసలు లాభం వస్తుందని, ఈ లెక్కన ఒక బస్సు రోజుకు సగటున 300 కిలోమీటర్లు తిరిగితే సంస్థకు రోజుకు రూ.225 లాభం వస్తుందని తెలిపారు. అద్దెబస్సుల మీద రోజుకు రూ.4 లక్షల పైచిలుకు లాభం వస్తుంటే.. సొంత బస్సుకు ప్రతి కిలోమీటరుకు రూ.13 చొప్పున రోజుకు మూడు కోట్లు నష్టం ఎందుకు వస్తున్నదని ప్రశ్నించారు. ఇదేనా యూనియన్లు కార్మికులకు నేర్పించే విద్య? అని అన్నారు.

## ఎవరు కాపాడుతారు?

ఆర్టీసీ యూనియన్లు పెట్టిన మొదటి డిమాండే అద్దె బస్సులను తొలగించాలనేదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 'సిటీలో ఉంటున్న ఎవరికైనా ట్రాఫిక్ కారణంగా పావుగంట ఆలస్యం కావడం సహజం. కానీ.. వీళ్లు మాత్రం సిటీల మాకు టైం ప్రకారం నడపాలె.. అవసరమొస్తే కిలోమీటర్లు తగ్గించాలె అంటున్నరు. అంటే నిరంతరంగా ఈ దిక్కుమాలిన యూనియన్ల నాయకత్వంలో ఆర్టీసీని ముంచుతం.. నువ్వు ఎట్ల కాపాడుతవో కాపాడుకో అంటే.. ఎవడు కాపాడుతడు? ఎట్ల కాపాడుతరు?' అని సీఎం నిలదీశారు. 'సమాజంలో చాలామందికి లేని అవకాశం మీకు దొరికింది. మీకు సరాసరి వేతనం నెలకు రూ.50 వేలు వస్తున్నది. బయట రూ.5 వేల జీతం లేనోడు కూడా ఉన్నడు. సంస్థ నీది. కాపాడుకునే బాధ్యత నీకు లేదా? సందర్భం వస్తే గంట ఎక్కువ పనిచేయవా? నేను రైతునే. పంట పెట్టుకుంటే నాకు టైమ్ ఉంటదా? రాత్రి పెద్దవర్షం వస్తది.. పోయి పనిచేయవా? ఆరుగంటలే పనిచేస్త.. పంట పండాలంటే పండుతదా? సందర్భాన్ని బట్టి పనిచేయాలి. నువ్వు ఎంచుకున్న వృత్తి అది. పనికిమాలిన డిమాండ్లు పెట్టి మా కాళ్ల మేమే నరుక్కుంటం అంటే ఎవరేం చేయలేరు. ఆర్టీసీ మునగక తప్పదు. ఇవ్వాళ ఆర్టీసీ దివాలా తీసింది' అని చెప్పారు.

## 597% నిధులు విడుదల చేశాం

ఉమ్మడి రాష్ట్రంలో ఐదేండ్లలో ఆర్టీసీకి రూ.712 కోట్లు ఇస్తే.. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రూ.4253 కోట్లు ఇచ్చిందని సీఎం తెలిపారు. మొత్తంగా 597% నిధుల విడుదల పెంచినట్లు చెప్పారు. అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ నష్టం జీహెచ్ఎంసీ భరించాలని చట్టం తెచ్చామని, దాని ప్రకారం ఒక్క సంవత్సరం గ్రాంట్ రూ.330 కోట్లు ఇచ్చారని తెలిపారు. జీహెచ్ఎంసీ నిధులు, ప్రభుత్వ డబ్బులు కలిపి రూ.4550 కోట్లు ఇచ్చామన్నారు. ఏటా సుమారు రూ.900 కోట్ల నిధులిచ్చామని వివరించారు. 'నాకర్థంకావడంలేదు.. ఇంకా ఏమి ఇస్తరు? ఎక్కడి నుంచి ఇస్తరు? ప్రభుత్వానికి ఒక లిమిటేషన్ ఉంటుంది కదా? ఈ బడ్జెట్‌లో రూ.550 కోట్లు పెట్టాం. ఇప్పటికే రూ.425 కోట్లు విడుదలచేశాం. 'మాకు జీతాలకు లేదు.. డీజిల్ లేదు.. సచ్చిపోతం' అని వచ్చి మీదపడితే నిధులు విడుదల చేశాం. ఇంకా ఎక్కడి నుంచి డబ్బులు ఇవ్వాలి?' అని సీఎం ప్రశ్నించారు.

## లాభాల కాలంలో సమ్మె చేస్తరా?

పండుగల సీజన్‌లో ఆర్టీసీకి డబ్బులు ఎక్కువ వస్తాయని, అందులోనూ కోట్లమంది జరుపుకొనే దసరా, బతుకమ్మ పండుగలు ఆర్టీసీకి లాభాలు ఎక్కువ వచ్చే సమయమని సీఎం కేసీఆర్ చెప్పారు. పండుగల పూట కనీసంగా రూపాయికి రూపాయిన్నర వస్తుందని, అంటే.. రోజుకు రూ.11 కోట్ల ఆదాయం ఉంటే అదనంగా మరో ఐదారు కోట్లు వస్తాయని తెలిపారు. ఇలా రూ.125 నుంచి రూ.175 కోట్లు వస్తుందన్నారు. అటువంటి అద్భుతమైన సమయంలో సమ్మెకు పోయారని చెప్పారు. నోటీసు ఇచ్చి రెండునెలలు అయిందని చెప్తున్నారన్న సీఎం.. 'నోటీస్ ఇవ్వంగనే తెల్లారి దూకుతరా? ముందు సముదాయించే ప్రయత్నం చేస్తరు. ఫలానా రోజు సమ్మెకు పోతమని కార్మికులు ప్రకటించారు. నేను కమిటీ వేశాను. 'ప్రభుత్వంలో విలీనం అంత సులువు కాదు. గుడ్డిగా కలుపరాదు. సమయం పడుతుంది. సమ్మెకు పోకండి. ఆదాయం పోతది. ముందే మీ పరిస్థితి బాగాలేదు. చర్చిద్దాం..' అని చెప్పినా.. లెక్కచేయకుండా సమ్మెకు పోయారు' అని చెప్పారు. ఇదే సమయంలో ఆర్టీసీ వినతిమేరకు వంద కోట్లు ఇచ్చామని, వాటిని కిస్తీలకు కట్టేశారని, ఫలితంగా ఇప్పుడు ఆర్టీసీ వద్ద ఏడెనిమిది కోట్లే మిగిలాయని తెలిపారు. మరోవైపు పండుగ సీజన్‌లో అదనంగా వచ్చే రూ.150 కోట్లు పోయిందన్నారు. ప్రస్తుతం సంస్థకు రూ.5 వేల కోట్ల అప్పులున్నాయని, ఒక్కనెల కిస్తీ కట్టకపోతే ఆర్టీసీ ఎన్పీఏ అవుతుందని తెలిపారు. ఎక్కడైనా ఉద్యోగుల పీఎఫ్ సొమ్ము ప్రభుత్వం తీసుకుంటుందా? అని ప్రశ్నించారు. ఏటా సంస్థకు రూ. 1200 కోట్ల నష్టం వస్తున్నదని, ఉద్యోగ విరమణ పొందే కార్మికులకు రిటైర్మెంట్ ప్యాకేజీ ఇచ్చే పరిస్థితి ఆర్టీసీకి లేదని అన్నారు.

## బస్టాండ్లు అమ్మి జీతాలు ఇవ్వాలి

ఆర్టీసీ దగ్గర రూపాయి లేకుండా చేసుకున్నారని, ప్రస్తుతం ఆర్టీసీకి వచ్చే రోజువారీ 11 కోట్ల ఆదాయాన్ని ముంచుతున్నారని సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది వారి పిచ్చిపనికి నిదర్శనమన్నారు. దీనివల్ల ఆర్టీసీ మరింత నష్టాల్లోకి పోయే ప్రమాదం ఉన్నదని చెప్పారు. ఈ నెల 28న హైకోర్టులో కేసు విచారణ ఉన్నదని, కానీ హైకోర్టుకు తీర్పు చెప్పే పవర్‌లేదని అన్నారు. కేసును ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్‌కు రెఫర్‌చేసిన క్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్తుందన్నారు. కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతే మీ దగ్గర ఉన్న ఆస్తులను అమ్మి జీతాలు ఇవ్వాలని లేబర్ డిపార్ట్‌మెంట్ ఆర్టీసీని ఆదేశిస్తుందని చెప్పారు. తప్పని పరిస్థితుల్లో నాలుగు బస్టాండ్లు లేదా బస్సులు అమ్మి సెప్టెంబర్ జీతాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లేకుంటే ఆర్టీసీ ఆస్తులను వేలంవేసే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. బ్యాంకుల వాయిదా చెల్లించకుంటే ఎన్పీఏ అయ్యే మరో ప్రమాదం ఉంటుందని చెప్పారు. మాకు కార్మికుల డిమాండ్లు అంగీకరించండని చెప్పే అధికారం లేదు.. కానీ సాధారణ ప్రజలు కష్టపడకుండా చూడాలి.. అని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ కోసం చాలామంది పనిచేశారని, ఒక్క ఆర్టీసీవాళ్లే పనిచేయలేదని అన్నారు. యూనియన్లు పనికిమాలిన, అర్థరహితమైన పిచ్చి డిమాండ్లతో ఆర్టీసీని నడుపుతామంటే కుదరదని స్పష్టంచేశారు. ఇష్టంవచ్చినవాళ్లు ఉంటారని, లేనివారు ఉండరని అన్నారు.

## ఆర్టీసీ కార్మికులు మంచివాళ్లే

ఆర్టీసీ కార్మికులు, అధికారులు మంచివాళ్లేనని, వారు చాలా సమర్థులని సీఎం కేసీఆర్ అన్నారు. ఆర్టీసీకి చాలా అవార్డులు కూడా వచ్చాయని గుర్తుచేశారు. కార్మికులు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, పంచాయితీ అంతా యూనియన్లదేనని చెప్పారు. యూనియన్ల విషకౌగిలి నుంచి బయటపడితేనే కార్మికులు బతుకుతారని అన్నారు. విధుల్లో చేరటంపై కార్మికులు ఆలోచించుకోవాలని సూచించారు. 'నీ రక్తం నీవే పీల్చుకుంటున్నవు. నీ ఆర్టీసీని నీవే కాలబెట్టుకుంటున్నవు. సంస్థ కొమ్మను నరుక్కుంటున్నవు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఆర్టీసీని ఎవరు చెడగొడుతున్నారు? ముఖ్యమంత్రా, మంత్రా? వచ్చే ఆదాయం రాకుండా ప్రభుత్వం ఆపుతున్నదా?' అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల గురించి ఆలోచిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వారు ఎలాంటి డెడ్‌లైన్లు పెట్టలేదని తెలిపారు.

## హుజూర్‌నగర్ ప్రజలకు రుణపడి ఉంటాం

హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ప్రజలు ఆలోచనతో ఓట్లేశారని, ఎంతమంది ఎన్ని దుర్మార్గాలు చేసినా.. సంక్షేమానికే పట్టంకట్టారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. హుజూర్‌నగర్ ప్రజలందరికీ రుణపడి ఉంటామని చెప్పారు. ఈ ఉపఎన్నికలో అధికారమార్పిడి జరిగేదేమీలేకపోయినా.. పనిచేస్తున్న ప్రభుత్వానికి టానిక్‌లాగా ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఇదే సీటును తాము ఏడువేల ఓట్ల తేడాతో ఓడిపోయామని, కానీ ఇప్పుడు దాదాపు 50వేల మంది ఓటర్లు టీఆర్ఎస్ వైపు మళ్లారని చెప్పారు. ప్రజలు ఏ ఆశలతో తమను గెలిపించారో వందశాతం వాటిని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అనివార్య కారణాలతో తాను హుజూర్‌నగర్ బహిరంగసభకు హాజరుకాలేదని, అయినా ప్రజలు భారీ మెజార్టీతో తమ అభ్యర్థిని గెలిపించినందుకు స్వయంగా వారికి ధన్యవాదాలు తెలిపేందుకు శనివారం వెళుతున్నానని చెప్పారు. హుజూర్‌నగర్‌లో కృతజ్ఞతసభకు అనుమతి కూడా వచ్చిందని తెలిపారు. వాళ్ల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తానని ప్రకటించారు.

## ప్రతిపక్షాలు పంథా మార్చుకోవాలి

ప్రతిపక్షాలు ఇకనైనా పంథా మార్చుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు.ఎదుటివాళ్లను నిందించడమే రాజకీయం అనుకోవటం సరైంది కాదన్నారు. కొత్తరాష్ట్రంలో పునర్నిర్మాణ క్రమంలో మనల్ని మనమే శపించుకోవడం, రాజకీయాల కోసం పచ్చి అబద్ధాలు చెప్పడం, నెగెటివ్ కోణాన్ని ప్రచారం చేయడం మంచిది కాదన్నారు.ఏ అంశాన్ని ఎత్తుకోవాలో తెలియక గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా.. పిచ్చిపిచ్చిగా ప్రచారం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉంటేనే మంచిదన్న సీఎం.. ఆ ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా ఉండాలని, సద్విమర్శలు చేయాలని ఆకాంక్షించారు. బీజేపీవాళ్లు రోజుపెట్టే పెడబొబ్బలకు వాళ్లకు వచ్చిన ఓట్లకు పోలిక చూస్తే నవ్వాల్నా.. ఏమనుకోవాలో అర్థంకావటంలేదని చెప్పారు. కేసీఆర్‌ను తిడితేనే పెద్దోళ్లం అవుతామనుకుంటే కరెక్ట్‌కాదన్నారు. ప్రజాస్వామ్యంలో సహనం అవసరమని, అహంభావాలు, ఆహంకారాలు మంచివి కాదన్నారు.

## రాష్ట్రాభివృద్ధే మా టాస్క్

టీఆర్ఎస్ ఎన్నో గొప్ప విజయాలు సాధించిందని, కానీ ఎప్పుడూ గర్వపడలేదని సీఎం కేసీఆర్ చెప్పారు. హుజూర్‌నగర్ విజయంతో గర్వపడవద్దని, మరింత బాధ్యత పెరిగిందనుకుని, సంస్కారవంతంగా పనిచేయాలని పార్టీ క్యాడర్‌కు, నాయకులకు సూచించారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు, నేతల కంటే ప్రధాన కర్తవ్యం టీఆర్ఎస్‌కు ఉన్నదని, తెలంగాణ తెచ్చినవాళ్లం కాబట్టి రాష్ట్రం మంచిచెడ్డలను సీరియస్‌గా తీసుకున్నామని తెలిపారు. ఈ అంశాలను ప్రత్యేక టాస్క్‌గా తీసుకున్నామని, రాజకీయాలుగా తీసుకోలేదని చెప్పారు. తెలంగాణ అనుభవించిన కష్టాలు తమకు స్పష్టంగా తెలుసన్నారు. కొన్నింటికి తక్షణ రిలీఫ్ కావాలని నిక్కచ్చిగా పనిచేస్తున్నామని, ఈ క్రమంలోనే విద్యుత్, తాగునీటి సమస్యలను ముందుగా పరిష్కరించామని చెప్పారు. కొద్దిరోజుల్లో రాష్ట్రంలో తాగునీటి సమస్య అసలే ఉండదని, సాగునీటి ఇబ్బందులు కూడా ఉండవని స్పష్టంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తికావచ్చిందని, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులు పూర్తికావస్తున్నాయని, దేవాదుల కూడా 90% పూర్తి అయిందని వివరించారు. ఈ నాలుగు పూర్తయితే తెలంగాణ బాగుపడుతుందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు ఊహించని విధంగా అమలవుతున్నాయని తెలిపారు.

## సీఎం హెలికాప్టర్‌లో డబ్బులు తీసుకుపోతరా?

హుజూర్‌నగర్ ఉపఎన్నిక సందర్భంగా ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేసి నవ్వులపాలయ్యాయని సీఎం కేసీఆర్ విమర్శించారు. వాళ్లు ఎంత గందరగోళం చేసినా తాము సాదాసీదాగా పనిచేశామని చెప్పారు. కొన్ని పార్టీలు ఎన్నిక వాయిదాకు ప్రయత్నించాయన్నారు. మంత్రుల కార్లను సైతం చెక్‌చేశారని, ప్రచారానికి వెళ్లేవారిని ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. చివరకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌ను కూడా చెక్ చేయాలని ఫిర్యాదు చేశారని చెప్పారు. 'సీఎం హెలికాప్టర్‌లో డబ్బులు తీసుకుపోతరా? వినటానికే జోక్‌లా ఉన్నది' అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ప్రజాస్వామ్యంలో ఎవరికైనా అవకాశం ఉంటుందని, ఆ అధికారాన్ని నిర్ణయించేది ప్రజలేనని చెప్పారు. రాజకీయ నాయకులం కర్తలంకాదని, అధికారం ఉన్నా, లేకున్నా మిడిసిపాటు, అహంకార ధోరణి మంచిది కాదని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

## పేరుపేరునా ధన్యవాదాలు

టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించిన హుజూర్‌నగర్ ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు చెప్తున్నానన్నారు. హుజూర్‌నగర్‌లో గతంలో శంకరమ్మను పెట్టి ఓడిపోయామని, తర్వాత సైదిరెడ్డిని నిలిపి కూడా ఓటమి పాలయ్యామన్న సీఎం.. చివరకు అద్భుత విజయం సాధించామన్నారు. ముందు ఏడువేల ఓట్ల మైనస్‌లో ఉంటే ఇప్పుడు 43 వేల పైగా మెజార్టీకి పోయినమంటే ప్రభుత్వ పనితీరు, సంక్షేమమే నిదర్శనమన్నారు.

## త్వరలోనే గల్ఫ్ ప్రయాణం

తెలంగాణలోని కొన్ని జిల్లాల ప్రజలు గల్ఫ్ దేశాలకు వెళ్లి సమస్యల్లో చిక్కుకుంటున్నారని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. బీహార్, రాజస్థాన్ నుంచి ఉపాధికోసం హైదరాబాద్‌కు వస్తుంటే, ఇక్కడివాళ్లు మాత్రం గల్ఫ్‌కు వెళుతున్నారన్నారు. ఉన్నత చదువులు చదివినవారు గల్ఫ్ వెళ్తే మంచి అవకాశాలు ఉన్నాయని, కానీ.. చదువులేనివారు వెళ్లి చిక్కుకుపోతున్నారని చెప్పారు. పది పన్నెండు నియోజకవర్గాల్లో ఇది పెద్దసమస్యగా ఉన్నదన్నారు. మనవాళ్లు ఎక్కువగా వెళ్తున్న దేశాలు తిరిగి, వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటామని చెప్పారు.

## రెవెన్యూ ఉద్యోగులది పిచ్చి ఆలోచన

రెవెన్యూ ఉద్యోగులు తమను తీసేస్తరనే పిచ్చి ఆలోచన చేస్తున్నారని, ఎవరో పిచ్చోడు చెప్తే నమ్ముతున్నారని సీఎం కేసీఆర్ అన్నారు. ఉద్యోగాలు తీసివేసేది లేదని, అవసరంమేరకు సర్దుబాటుచేస్తారని స్పష్టంచేశారు. భూముల వ్యవహారంలో ఎవరికీ రూపాయి లంచం ఇవ్వకుండా, ముఖ్యంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలన్నదే లక్ష్యమని చెప్పారు. రిజిస్ట్రేషన్లు ఏ రోజుకారోజు, పారదర్శకంగా కావాలన్నారు. అవసరమైతే కంక్లూజివ్ టైటిల్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఎవరూ శాశ్వతం కాదన్న సీఎం.. గతంలో ఉన్న పటేల్ పట్వారీ వ్యవస్థను మార్చితేనే వీఆర్వోలు వచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం వద్దనుకుంటే పక్కకు జరుగాలని, మేమే కర్తలం అనే పరిస్థితి ఎవరికీ ఉండదని చెప్పారు. ప్రజలు వద్దనుకుంటే సీఎంను సైతం పీకేస్తారని అన్నారు. భూరికార్డులు స్పష్టంగా ఉన్న దేశాల్లో 3శాతం జీడీపీ పెరుగుతున్నదన్నారు. దాన్ని ఆశించి కొత్త రెవెన్యూ చట్టంపై ఆలోచన చేశాం తప్ప ఉద్యోగులను, వ్యక్తులను టార్గెట్ చేసేందుకుకాదని స్పష్టంచేశారు. పోడు సమస్యకు పరిష్కారం వందశాతం తమతోనే అవుతుందని సీఎం కేసీఆర్ చెప్పారు. ఈ మేరకు గిరిజన ప్రజాప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. రెవెన్యూ, అటవీ, సంబంధిత అధికారులతో జిల్లాలవారీగా ప్రజాదర్బార్ పెట్టి, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

## నవంబర్‌లోపే మున్సిపల్ ఎన్నికలు

**గ్రామాల** మాదిరిగానే పట్టణాలను అభివృద్ధిచేస్తామని సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు. కోర్టు కేసులు తేలగానే నవంబర్‌లోపే మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. రాష్ట్రంలో పంచాయతీ, మున్సిపల్ చట్టాలు తీసుకువచ్చామని, రెవెన్యూ చట్టం తేవాల్సి ఉన్నదని అన్నారు. పంచాయతీలకు ప్రతినెలా రూ.339 కోట్లు విడుదల చేస్తున్నామని, మున్సిపాలిటీలకు కూడా రూ.1030 కోట్లు 14వ ఆర్థికసంఘం నిధులున్నాయని, వీటికి సమానంగా బడ్జెట్‌లో పెట్టామని, మొత్తం రూ.2060 కోట్లు రాష్ట్రంలోని 141 పురపాలక సంస్థలకు ఇస్తామని వివరించారు. కొత్త నాయకత్వం ఆధ్వర్యంలో వెంటనే నిధులు విడుదలచేసి, అక్కడ కూడా నెల లేదా 20 రోజులపాటు పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని తీసుకోవాలనే ఆలోచనతో ఉన్నామని తెలిపారు.

## ఏడాదిలోపే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు



జర్నలిస్టులకు ఏడాదిలోపే ఇండ్లస్థలాలు ఇచ్చే బాధ్యత తనదని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. మాట ఇస్తే తప్పనని అన్నారు. సుప్రీంకోర్టులో కేసు ఉన్నదని, దానిపై సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డిని ఢిల్లీకి పంపించామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని ఎడిటర్లు, బ్యూరోచీఫ్‌లకు కూడా ఇండ్లస్థలాలు రాలేదన్నారు. ప్రతి జర్నలిస్టుకు ఇండ్లస్థలాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. హౌసింగ్ స్కీం కూడా పెట్టుకుందామని, దీనికి నిధులు ఇస్తానని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే జర్నలిస్టుల సంక్షేమానికి ఎవ్వరూ ఇవ్వనివిధంగా నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిధులు మంచిగా ఉపయోగం అవుతున్నాయన్నారు. ఎవరైనా జర్నలిస్టులు చనిపోయినా, జబ్బుపడినా సహాయం చేస్తున్నారని తెలిపారు. వచ్చే బడ్జెట్‌లో మరో రూ.100 కోట్లు కేటాయిస్తున్నామన్నారు.

## బీజేపీ నేతల వితండవాదం

**రాష్ట్రంలో** బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని సీఎం కేసీఆర్ విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం రెండోసారి గెలిచిన తర్వాత 2019లో బడ్జెట్ సమావేశాల్లో కొత్త చట్టం తెచ్చారని, దానిలో సెక్షన్ 67లో 'పవర్ టు ద స్టేట్స్ టు కంట్రోల్ ఆర్టీసీస్' అని స్పష్టంగా ఉన్నదని తెలిపారు. 1950లో నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు తెచ్చిన చట్టం ప్రకారం అన్ని రాష్ట్రాలలో ఆర్టీసీని నెలకొల్పారని, ఆ చట్టాన్ని సవరిస్తూ.. ఆర్టీసీలే ఉండాల్సిన అవసరం లేదని, ప్రైవేటు పర్మిషన్లు ఇచ్చుకునే సంపూర్ణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు కట్టబెట్టారని చెప్పారు. ఫలితంగా పోటీ ఉంటుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని చట్టంలో పేర్కొన్నారని వివరించారు. గతంలో ఒక్క బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉన్నప్పుడు ఒక్క ఫోన్ కావాలంటే ఎమ్మెల్యేలకు కూడా నాలుగునెలలు పట్టేదని, ఇప్పుడు కుప్పలుతెప్పలు వచ్చాయని ఉదహరించారు. ఒకప్పుడు ఎయిర్ ఇండియా ఒక్కటే ఉంటే.. ఇప్పుడు ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ వచ్చాయన్నారు. ఇలా పోటీ పెరిగి ధరలు కూడా ప్రత్యేక సమయాల్లో తక్కువగా ఉంటున్నాయని తెలిపారు. ఆర్టీసీలోనూ ఇటువంటి పోటీ ఉంటే ప్రజలకు మెరుగైన రవాణాసౌకర్యాలు అందుతాయని చెప్పారు. తాము చేసేది తప్పయితే ప్రధానమంత్రి బిల్లు తప్పా? అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని స్థానిక బీజేపీ నాయకులను అడగాలని మరో విలేకరి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆర్టీసీ కార్మికులు మా ఇష్టం వచ్చినప్పుడు విధులకు పోతాం అంటే ఇదైమేనా సంస్థనా? పిల్లల ఆటా? వారికి పద్ధతి, నియంత్రణ ఉండదా? అని నిలదీశారు. అదిలేకనే విచ్చలవిడితనం పెరిగిపోయిందని చెప్పారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా ప్రజలకు రవాణాసౌకర్యం అందుబాటులో ఉండేలా ప్రయత్నిస్తున్నదని తెలిపారు. చట్టప్రకారం ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వచ్చే ఐదారురోజుల్లో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. 'నేను, రవాణామంత్రి కూర్చొని ఒక సంతకం పెట్టి, నాలుగురోజుల్లో 7 వేల బస్సులకు పర్మిట్లు ఇచ్చేస్తాం. ఆర్టీసీ అద్దె బస్సులు కాదు.. 6, 7 వేల బస్సులకు పర్మిట్లు ఇచ్చేస్తే రయ్యిమని తిరుగుతాయి. ప్రజలు ఇక చాలు అనేవరకు తిప్పుతాం. ఇంతకన్నా తక్కువ చార్జీలతో సర్వీసులు నడుపుతాం. ఏ రూటుకైనా పర్మిషన్ ఇస్తాం' అని సీఎం తెలిపారు. బాధ్యతగల ప్రభుత్వంగా చివరి అవకాశంగా మధ్యప్రదేశ్, బెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలే వలె చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

### మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టు సమస్యలపై స్పందించి, ఇంటిస్థలాల అంశాన్ని పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అకాడమీ తరఫున చేసిన పనిని గుర్తించి, అభినందించడంతోపాటు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు నిధులు పెంచడంపై దృష్టిపెడతానని సీఎం పేర్కొనడం హర్షణీయమని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు మీడియా అకాడమీ అనే స్థలం ఉన్నదని ప్రత్యేకంగా సీఎం పేర్కొనడం ఆనందం కలిగించిందని అల్లంనారాయణ పేర్కొన్నారు.

## నేడు ప్రభుత్వానికి ఆర్టీసీ నివేదిక!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల 21 డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ సమగ్ర నివేదిక రూపొందించినట్టు సమాచారం. శుక్రవారం సాయంత్రంలోగా లేదా శనివారం ప్రభుత్వానికి నివేదికను అందించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కార్మికుల డిమాండ్ల పరిష్కరించే సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఆర్థిక సలహాదారులతో ప్రభుత్వం కమిటీ నియమించింది. కమిటీ సభ్యులు బుధ, గురువారాల్లో బస్‌భవన్‌లో చర్చలు జరిపారు. 21 డిమాండ్లలో కొన్ని విధాన పరమైనవిగా, మిగతావి ఆర్థిక పరమైనవిగా కమిటీ గుర్తించింది. ఆర్టీసీకి నష్టం కలుగకుండా, ఆర్థికభారం పడకుండా రెండురకాల ప్రతిపాదనలు రూపొందించినట్టు సమాచారం. ప్రాథమిక నివేదికపై ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మతో గురువారం రాత్రి వరకు రవాణాశాఖ కార్యాలయంలో చర్చించారు. ఎండీ సూచనలను జోడించాక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందజేయనున్నట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రభుత్వం సమాలోచనలు జరిపి 28 జరిగే విచారణ సందర్భంగా హైకోర్టు ముందుంచనున్నట్టు సమాచారం.

### ముహూర్తం

సూర్యోదయం: 6.12 గంటలకు

సూర్యాస్తమయం: 5.44 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, ద్వాదశి సాయంత్రం 7.07 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: పుబ్బ ఉదయం 10.59 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: ఉదయం 5.12 నుంచి 6.39 వరకు, రాహుకాలం: ఉదయం 10.32 నుంచి 11.58 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.31 నుంచి 9.17 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.21 నుంచి 1.07 వరకు, వర్జ్యం: ఉదయం 11.21 నుంచి మధ్యాహ్నం 12.47 వరకు.

### లోకం పోకడ





# టీఆర్‌ఎస్‌కు జీ హుజూర్









హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండల కేంద్రంలో సంబురాలు జరుపుకుంటున్న టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



సూర్యాపేట కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తూ విజయ సంకేతం చూపుతున్న శానంపూడి సైదిరెడ్డి




శానంపూడి సైదిరెడ్డి గెలుపొందినట్టు ప్రకటించాక కౌంటింగ్ కేంద్రంలో విజయసంకేతం చూపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిశోర్ తదితరులు

## పల్లాకు కేసీఆర్ అభినందనలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్ విజయానికి కృషిచేసిన ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సీఎం కేసీఆర్ అభినందించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పల్లాను కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గంలో పార్టీ నాయకుల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రచార ప్రణాళిక, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడం, ప్రత్యర్థుల ఎత్తుకు పైఎత్తులు వేయడంలో పల్లా వ్యవహరించిన తీరుతో పార్టీకి ఘన విజయం సాధ్యమైందని కేసీఆర్ చెప్పారు. నియోజకవర్గంలోని నేరేడుచర్ల టౌన్ ఎన్నికల ఇంచార్జిగా వ్యవహరించి మంచి మెజార్టీ తీసుకువచ్చేలా కృషిచేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌కు కూడా సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు.

**అద్భుతమైన విజయం: కేటీఆర్**

ఉపఎన్నికల్లో అద్భుతమైన విజయాన్ని అందించిన హుజూర్‌నగర్ ప్రజలకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు కృతజ్ఞతలు తెలిపారు. సైదిరెడ్డిని ట్విట్టర్ ద్వారా అభినందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. సీఎం కేసీఆర్ బహిరంగసభ రద్దయినా.. పీసీసీ అధ్యక్షుడు ప్రాతినిధ్యం వహించిన స్థానంలో టీఆర్‌ఎస్‌కు అద్భుతమైన విజయాన్ని అందించారన్నారు. మీడియాలో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీజేపీ, కాంగ్రెస్‌ను విశ్వసించలేదని పేర్కొన్నారు. రెండు జాతీయ పార్టీలను తిరస్కరించారని అన్నారు.

**కేసీఆర్‌పై అచంచలమైన విశ్వాసం: మాజీ ఎంపీ కవిత**

సీఎం కేసీఆర్‌పై అచంచలమైన విశ్వాసాన్ని ప్రదర్శించి , టీఆర్‌ఎస్ పార్టీకి అపురూపమైన విజయాన్ని అందించిన హుజూర్‌నగర్ ప్రజలకు ధన్యవాదాలు అని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ విజయం కోసం నిరంతరం శ్రమించిన టీఆర్‌ఎస్ కుటుంబసభ్యులందరికీ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

**నమ్మకానికి తార్కాణం: ఎంపీ సంతోష్‌కుమార్**

హుజూర్‌నగర్ ప్రజలకు రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నిక ఫలితం కేసీఆర్‌పై ప్రజలు ఎంత విశ్వాసం, నమ్మకంతో ఉన్నారో తెలుపుతున్నదని అన్నారు. తెలంగాణలో గెలువాలంటే కేసీఆర్ కంటే ఎక్కువగా తెలంగాణను ప్రేమించగలగాలి.. కేసీఆర్ మీద ద్వేషంతో తెలంగాణలో గెలవడం అసంభవమని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కేసీఆర్ తరువాత టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు మాత్రమే వ్యూహాన్ని అందిపుచ్చుకున్నారని తెలిపారు.

### తెలంగాణ భవన్‌లో సంబురాలు

హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్ భారీ విజయం సాధించడంపై తెలంగాణ భవన్‌లో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. టీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి సంబురాల్లో పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ విజయోత్సాహంలో తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ కార్యకర్తలు

## రికార్డు బ్రేక్‌చేసిన శానంపూడి

**సూర్యాపేట, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించి శానంపూడి సైదిరెడ్డి రికార్డు బ్రేక్ చేశారు. హుజూర్‌నగర్ శాసనసభ నియోజకవర్గానికి ఇప్పటివరకు ఏడుసార్లు ఎన్నికలు జరుగగా.. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాధించిన మెజార్టీయే ఇప్పటివరకు అత్యధికం. తాజాగా 43,233 ఓట్ల మెజార్టీ సాధించి శానంపూడి సైదిరెడ్డి గతంలో మెజార్టీని బ్రేక్ చేశారు.

## చపాతీ రోలర్‌దే మూడోస్థానం



**నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో కారు జోరు మాత్రమే కాదు.. కారును పోలిన చపాతీ రోలర్ గుర్తూ పెద్ద సంఖ్యలో ఓట్లు దక్కించుకున్నది. స్వతంత్ర అభ్యర్థి సపావత్ సుమన్ 2,697 ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. బీజేపీ నాలుగు, టీడీపీ అయిదో స్థానానికి పరిమితమయ్యాయి. మఠంపల్లి మండలానికే చెందిన సుమన్ ఎక్కడా ప్రచారం నిర్వహించలేదు. అయినప్పటికీ అతడికి కేటాయించిన గుర్తు కారును పోలిఉండటంతో ఓటర్లు పొరబాటున చపాతీ రోలర్‌కు ఓటువేసినట్టు తెలుస్తున్నది. మొత్తం 28 మంది పోటీచేసిన హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఈవీఎంలలో 27వ స్థానంలో ఉన్న కారును పోలిన చపాతీ రోలర్ గుర్తు మూడో స్థానంలో నిలవడంచ ర్చనీయాంశమయింది. గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కారును పోలిన ట్రక్కు గుర్తుకు 4,944ఓట్లు పోలవడంతో టీఆర్‌ఎస్సై దిరెడ్డిఓ డిపోయిన సంగతి తెలిసిందే.

# కుట్రలు ఛేదించినం

టీఆర్‌ఎస్‌ను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు • కాంగ్రెస్ నేతలకు చెంపపెట్టు

26న హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభ: మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టిండ్రు: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా: సైదిరెడ్డి

**సూర్యాపేట టౌన్:** 'కుట్రలెన్నింటినో ఛేదించి హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో ప్రజలందరి ఆశీర్వాదంతో అఖండ విజయాన్ని సాధించినం.. 60 ఏండ్ల నిర్లక్ష్య పాలనను ఎండగట్టి.. కేవలం ఐదేండ్ల కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధికి చిరునామాగా మారిన టీఆర్‌ఎస్ పార్టీకే హుజూర్‌నగర్ ప్రజలు పట్టంకట్టారు. విపక్షాలన్నీ ఏకమైనా.. టీఆర్‌ఎస్ పార్టీని ఢీకొనలేక ఘోర పరాజయం పాలయ్యాయి. కాంగ్రెస్ నాయకుల అహంకారానికి ఈ విజయం చెంపపెట్టు. సీఎం కేసీఆర్‌పై విశ్వాసానికి ప్రతీకగా ప్రజలంతా ఏకమై గులాబీ జెండాకు జై కొట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.' అని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితాల అనంతరం సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించడంలో కృషిచేసిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనూహ్యమైన మెజార్టీని అందించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఏకమై తమ పార్టీ నాయకులను ఎన్ని ఇబ్బందులు పెట్టినా సంయమనం పాటించి చివరి నిమిషం వరకు పనిచేశారని సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శనంలో అన్ని స్థాయిల్లో క్యాడర్ పనిచేసిందని పేర్కొన్నారు. అందరి కృషి.. శ్రమ వల్లనే ఇంత ఘనవిజయాన్ని సాధించామని.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఈ ఫలితాలు పునరావృతమవుతాయని మంత్రి తెలిపారు. ప్రతిపక్షాలు అడ్డగోలుగా మాట్లాడినా.. ప్రజలంతా ఏకపక్షంగా నిలిచారన్నారు. ఈ నెల 26 సాయంత్రం 4 గంటలకు హుజూర్‌నగర్‌లో నిర్వహించే కృతజ్ఞత సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఉప ఎన్నిక దెబ్బతో కాంగ్రెస్ పీడ విరగడైందని, కాంగ్రెస్ కంచు కోటలు బద్దలు చేశామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయంతో హుజూర్‌నగర్ దశ తిరుగుతుందని అభివృద్ధికి ముఖద్వారంగా మారుతుందని జగదీశ్‌రెడ్డి చెప్పారు.



సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ పల్లా, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, శానంపూడి సైదిరెడ్డి తదితరులు

**గొప్ప విజయం: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

సీఎం కేసీఆర్‌పై ప్రగాఢ విశ్వాసం చాటుతూ హుజూర్‌నగర్ ప్రజలు గొప్ప తీర్పునిచ్చారని, కాంగ్రెస్ అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టారని హుజూర్‌నగర్ ఉప ఎన్నికకు టీఆర్‌ఎస్ ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ బీజేపీ ఒక్కటైనా ప్రజలు అన్నీ గమనించి గొప్ప విజయాన్ని టీఆర్‌ఎస్‌కు అందించారని చెప్పారు.

**అభివృద్ధికి పాటుపడతా: శానంపుడి సైదిరెడ్డి**

హుజూర్‌నగర్ అభివృద్ధి కోసం జరిగిన ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని శానంపూడి సైదిరెడ్డి అన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల ఆకాంక్షను నెరవేర్చుతానని.. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుతానని తెలిపారు. అందరి సహకారంతో హుజూర్‌నగర్‌ను అభివృద్ధికి ముఖద్వారంగా మారుస్తానని చెప్పారు. తనకు అవకాశమిచ్చి.. విజయానికి అహర్నిశలు కృషిచేసిన సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బొల్లం మల్లయ్య యాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, టీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ పాల్గొన్నారు.



## సైసై టీఆర్‌ఎస్

> మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ 69,737ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ నెల 21న పోలింగ్ ముగిశాక హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌దే హవా అని తేల్చిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి కారు గుర్తు ఆధిక్యత ప్రదర్శించింది. గురువారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన కౌంటింగ్‌లో 22 రౌండ్ల మేరకు ఓట్లు లెక్కించగా ఏ ఒక్క రౌండ్‌లోనూ కాంగ్రెస్ పోటీ ఇవ్వలేకపోయింది. మూడు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే కాంగ్రెస్ స్వల్ప ఆధిక్యం వచ్చింది. చెప్పుకోదగ్గస్థాయిలో ఓట్లు సాధిస్తామని ఆశలు పెట్టుకొన్న బీజేపీ నాలుగోస్థానంలో, టీడీపీ ఐదో స్థానంలో నిలిచాయి. స్వతంత్ర అభ్యర్థి సపావత్ సుమన్.. ఈ రెండు పార్టీలను వెనక్కి నెట్టి.. 2697 ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. బీజేపీకి 2639 ఓట్లు, టీడీపీకి 1827 ఓట్లు పోలయ్యాయి.

**రౌండ్.. రౌండ్‌కీ ఆధిపత్యం**

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ గోదాములో పటిష్ఠ భద్రత నడుమ హుజూర్‌నగర్ ఓట్ల లెక్కింపు కొనసాగింది. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం 302 పోలింగ్‌స్టేషన్లు ఉండగా.. 14 టేబుళ్ల ద్వారా 22 రౌండ్లు ఓట్లు లెక్కించారు. మొదట సర్వీసు ఓట్లు లెక్కించారు. మొత్తం 101 సర్వీసు ఓట్లలో 16 ఓట్లు పోలవగా.. 13 చెల్లకుండా పోయాయి. మిగిలిన మూడింటిలో టీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి ఒక్కోఓటు వచ్చింది. తొలిరౌండ్‌లోనే టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి 2,476 ఓట్లతో స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించారు. రెండో రౌండ్‌లో 1872 ఓట్లు.. మూడో రౌండ్‌లో 2549 ఓట్లు.. నాలుగో రౌండ్‌లో 1183 ఓట్లు.. ఇలా ప్రతీ రౌండ్‌కూ టీఆర్‌ఎస్ ఆధిక్యం పెరుగుతూపోయింది. ప్రతీ రౌండ్‌లోనూ కాంగ్రెస్ కంటే కనీసం 1500 నుంచి 2 వేల ఓట్లకు పైగా ఆధిక్యం సాధిస్తూ.. మొత్తం 22 రౌండ్లలో కలిపి 43,358 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించింది. ప్రతి మండలంలోనూ టీఆర్‌ఎస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. హుజూర్‌నగర్‌లో 8,693, గరిడేపల్లిలో 8,357, నేరేడుచర్లలో 7,073 ఓట్లు, చింతలపాలెంలో 5,122, మేళ్లచెర్వులో 6,630, పాలకీడులో 2,761, మఠంపల్లిలో 4,607 ఓట్ల మెజారిటీ వచ్చింది. మఠంపల్లి మండలానికి చెందిన 133వ ఈవీఎం మొరాయించడంతో అందులోని వీవీ ప్యాట్ స్లిప్‌లను లెక్కించారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం సైదిరెడ్డికి రిటర్నింగ్ అధికారి చంద్రయ్య గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉప ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇలాఖాలో టీఆర్‌ఎస్ అఖండ విజయం సాధించడంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా గులాబీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నాయి. టీఆర్‌ఎస్ కార్యకర్తలు పలుచోట్ల పటాకులు కాల్చడంతోపాటు స్వీట్లు పంచుకున్నారు.

**టీఆర్‌ఎస్‌కు 56 శాతం ఓట్లు**

ఉపఎన్నికల బరిలో 28మంది ఉన్నా కూడా కాంగ్రెస్ మినహా మిగిలిన పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు కనీసం డిపాజిట్ కూడాదక్కలేదు. టీఆర్‌ఎస్ అభ్యర్థికి 56.34, కాంగ్రెస్ అభ్యర్థికి 34.74శాతం ఓట్లు వచ్చాయి. తర్వాత స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి సపావత్ సుమన్‌కు 2,697 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 1.31, టీడీపీకి 0.91 ఓట్లు వచ్చాయి.

## సైరా సైదిరెడ్డి

ఎన్నారై నుంచి ఎమ్మెల్యేగా శానంపూడి

అంకిరెడ్డి ఫౌండేషన్ ద్వారా సేవాకార్యక్రమాలు

కామాక్షి సొసైటీతో పేద విద్యార్థులకు ప్రోత్సాహం

**హుజూర్‌నగర్, నమస్తేతెలంగాణ:** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన శానంపూడి సైదిరెడ్డి తల్లిదండ్రులు శానంపూడి అంకిరెడ్డి, సత్యవతి. అంకిరెడ్డి గుండ్లపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. 1974 ఏప్రిల్ 18న జన్మించిన సైదిరెడ్డి 10వ తరగతి వరకు మఠంపల్లి మండల కేంద్రంలోని వీవీఎం హైస్కూల్‌లో చదివారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, ప్రియదర్శిని కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. 2002 అక్టోబర్ 25న రజితారెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు అంకిరెడ్డి, అనిరుధ్‌రెడ్డి ఉన్నారు. ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లిన సైదిరెడ్డి అక్కడే ఉద్యోగం సంపాదించారు. కేసీఆర్ చేపట్టిన తెలంగాణ ఉద్యమానికి ప్రభావితమయిన ఆయన కెనడాలో తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ ఏర్పాటుచేసి ఉద్యమానికి మద్దతు అందించారు. కెనడాలో ఉంటూనే తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విస్తృత అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక సొంత ప్రాంతానికి సేవ చేసేందుకు స్వగ్రామానికి తిరిగివచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించారు. తనతండ్రి పేరిట ఏర్పాటుచేసిన అంకిరెడ్డి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. కామాక్షి సొసైటీ ద్వారా నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 1999 నుంచి 2000 వరకు మఠంపల్లి మండల టీడీపీ అధ్యక్షుడిగా, కామాక్షి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్, రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ పోగ్రాం చైర్మన్‌గా వ్యవహరించారు. 2018 సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. అయినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డితో మాట్లాడి రూ.80 కోట్ల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధిపరిచారు.



హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శానంపూడి సైదిరెడ్డి (ఫైల్)

## గెలిపించిన వ్యూహం

- పక్కా ప్రణాళికతో ఘనవిజయం సాధించిన టీఆర్‌ఎస్
- రోడ్‌షో, సమీక్షలతో ఉత్సాహం నింపిన మంత్రి కేటీఆర్
- సైలెంట్‌గా కాంగ్రెస్‌ను ఖతంచేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి
- పార్టీ ఆదేశాలను పక్కాగా అమలుచేసిన నేతలు, శ్రేణులు



గరిడేపల్లిలో టీఆర్‌ఎస్ శ్రేణుల గెలుపు సంబురాలు

**నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి అద్భుత విజయం సాధించింది. నోటిఫికేషన్ వెలువడిన రోజే అభ్యర్థిని ప్రకటించింది మొదలు ప్రతివిషయంలోనూ పక్కా ప్రణాళికతో ముందుకెళ్లింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామాతో ఉపఎన్నిక జరిగిన ఈ స్థానంలో సాధారణ ఎన్నికల్లో స్వల్పతేడాతో ఓటమిచెందిన సైదిరెడ్డినే టీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి బరిలో నిలిపింది. నోటిఫికేషన్‌కు ముందే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతోపాటు కాంగ్రెస్ నుంచి పెద్దసంఖ్యలో ముఖ్యనేతలను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించడంలో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మినరల్ ఫండ్‌కార్డ్‌తో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. సంక్షేమ పథకాలను సైతం పక్కాగా అమలయ్యేలా చూశారు. 30 రోజుల పల్లె ప్రణాళికతో ప్రచార పటాటోపాలకు దూరంగా వ్యూహాత్మకంగా పనిచేశారు. ఉప ఎన్నికల ఎన్నికల ఇంచార్జిగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించడంతోపాటు.. ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు సైతం వేర్వేరుగా ఎన్నికల బాధ్యులను టీఆర్‌ఎస్ అధిష్ఠానం నియమించింది. ఎవరికి వారు తమ బాధ్యతలను పక్కాగా, అధిష్ఠానం ఆదేశాల మేరకు అమలు చేసి.. పార్టీ ఘనవిజయం సాధించడంలో సఫలీకృతులయ్యారు. గత ఎన్నికల్లో ఓడినా నియోజకవర్గంలో ప్రతిపల్లెను చుట్టి వచ్చిన సైదిరెడ్డి.. ప్రజల మధ్యలోనే ఉండటం ప్రధాన సానుకూల అంశంగా మారింది. సైదిరెడ్డితోపాటు గ్రామాలు, వార్డులు, మండలాల్లో విస్తృత ప్రచారం చేపట్టిన టీఆర్‌ఎస్ కార్యకర్తలు.. పోలింగ్ రోజు కూడా చివరివరకూ అహర్నిషలు పనిచేశారు. హుజూర్‌నగర్ రోడ్‌షోలో పాల్గొని యువతతోపాటు పార్టీ క్యాడర్‌కు సరికొత్త ఉత్సాహం నింపిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. పార్టీ బాధ్యులతో సమీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేశారు. ప్రచారం చివరి అంకంలో ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ ప్రచార సభ భారీవర్షంతో రద్దయినా.. పార్టీశ్రేణులు నిరుత్సాహపడకుండా టీఆర్‌ఎస్ నాయకులంతా సమిష్టిగా పనిచేసి టీఆర్‌ఎస్‌కు తిరుగులేని విజయం అందించారు.

## ప్రతిపక్షాలకు చెంపపెట్టు

హుజూర్‌నగర్ ఫలితాలపై రాష్ట్ర మంత్రుల స్పందన

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** హుజూర్‌నగర్ ప్రజలు సైదిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్, బీజేపీ నేతలకు గట్టి గుణపాఠం నేర్పారని రాష్ట్ర మంత్రులు అన్నారు. గురువారం తుది ఫలితం వెలువడిన తర్వాత వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై ప్రజల విశ్వాసానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. సైదిరెడ్డి అద్భుత విజయంతో హుజూర్‌నగర్ ప్రజలు కాంగ్రెస్ బీజేపీ నేతల గూబ గుయిమనిపించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేసిన ప్రతిపక్ష నేతలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నేతల అతి పోకడలకు హుజూర్‌నగర్ ప్రజలు గుణపాఠం చెప్పారని మైనార్టీ, ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు ఈ ఎన్నిక చెంపపెట్టని.. ఇండిపెండెంట్ కంటే తక్కువ ఓట్లు సాధించి డిపాజిట్ కోల్పోవడం ఆ పార్టీకి సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరుకు హుజూర్‌నగర్ ఫలితమని విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ గెలుపుతో టీఆర్‌ఎస్ పార్టీ చరిత్రను తిరగరాసిందని తెలిపారు. సైదిరెడ్డికి ఏకపక్షంగా ఓట్లువేసి గెలిపించిన ఓటర్లకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు టీఆర్‌ఎస్‌పై, సీఎం కేసీఆర్‌పై మరోసారి విశ్వాసాన్ని కనబర్చారని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఎప్పుడూ సీఎం కేసీఆర్ వెంటే ఉంటుందని పదే పదే రుజువవుతున్నా విపక్షాలు తమ వికృతచేష్టలు మానుకోవడంలేదని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ ఎన్నికల్లో విజయంపై భ్రమల్లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు టీఆర్‌ఎస్ సాధించిన ఘనవిజయం గుణపాఠమని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఏదో జరుగుతుందని దింపుడుకళ్లం ఆశలు పెట్టుకొన్న ప్రతిపక్షాలను సరైన జవాబిచ్చారని తెలిపారు. రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించి గెలువాలని ప్రయత్నించిన వారంతా విఫలమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కనుమరుగు కాబోతున్నదని శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు శ్రీరామరక్షగా నిలిచేది టీఆర్‌ఎస్ మాత్రమేనన్న ప్రజల విశ్వాసానికి హుజూర్‌నగర్ ఫలితం తిరుగులేని తార్కాణమని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా టీఆర్‌ఎస్‌దే విజయమని.. విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా హుజూర్‌నగర్ ప్రజలు నమ్మలేదని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి చెప్పారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై నియోజకవర్గ ప్రజలకు నమ్మకం పోయిందని తెలిపారు. సీఎం కేసీఆర్ పరిపాలనాదక్షతకు నిదర్శనం హుజూర్‌నగర్ గెలుపని.. మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. సీఎంపై తమకున్న అచంచల విశ్వాసంతో టీఆర్‌ఎస్‌కు అత్యధిక మెజార్టీని అందించిన హుజూర్‌నగర్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షాలకు క్యాడర్‌తోపాటు ప్రజలు దూరమయ్యారన్నారు. అర్థంలేని ఆరోపణలు చేయడం వల్ల లాభం లేదని ప్రజలు ఈ తీర్పుతో జవాబిచ్చారని చెప్పారు.



మహారాష్ట్ర ప్రజలు ఎన్డీయేను అమితమైన ప్రేమతో ఆశీర్వదించారు. వారి ప్రేమకు మేం రుణపడి ఉంటాం. మహారాష్ట్ర అభివృద్ధి కోసం మేం మరింత కృషిచేస్తాం. గెలుపునకు కృషిచేసిన బీజేపీ, శివసేన కార్యకర్తలందరికీ నా వందనాలు.

**నరేంద్రమోదీ, ప్రధాని**

అమిత్ షా మా ఇంటికి వచ్చినప్పుడు మాట్లాడిన మాటలను ఇప్పుడు గుర్తుచేయదల్చుకున్నా. మేం 50:50 ఫార్ములా పునాదిగా ఐక్యతకు నిర్ణయించాం. మేం బీజేపీ కన్నా కొన్ని సీట్లు తక్కువ పోటీ చేయటానికి ఒప్పుకున్నాం. ప్రతిసారి వారికే అధికారాన్ని అప్పగించే అవకాశం ఇవ్వం. మా పార్టీ వృద్ధి కోసం అవకాశం ఇవ్వాలి.

**ఉద్ధవ్ థాక్రే, శివసేన అధినేత**



**చరిత్రలో నేడు**



**1760**

గ్రేట్ బ్రిటన్ రాజుగా జార్జ్-3.

**1870**

పోస్టుకార్డును తొలిసారిగా ఉపయోగించిన అమెరికా.





**1941**

రష్యా రాజధాని మాస్కోపై దాడిచేసిన జర్మనీ.

ప్రతిదానికి మొదట్లోనే మీడియా ముందుకువచ్చి మాట్లాడటం మంచి పద్ధతి కాదు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు కూడా క్రికెటర్ల చర్యల గురించి బహిరంగంగా మాట్లాడటం, వారి చర్యల్లో కుట్ర దాగి ఉందని చెప్పడం సరైన పద్ధతి కాదు. సమ్మెకు దిగిన క్రికెటర్లు మొదట తమ డిమాండ్లను బోర్డు ముందుపెట్టారు. ఆరు నెలలుగా పరిష్కారం లభించలేదు. అందువల్లనే నిరసన వ్యక్తం చేశారు. క్రికెట్ బోర్డు మీడియాతో మాట్లాడే ముందు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తే బాగుండేది.

**ది డైలీ స్టార్**

హాంకాంగ్‌లో ఆందోళనల మూలంగా దెబ్బ తిన్న పర్యాటకరంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం పథకాలను ప్రకటించింది. దాదాపు నలభై దేశాలు హాంకాంగ్ సందర్శించకూడదంటూ తమ పౌరులకు హెచ్చరికలు చేశాయి. దీంతో పర్యాటకులు మూడోవంతు తగ్గారు. ఇంత సంక్షోభంలోనూ హాంకాంగ్ పర్యటించేవారు ఇంకా ఉండటం సంతోషకరం. ఆహ్లాదకరమైన, భద్రత గల నగరంగా హాంకాంగ్ తన పేరు నిలుపుకోవాలె. ప్రభుత్వం ఇప్పుడున్న రాజకీయ సంక్షోభాన్ని చల్లార్చినప్పుడే పర్యాటకరంగం పుంజుకుంటుంది.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**



# తగ్గిన ప్రభ

మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తి, వ్యవసాయ సంక్షోభ ప్రభావం స్పష్టంగా వ్యక్తమయ్యాయి. మహారాష్ట్రలో అధికార కూటమి అధిక సీట్లు సాధించుకొని అధికారాన్ని కాపాడుకోగలిగినప్పటికీ, గతంలో పోలిస్తే సీట్ల సంఖ్య భారీగా తగ్గింది. హర్యానాలోనైతే 75 సీట్లు ఆశించిన బీజేపీ మెజారిటీకి అవసరమైన 46 స్థానాలు కూడా సాధించుకోలేకపోయింది. ఒకటి అరా మినహాయిస్తే పలు మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ బీజేపీ రెండు రాష్ర్టాల్లో విజయదుందుభి మోగిస్తుందని, భారీ సీట్లు సాధిస్తుందని వెల్లడించాయి. కాంగ్రెస్ పార్టీ నాయక త్వ సంక్షోభంలో పడి పోటీ ఇవ్వలేకపోతున్న భావన కలిగించాయి. మహారాష్ట్రలో ప్రతిపక్ష శిబిరం నుంచి భారీగా బీజేపీలోకి చేరికలు సాగుతున్నాయనే వార్తలు వెలువడ్డాయి. ప్రతిపక్షం నిశ్శేషమైందనీ, యుద్ధానికి ముందే ఓడిపోయిందనే అభిప్రాయం ఏర్పడ్డది. బీజేపీతో పోలిస్తే ప్రతిపక్షం బలహీనంగా ఉన్నమాట నిజమే. పోటీ అసమానుల మధ్య సాగినట్టు కనిపించింది. కానీ ఎవరు ఎంత బలవంతులనేది నిర్ణయించేది ఓటర్లే అనేది ఈ రెండు రాష్ర్టాల ఎన్నికలు మరోసారి గుర్తు చేశాయి. బీజేపీకి సీట్లు మాత్రమే కాదు, ఓట్ల శాతం కూడా భారీగా తగ్గిపోయింది. గత లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలోని మొత్తం పది సీట్లను బీజేపీ గెలుచుకున్నది. ఒక్క సీటు తెచ్చుకోని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ హర్యానాలో అధికారం అందుకోవడానికి ప్రయత్నిస్తున్నది. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీ పునాదులు పదిలంగానే ఉన్నాయి. అధికార కూటమికి బలమైన పోటీని ఇవ్వడం విశేషం.

**ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడం ద్వారా మాత్రమే అధికారాన్ని కాపాడుకోవాలనే పోకడ ఎల్లవేళలా పనిచేయదని బీజేపీ పెద్దలు గ్రహించాలె. కులాల లెక్కలు కట్టి కూడగట్టడమనే పద్ధతి దీర్ఘకాలంగా పార్టీకి చెరుపు చేస్తుంది. దేశాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వ్యవసాయ సంక్షోభం ఇందులో ప్రధానమైనది. గ్రామీణ ప్రాంతంలో సంప్రదాయ జీవన విధానం ధ్వంసమైంది. నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అనేక ఉద్యమాలు పుట్టుకవస్తున్నాయి. బీజేపీ ఇప్పటికైనా సామాజిక-ఆర్థిక సమస్యలపై దృష్టిసారించాలె. కాంగ్రెస్ పార్టీ కూడా నాయకత్వ లోపంతో ఎక్కువకాలం నెట్టుకురావడం తగదు.**

హర్యానా శాసనసభలోని మొత్తం 90 స్థానాలలో 75 గెలుచుకోబోతున్నట్టు బీజేపీ నాయకులు ప్రచారం సాగించారు. ఎగ్జిట్ పోల్స్ కూడా బీజేపీ దాదాపుగా 70 స్థానాలు తెచ్చుకుంటుందని వెల్లడించాయి. కానీ నలభై స్థానాల దగ్గరే ఆగిపోయింది. బీజేపీ ఓట్ల శాతం భారీగా తగ్గిపోవడం కూడా గమనార్హం. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి 58 శాతం ఓట్లు లభించాయి. ఈసారి 36 శాతం మాత్రమే తెచ్చుకోగలిగింది. 22 శాతం ఓట్లు తగ్గడంతో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు పరాజయం పొందారు. హర్యానాలోని 31 అసెంబ్లీ స్థానాలలో జాట్‌లకు తిరుగులేని ఆధిపత్యం ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా కూడా రాజకీయంగా పట్టుగల సామాజిక వర్గమిది. ఈ జాట్ వర్గమంతా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించడమే ఆ పార్టీకి శాపంగా మారింది. బీజేపీ జాట్ వర్గానికి చెందని వ్యక్తిని ముఖ్యమంత్రి పీఠంపై ప్రతిష్ఠించడంలో తప్పేమీ లేదు. కానీ ఆ పార్టీ వ్యవహారసరళి ఒక సామాజిక వర్గాన్ని వ్యతిరేకిస్తూ, మిగతా కులాలను కూడగడుతున్న రీతిలో సాగింది. ఈ వైఖరే బీజేపీ ప్రాభవాన్ని దెబ్బకొట్టింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పుల్వామా, బాలాకోట్ ఘటనలను ప్రచారం చేసుకోవడం, జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయ కూటమి లేదా నాయకుడు కనిపించకపోవడం బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలలో ఈ జాతీయ అంశాలు ప్రాధాన్యం పొందుతాయా అనే చర్చ ఎప్పుడూ ఉంటుంది. ఈ సారి కూడా బీజేపీ కశ్మీర్ అంశాన్ని ప్రచారానికి ఎక్కువగా ఉపయోగించుకున్నది. కానీ అసెంబ్లీ ఎన్నికలలో మోదీ నాయకత్వం, దేశభద్రత అనేవి ప్రధానాంశాలుగా ముందుకురాలేదు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో జరిగిన అసెం బ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ అస్త్రాలు పనిచేయలేదు.

ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడం ద్వారా మాత్రమే అధికారాన్ని కాపాడుకోవాలనే పోకడ ఎల్లవేళలా పనిచేయదని బీజేపీ పెద్దలు గ్రహించాలె. కులాల లెక్కలు కట్టి కూడగట్టడమనే పద్ధతి దీర్ఘకాలంగా పార్టీకి చెరుపు చేస్తుంది. దేశాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వ్యవసాయ సంక్షోభం ఇందులో ప్రధానమైనది. గ్రామీణ ప్రాంతంలో సంప్రదాయ జీవన విధానం ధ్వంసమైంది. నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అనేక ఉద్యమాలు పుట్టుకవస్తున్నాయి. బీజేపీ ఇప్పటికైనా సామాజిక-ఆర్థిక సమస్యలపై దృష్టిసారించాలె. కాంగ్రెస్ పార్టీ కూడా నాయకత్వ లోపంతో ఎక్కువకాలం నెట్టుకురావడం తగదు. రాజకీయ పక్షానికి ప్రతి ఎన్నిక ఒక యుద్ధం వంటిది. ప్రతిదానికి తగిన వ్యూహంతో ముందుకురావాలె. కాంగ్రెస్ నాయకత్వం ఎన్ని తప్పులు చేసినా పార్టీ పునాది మాత్రం దృఢంగానే ఉన్నది. మహారాష్ట్ర, హర్యానా రాష్ర్టాలలో బీజేపీ తరపున అనేకమంది సీనియర్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ పదహారు సభల్లో, అమిత్ షా 25 సభల్లో పాల్గొన్నారు. కానీ రాహుల్‌గాంధీ ఏడు సభల్లో మాత్రమే పాల్గొన్నారు. పైగా ఆయన కార్యకర్తలను ఉత్తేజితులను చేయలేరనేది తెలిసిందే. సోనియాగాంధీ ఒక్క సభలో కూడా పాల్గొనలేదు. కాంగ్రెస్ నాయకత్వం హర్యానాలో జేజేపీతో పొత్తు పెట్టుకోగలిగితే బీజేపీ స్థానాలు ఇంకా తగ్గిపోయేవి. దేశంలో ఒక బలమైన ప్రతిపక్ష కూటమి లోపం లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనే కనిపించింది. ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ, ప్రాంతీయ పార్టీలు కృషిచేయాలె. ఇదొక ఎన్నికలఅ వసరంగా కాకుండా ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసేదిగా భావించాలె.

**జనగళం**

### వెలుగుల దీపావళి

దివ్వెల పండుగ దీపావళి వచ్చిందంటే చాలు అందరిలో ఆనందం వెల్లివిరుస్తుంది. మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఎన్నో పౌరాణిక విశేషాలతో ముడిపడిన దీపావళి ఎంతో మహిమాన్వితమైనది. దుష్ట విక్షణకు, శిష్ట రక్షణకు ప్రతీకగా అమావాస్య రోజున ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకునే వెలుగుల పండుగే దీపావళి. ఈ రోజు రాత్రి పల్లెలు మొదలుకొని పట్టణాల వరకు దీపకాంతులతో కనువిందుచేస్తాయి. బాణాసంచా వెలుగులతో నింగీనేల ధగధగలాడిపోతాయి. అహంకారాన్ని అణిచివేసి, చెడుపై విజయం సాధించడంతో పిల్లలు, పెద్దలు ఆనందంగా జరుపుకుంటారు. 'చెడు' అనే చీకటిని పారదోలి 'మంచి' అనే వెలుగును నింపడమే దీపావళి. ఈ దీపావళి అందిరకి సుఖశాంతులు మిగిల్చాలి.

**- కాయల నాగేంద్ర, హైదరాబాద్**

### నిర్మాణాత్మకంగా వ్యవహరించాలె

ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. అంతేగానీ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేయడాన్ని ప్రజలు పట్టించుకోరు. హుజూర్‌నగర్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదే. ప్రతిపక్షనేతలు మీడియా ముందుకురాగానే పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. ముఖ్యమంత్రి, వారి కుటుంబపై వ్యక్తిగత విమర్శలు చేయడానికే ఉత్సాహం చూపారు. కానీ ప్రజలు ఏం అనుకుంటున్నారన్నది గ్రహించలేదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించవద్దని ఎవరూ అనలేదు. కానీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడవద్దు అని ప్రజలు పరోక్షంగా ఈ ఉప ఎన్నిక ఫలితం ద్వారా చూపెట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాల్సిన ప్రతిపక్ష నేతలు తమ వ్యక్తిగత రాజకీయ లబ్ధి కోసమే ప్రాధాన్యం ఇచ్చారు. కొందరి నేతల వ్యవహారశైలి ఎట్లా ఉన్నదన్నది సామాజిక మాధ్యమాల్లో వైరలయింది. బాధ్యతాయుతంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు ఇట్లా వ్యవహరించడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరులో ఏవైనా లోపాలుంటే ఎత్తిచూపాలి. వాటిని సరిచేసుకోవాలని ప్రభుత్వానికి తగిన సూచనలివ్వాలి. కానీ ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేయడాన్ని సరికాదు. ఈ వాస్తవాలను గ్రహించకుండా ప్రతిపక్ష నేతలు ఎన్ని ఫీట్లు చేసినా ఫలితం ఉండదని మరోసారి రుజువైంది. కాబట్టి ఇకనైనా ప్రతిపక్ష నేతలు హుందాగా, నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి.

**- డి.వైకుంఠం, సిద్దిపేట**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**విశ్లేషణ**

**హుస్సేన్ ఇండోర్‌వాలా**

# నగరాభివృద్ధి అందరి అవసరం

**దేశ నగరాల అభివృద్ధిని ప్రజల జీవనవిధానాల వెలుగులో చూడాలి. నగరం అంటే బహుముఖ కోణం. నగరంలో నివసిస్తున్న ఏ ఒక్కరి అవసరం కూడా నిర్లక్ష్యానికి, విస్మరణకు గురికాకూడ దు. ఎందుకంటే ఈ నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం, పాత్ర ఉన్నది. కాబట్టి అన్నివర్గాల ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు ప్రతిఫలనంగా నగరాలు అభివృద్ధి చెందాలి. వాటి నిర్మాణం జరుగాలి.**

ముంబై ఆరె కాలనీ ప్రాంతంలో మెట్రో ప్రాజెక్టులో భాగంగా కారు షెడ్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన నాలుగు పిటిషన్లను ముంబై హైకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో ముంబై మెట్రోరైలు కార్పొరేషన్ వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న 2,646 చెట్ల లో 2,134 చెట్లను 24 గంటల్లో నరికివేసింది. దీంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. స్థానికులు చెట్లను నరికివేయవద్దంటూ సుప్రీంకోర్టుకు వెళ్లటంతో ఆ చెట్ల నరికివేతను నిలిపివేయాలంటూ ఆదేశించింది.

ఇదిలా ఉంటే నివాసాల కోసం మరో ప్రత్యామ్నాయ స్థలం లేనందున చెట్లను తొలిగించక తప్పదని ప్రభుత్వం పట్టుబడుతున్నది. అంతేగాక మరో స్థలాన్ని తీసుకోవాలంటే ఆర్థికంగా తలకుమించిన భారమంటున్నది. ఆరె ప్రాంతం సంజయ్‌గాంధీ నేషనల్ పార్క్‌కు సమీపాన 1,200 హెక్టార్లలో విస్తరించి ఉన్న పచ్చని చెట్లతో నిండి ఉన్నది. అదికాకపోతే, బంద్రా కుర్ల కాంప్లెక్స్ (బీకేసీ) ప్రాంతం ప్రభుత్వ భూమిగా ఉన్నది. దాంట్లో కార్ల షెడ్లను నిర్మించుకోవచ్చు. ఆ ప్రాంతంలో ముంబై మెట్రో తలచినట్లు వసతుల సౌకర్యాలను ఏర్పాట్లు చేసుకోవచ్చు. కానీ ఆ ప్రాంతంలో ఉన్న రియల్ ఎస్టేట్ కారణంగా భూమి రేట్లు ఆకాశాన్నంటినట్లు ఉన్న తీరు ప్రభుత్వానికి పెనుభారంగా తయారైంది. అభివృద్ధి, వ్యాపారపరంగా చాలా లాభకరమైన ఆ ప్రాంతంలో మెట్రో వసతులకు డీపీఆర్ (డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారుచేయాల్సిన అవసరం ఉన్నది.

బంద్రా కుర్ల కాంప్లెక్స్ (బీకేపీ) 1990లో మైతీ నదీతీరంలో వ్యాపార జిల్లాగా ప్రకటించబడిందన్న విషయం మరువరాదు. దీని ఫలితంగానే ముంబైలో 2005లో వరదలకు కారణమై వందలాది మంది మరణించారు. ఈ మధ్యనే సుప్రీంకోర్టు తెలిపిన ప్రకారం.. బీకేసీ రూపకల్పన కోసం మెట్రో రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఎంఆర్‌డీఏ)నే మైతీ తీరాన్ని ఎక్కువ శాతం ఆక్రమించింది. ఈ నేపథ్యంలోంచే బీకేసీ మూలంగానే అతిఎక్కువ విధ్వంసం జరిగింది. కాబట్టి ఆ ప్రాంతంలో 30 హెక్టార్ల భూమిని దురాక్రమణ నుంచి విముక్తి చేసి వరద ప్రమాదాన్ని నివారించాలని భావిస్తున్నది. అలాగే అసలు విషయమేమంటే.. నగర ప్రాంతాల్లోనే భూముల నుంచి ఆదాయాన్ని సముపార్జించి నగరాల అభివృద్ధికి కృషిచేయాల్సి ఉన్నది. ఈ క్రమంలో నగర ప్రాంతాల్లో పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే ప్రజల జీవనవిధానాలను మెరుగుపర్చాల్సిన ఆవశ్యకత ఉన్నది. నగర జీవిత ప్రగతికాముక అభివృద్ధి విధానాలతో అన్నిరకాల సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కలుగాలి.అలాగే మౌలిక వసతుల కల్పన, సాంస్కృతిక విభిన్నతను పరిరక్షించాలి. ఈ క్రమంలో నగరాల్లోని భూమికి పెరుగుతున్న విలువలు ప్రాతిపదికగా నగర జీవితం సమగ్రాభివృద్ధికి పునాది కావాలి. ఈ విధమైన పరిస్థితులతోనే నగరాల్లో వృద్ధి జరుగాలి. ఈ నేపథ్యంలోంచే నగరాలు భూమికగా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెంది, అదే నగరాల రూపురేఖలను, అభివృద్ధిని నియంత్రించే స్థితి ఏర్పడింది. శామ్యూల్ స్టేయిన్ రాసిన పుస్తకం 'క్యాపిటల్ సిటీ'లో రియల్ ఎస్టేట్ రంగమే ప్రభుత్వాలను, రాజకీయాలను శాసించే స్థితి ఏర్పడింది. ఒకరకంగా రియల్ ఎస్టేట్ రంగమే నగరాల రూపురేఖలను శాసిస్తున్నస్థితిలో ప్రజల జీవితం ఉన్నది. ఈ క్రమంలోంచే ముంబై నగరం రియల్ ఎస్టేట్ రాజ్యం చేతిలో ఉన్నది.

ఈ క్రమంలో మనం చూస్తే.. భారతీయ నగరాల్లో ఇలాంటి అభివృద్ధి ప్రాజెక్టులే అమలు జరుగుతున్నాయి. ఇలా వచ్చినవే మెట్రో షెడ్ ఆరె, పశ్చిమ తీర రోడ్డు, ఉప్పు తయారీ ప్రాజెక్టులు, శతాబ్దాల చరిత్ర గల బీడీడీ తదితరాలున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద మురికి వాడగా ప్రసిద్ధి చెందిన ధారవి ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న ప్రజలున్నారు. పోర్ట్ ల్యాండ్, భెండీ బజార్ కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ ప్రాంతాలన్నీ రియల్ ఎస్టేట్ రంగం లాభాల దృష్టితో చేసిన విధ్వంసాలకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతాలన్నింటా పర్యావరణాన్ని రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా ధ్వంసం చేసింది.

భారతీయ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం చేస్తున్న మాయ అంతా ఇంతా కాదు. మొదట వారు భూమి నుంచి లాభాలు గడించటం కోసం భూమి కొరతను సృష్టిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు అనువైన పరిస్థితులు కలిగిన నివాసాల ఏర్పాటు ఎలా జరుగుతుంది? ఉప్పు తయారీ కోసం భూముల్లో ఉప్పుమళ్లను ఎలా ఏర్పాటుచేస్తారు. మెట్రో యార్డులను ఎలా నిర్మిస్తారు. అడవులను నరికివేయటం ఎంతగా చేస్తారు. తీర ప్రాంత అభివృద్ధి, జాతీయ రహదారుల నిర్మాణం ఇలాంటి అనేక అభివృద్ధి పథకాలతో ప్రజలకు నివాసాలకు భూమి ఎక్కడి నుంచి తెస్తారు. అంటే పేదల నుంచి భూమిని గుంజి, వారి జీవితాలను దుర్భరం చేసి అభివృద్ధి చేస్తామంటున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆధీనంలోని మూసేసిన పరిశ్రమలు, బీకేసీ తదితరాల నుంచి భూమిని సేకరించవచ్చు. వీటిలోనే అవసరమైన షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపార కేంద్రాలు, షాపింగ్‌మాల్‌లు, విలాస గృహాలకు కేటాయించవచ్చు.

**నగరంలో ఏదీ ఒక వర్గం తోడ్పాటుతో, భాగస్వామ్యంతో మాత్రమే ఉనికిలోకి రాదు. ప్రతీది సమిష్టి భాగస్వామ్యంతో మాత్రమే ఉనికిలోకి వస్తుంది. కాబట్టి ప్రతి నిర్మాణం సమిష్టి ప్రయోజనం కోసమై ఉండాలి. నగరాల అభివృద్ధి ఈ సామాజిక దృష్టికోణంలోంచి చూసినప్పుడే అర్థమవుతుంది. ఏ కొద్ది మందికి మాత్రమే ప్రయోజనకరంగా ఉండేవిధంగా ఉండరాదు.**

నగరాల అభివృద్ధిలో భాగంగా ప్రజా రవాణా కోసం చేపట్టిన సబ్ అర్బన్ రైళ్లు, మెట్రోల నిర్మాణంతో అనుసంధానం పెరుగుతుంది. ఈ క్రమంలో భూముల విలువ అమాంతం పెరిగిపోతుంది. కానీ ముంబయి నగరంలో అనుసరించిన ప్రజా రవాణా విధానంతో భూముల విషయం మరింత సంక్లిష్టంగా మారిపోయింది. మెజార్టీ ప్రజల ప్రయోజనాలు నెరవేరి వారి అభ్యున్నతికి ఉపయోగపడే బదులు ధనవంతులకే అనుకూలంగా మారింది. ఇదేవిధంగా ఉత్తరం నుంచి దక్షిణానికి నిర్మించిన పశ్చిమ తీర రోడ్డు నిర్మాణంతో ప్రజల జీవన విధానానికి ఎంత ఉపయోగపడిందో కానీ, వారికి భూములు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో కూడా ధనవంతు నివాసాలకు, విలాస భవనాలకు మరింత విలువను చేర్చి వారికే ఎక్కువ ఉపయోగపడింది. ఇదేవిధంగా ప్రవేశపెట్టిన మెట్రో రైలు కూడా పేదల నివాస ప్రాంతాలను కలుపుతూ వారికి ఉపయోగడిన దానికన్నా ఉన్నవారికే ఉపయోగకరంగా మారింది.

నగరాల్లో భూమి కొరత కారణంగా కూడా అది అంతిమంగా ధనవంతులకే ప్రయోజనకారిగా మారింది. పేదలు, మురికివాడల్లో నివసించేవారు, ఫుట్‌పాత్‌లపై జీవితాలను వెల్లదీసేవారు మరింత దుర్భర పరిస్థితులకు నెట్టబడ్డారు.

ముంబై డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ (బీడీడీ)నే తీసుకుంటే.. 1920 ప్రాంతంలో 35 హెక్టార్ల స్థలంలో 16 చదరపు మీటర్ల స్థలంతో 15,238 కుటుంబాలకు నివాస గృహాలను నిర్మించారు. నివాసస్థలాన్ని రెండింతలు చేసినా ఆ స్థలంలో వారందరికీ నివాస గృహాలను నిర్మించి ఇవ్వవచ్చు. పెరిగిన శాస్త్ర పరిజ్ఞానం అభివృద్ధి విధానాలతో మరింత మెరుగైన స్థితిలో నివాసాలను ఏర్పాటుచేయవచ్చు. 1991 నుంచి అమలుచేస్తున్న రెండో అభివృద్ధి కార్యక్రమంలో కూడా ముంబై అభివృద్ధి ప్రణాళికలు కూడా సామాజికాభివృద్ధికి దోహదపడేలా ప్రజా అవసరాలను తీర్చలేదు.

ఈ నేపథ్యంలోంచే దేశ నగరాల అభివృద్ధిని ప్రజల జీవనవిధానాల వెలుగులో చూడాలి. నగరం అంటే బహుముఖ కోణం. నగరంలో నివసిస్తున్న ఏ ఒక్కరి అవసరం కూడా నిర్లక్ష్యానికి, విస్మరణకు గురికాకూడదు. ఎందుకంటే ఈ నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం, పాత్ర ఉన్నది. కాబట్టి అన్నివర్గాల ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు ప్రతిఫలనంగా నగరాలు అభివృద్ధి చెందాలి. వాటి నిర్మాణం జరుగాలి. అందుకోసం.. నగరాల అభివృద్ధికి ప్రత్యేకమైన ఒకేఒక విధానం, కోణం, ఒకే నైతిక సామాజిక విలువ మాత్రమే పరిపూర్ణ అర్థాన్ని ఇవ్వదు. అలాకాకుండా ఒకేవిధమైన దృష్టికోణం, విలువతో బహుళత్వం లోపిస్తే అది డిస్నీ ల్యాండ్ అవుతుందే కానీ, నగరం కాబోదు.

అందుకోసం నగరాల్లో అన్నింటికీ మూలమైన భూమి సమిష్టి ప్రయోజనం కోసమై ఉండాలి. మనం గుర్తుంచుకోవాల్సిందిదే.. నగరంలో ఏదీ ఒక వర్గం తోడ్పాటుతో, భాగస్వామ్యంతో మాత్రమే ఉనికిలోకి రాదు. ప్రతీది సమిష్టి భాగస్వామ్యంతో మాత్రమే ఉనికిలోకి వస్తుంది. కాబట్టి ప్రతి నిర్మాణం సమిష్టి ప్రయోజనం కోసమై ఉండాలి. నగరాల అభివృద్ధి ఈ సామాజిక దృష్టికోణంలోంచి చూసినప్పుడే అర్థమవుతుంది. ఏ కొద్ది మందికి మాత్రమే ప్రయోజనకరంగా ఉండేవిధంగా ఉండరాదు. ఈ నేపథ్యంలోంచే కొన్ని నగర పౌరస్వచ్ఛంద సంస్థలు మెట్రో ఆరె ప్రాజెక్టును, తీర ప్రాంత రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. అభివృద్ధిలో పేదలకు భాగస్వామ్యం, ఫలాలు అందాలని కోరుతున్నారు. రూసో అన్నట్లు.. 'నగరాల్లోని ఐశ్వర్యం అంతా మనందరికి చెందినది. నగరం ఏ ఒక్కరికి చెందినది కాదు'.

**(వ్యాసకర్త: కలమా రహెజా విద్యానిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో ఉపాధ్యాయుడు)**

# పరిశోధనలకు పెద్దపీట వేయాలె

**వర్సిటీలు**



**ప్రొఫెసర్ హెచ్.వెంకటేశ్వర్లు**

విద్యా వ్యవస్థలో 'ఉన్నత విద్య' కీలకమైంది. దేశానికీ దశ-దిశా చూపగల సత్తా ఉన్నదే ఉన్నతవిద్య. ఈ విద్యకు నిలయాలు యూనివర్సిటీలు. దేశ ఆర్థిక సుస్థిరత నిర్మాణంలో యూనివర్సిటీల పాత్ర ప్రధానమైంది. అంతేకాదు, అభివృద్ధికి ఆనవాలుగా నిలిచే కీలక మానవనరుల అభివృద్ధిలో విశ్వవిద్యాలయాల పాత్ర వెలకట్టలేనిది. మొదటిసారిగా మనదేశంలో 1948-49లో డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'ఇండియన్ ఎడ్యుకేషన్ కమిషన్' ఉన్నత విద్య ఆవశ్యకతను గుర్తించింది. మనదేశంలో ఉన్నత విద్య అభివృద్ధి 1950 దశకం నుంచి ప్రారంభమైనది. 1950-51లలో 32 యూనివర్సిటీలు ఉండగా 1990-91 నాటికి వాటి సంఖ్య 190కి పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 48 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 349 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, 325 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 125 డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, 40 వేల వరకు ఉన్నత విద్యా కళాశాలలున్నాయి. 2016 గణాంకాల ప్రకారం, ఉన్నత విద్యలో 18-23 ఏండ్ల వయస్సున్న విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి 24.5 శాతం కాగా అందులో పురుష జనాభా 25.4 శాతం ఉండగా ఆడవారికి సంఖ్య 23.5 శాతం. దేశంలో ఉన్నత విద్యా సంస్థల నియంత్రణ అధికారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లాంటి ఇతర 14 ప్రొఫెషనల్ కౌన్సిల్స్‌కు ఉన్నది. ఉన్నత విద్యను పటిష్ఠపరుచడానికి, అటు కేంద్రం ఇటు యూజీసీ పలురకాల కమిటీలను నియమించింది. వాటిలో ముఖ్యమైనవి, 2005లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిటీ, 2009లో యాశ్‌పాల్ కమిటీ. గమనించదగిన విషయమేమంటే, అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఉన్నత విద్యకు నెలవైన మన విశ్వవిద్యాలయాల సామర్థ్యం ప్రపంచస్థాయికి చేరడం లేదు. ఇటీవల ప్రకటించిన ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకుల్లో మన దేశ విశ్వవిద్యాలయాల పరిస్థితే దీనికి ఉదాహరణ. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్ 2020లో మొదటి 500 స్థానాల్లో ఆరు భారతీయ విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నాయి. మొదటి 300 విశ్వవిద్యాలయాల్లో మన దేశం నుంచి ఒక్క యూనివర్సిటీకి కూడా చోటు లభించలేదు. మనదేశ విశ్వవిద్యాలయాల ప్రస్తుత పరిస్థితుల కారణాలను సూక్ష్మ, స్థూల కారణాలుగా విభజించవచ్చు.

మొదట సూక్ష్మ కారణాలను పరిశీలిస్తే, యూనివర్సిటీ స్థాయిలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ చాలా తక్కువగా ఉండటం, అందులో మహిళా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం శోచనీయం. అలాగే యూనివర్సిటీల విద్యా ప్రమాణాలు కూడా ప్రస్తుత పరిస్థితికి తగ్గట్టుగా లేకపోవడం. మారుతున్న సాంకేతికత, విద్యార్థి అవగాహనా సామర్థ్యం ఇతరత్రా అంశాల పట్ల యూనివర్సిటీల్లోకి ప్రవేశించే నూతన విద్యార్థుల సామర్థ్యం గతేడాది విద్యార్థి కంటే మెరుగ్గా ఉంటున్నాయి. అలాగే ఈ ఎలక్ట్రానిక్ యుగంలో ఉద్యోగ ఉపాధిరంగం నూతన రూపు సంతరించుకుంటుంది. కానీ ఆ స్థాయిలో పాఠ్యంశాల రూపకల్పనలో గానీ, బోధనా పద్ధతుల్లో గానీ మార్పులు లేకపోవడం ఒక లోపంగా చెప్పుకోవచ్చు. తద్వారా నూతన ఉద్యోగావసరాలకు కావలసిన స్థాయిని విద్యార్థి అందుకోలేకపోతుండు. విశ్వవిద్యాలయాలకు నిధుల కొరత వెంటాడుతూనే ఉంటుంది. అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిధుల లేమితో కొట్టిమిట్టాడుతున్నాయి. తద్వారా మౌలిక సదుపాయాల కల్పన కష్టతరమవుతూ, విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాయి. ఇవే కాకుండా పలురకాల సమస్యలు సూక్ష్మస్థాయిలో విశ్వవిద్యాలయాల నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి.

ఇక స్థూలస్థాయి లోపాల్లో అతి ముఖ్యమైనది 'పరిశోధన లేమి'. యూనివర్సిటీల్లో కేవలం బోధనే కాదు, పరిశోధనలు చాలా ముఖ్యం.

**దేశంలో విశ్వవిద్యాలయాల విద్యాభివృద్ధికి ప్రభుత్వం, యూనివర్సిటీలు తగు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వపరంగా వీలైనంత ఎక్కువ నిధులు బడ్జెట్‌లో కేటాయించాలి. దేశంలో ఆర్థికవనరులు పెరుగాలంటే మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించాల్సిందే. దానికోసం ప్రభుత్వా లు పెట్టుబడి చేయక తప్పదు. ముఖ్యంగా, నాణ్యమైన పరిశోధనకు కేటాయింపులో తగు మార్గదర్శకాలు రూపొందించాలి.**

విద్యార్థికి విషయ పరిజ్ఞానమే కాకుండా పరిశోధన పరిజ్ఞానం కూడా ముఖ్యం. అంతేకాకుండా దేశంలో ఎదురయ్యే సవాళ్లకు యూనివర్సిటీలు పరిశోధన ద్వారా పరిష్కారం చూపాలి. ఆర్థికంగా, రాజకీయంగా, సాంకేతికంగా, వ్యాపారంగా ఇలా అన్నిరంగాల్లో దేశం ముందుకుపోతున్నది కానీ, అదేస్థాయిలో కొత్త సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. ఇలాంటి సవాళ్లకు పరిష్కారం చూపాల్సిన యూనివర్సిటీలు వెనుకబడి ఉంటున్నాయి. మన విశ్వవిద్యాలయాల్లో బోధనే కానీ, పరిశోధనకు ప్రాముఖ్యం ఇవ్వలేకపోతున్నాం. వాస్తవానికి, ప్రపంచ విశ్వవిద్యాలయాలతో పోల్చుకుంటే మనదగ్గర పరిశోధనలకు కావలసిన మౌలిక వసతులు లేక ఆ స్థాయిలో సూచన చేసే పరిజ్ఞానం అందిపుచ్చుకోలేకపోతున్నాం. ఇక మరొక సమస్య, విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ జోక్యం. తద్వారా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతినడమే కాకుండా రాజకీయ నిరుద్యోగులకు అడ్డాగా మారుతున్నాయి.

దేశంలో విశ్వవిద్యాలయాల విద్యాభివృద్ధికి ప్రభుత్వం, యూనివర్సిటీలు తగు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వపరంగా వీలైనంత ఎక్కువ నిధులు బడ్జెట్‌లో కేటాయించాలి. దేశంలో ఆర్థికవనరులు పెరుగాలంటే మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించాల్సిందే. దానికోసం ప్రభుత్వాలు పెట్టుబడి చేయక తప్పదు. ముఖ్యంగా, నాణ్యమైన పరిశోధనకు కేటాయింపులో తగు మార్గదర్శకాలు రూపొందించాలి. అంతేకాదు, యూనివర్సిటీల స్వయం సంపత్తికి విఘాతం ఏర్పడకుండా ప్రభుత్వ జోక్యం తగ్గించుకోవాలి. యూనివర్సిటీలు కూడా స్వతహాగా నిధులు సమకూర్చుకునే మార్గాలపై దృష్టిసారించాలి. ప్రభుత్వ సాయంతో పాటు అంతర్గతంగా నిధులు పెంచుకునే మార్గాలపై దృష్టిపెట్టాలి. విశ్వవిద్యాలయాల అఫిలియేషన్ కాలేజీల్లో నాణ్యమైన ప్రమాణాలు పెంపొందించి రాజీలేని చర్యలు చేపట్టాలి. విశ్వవిద్యాలయాల అధ్యాపకులకు సైతం ఏటా పరిశోధనలపరంగా కొన్ని నిర్దేశిత లక్ష్యాలను ఏర్పర్చి వాటిని వారి ప్రమోషన్లకు అనుసంధానం చేసే ప్రక్రియను కఠినతరం చేయాలి. కేవలం, విశ్వవిద్యాలయాల కొలువులు బోధనకు మాత్రమే కాకుండా మన రాష్ర్టానికి, దేశానికీ ఎదురవుతున్న సమస్యలకు పరిశోధనల రూపంలో పరిష్కారాలను చూపేవిధంగా తగు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా యూనివర్సిటీల విద్యార్థులకు ఉద్యోగాలవైపు కాకుండా 'వ్యవస్థాపన'పై ఆసక్తి పెరిగేలా చూడాలి. దానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం నిర్మించిన 'టీ-హబ్' కు విశ్వవిద్యాలయాలను అనుసంధానం చేయాలి. విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే, బోధనా సిబ్బంది నియామకంలో అవకతవకలకు తావులేకుండా బోధన, పరిశోధనపై ఉన్నత ప్రమాణాలు కలిగిన వారిని నియమించాలి. మన విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు ఉత్పత్తి చేసే వ్యవస్థల్లా కాకుండా అవి దేశానికి ఉపయోగపడే మానవ వనరులను, దేశం ఎదుర్కొనే సవాళ్లకు శాస్త్రీయంగా పరిష్కారం చూపేలా తయారుచేసినాడు మాత్రమే ఉన్నత విద్యకు అర్థం, పరమార్థం.

**(వ్యాసకర్త: రిటైర్డ్ ప్రొఫెసర్, ఓయూ)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# రెబల్స్‌తో నష్టపోయాం!

- ఓట్ల శాతం పెరిగింది: దేవేంద్ర ఫడ్నవీస్
- 15 మంది స్వతంత్రులు టచ్‌లో ఉన్నారని వెల్లడి



**ముంబై:** ఈ ఎన్నికల్లో తమకు తిరుగుబాటు అభ్యర్థుల నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని, అయినప్పటికీ రాష్ట్రంలో బీజేపీ-శివసేన కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని మహారాష్ట్ర సీఎం, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. తనతో 15 మంది స్వతంత్రులు సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. 2014 ఎన్నికలతో పోలిస్తే ఈసారి తమ పార్టీ గెలిచిన స్థానాల సంఖ్య కొంత తగ్గినప్పటికీ, గెలుపొందిన స్థానాల నిష్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పునిచ్చిన రాష్ట్ర ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఫడ్నవీస్ గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ-శివసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, అధికారం చేపట్టే అంశంపై ఇరు పార్టీలు ముందు నిర్ణయించినట్టుగా ముందుకు సాగుతాయని అన్నారు. సతారా ఉపఎన్నికలో ఉదయన్ రాజే భోసలే, పర్లి నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి పంకజముండే పరాజయం చెందడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. '2014 ఎన్నికల్లో బీజేపీ 260 స్థానాల్లో పోటీ చేసి 122 సీట్లను గెలిచింది. ఈ ఎన్నికల్లో 164 స్థానాల్లో పోటీ చేసి 105 సీట్లను కైవసం చేసుకున్నది. మా పార్టీ సాధించిన ఫలితం బాగుంది. పోటీ చేసిన వాటిల్లో 70శాతం సీట్లను మేము గెలిచాం. 2014లో బీజేపీకి 28 శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి 164 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ 26.5 శాతం ఓట్లు వచ్చాయి. ఇది గొప్పవిషయం' అని అన్నారు. తన కేబినెట్‌లోని ఆరుగురు మంత్రులు ఓటమి పాలవ్వడానికి గలకారణాల్ని విశ్లేషిస్తున్నట్టు పేర్కొన్నారు.

## ప్రభుత్వాల ఏర్పాటుపై అమిత్‌షాకు అధికారాలు

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర, హర్యానాల్లో ప్రభుత్వాల ఏర్పాటు విషయమై తుది నిర్ణయాధికారాన్ని బీజేపీ అధ్యక్షుడు, హోంమంత్రి అమిత్‌షాకు కట్టబెడుతూ ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు గురువారం నిర్ణయం తీసుకున్నది. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ సిద్ధమైంది. రెండు రాష్ట్రాల్లోనూ సీఎంల మార్పు ఉండబోదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దాం!

బీజేపీయేతరులకు హర్యానా మాజీ సీఎం హుడా పిలుపు



**న్యూఢిల్లీ:** హర్యానాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీయేతర అన్ని పార్టీలు, స్వతంత్రులు, జేజేపీ నాయకులు కలిసి రావాలని ఆ రాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా గురువారం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడే సర్కారులో వారికి గౌరవ మర్యాదలు లభిస్తాయని హామీ ఇచ్చారు. స్వతంత్ర ఎమ్మెల్యేలను అధికారులు నిర్బంధించినట్టు తనకు సమాచారం అందిందని, ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మరోవైపు హర్యానాలో శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలపై సోనియాగాంధీ దృష్టి సారించారు.

## ఖట్టర్ ధన్యవాదాలు

**చండీగఢ్:** బీజేపీకి ఓటు వేసినందుకు రాష్ట్ర ప్రజలకు హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం పెరిగిందన్నారు. మోదీ నేతృత్వంలో గత ఐదేండ్లలో తాము ప్రజలకు సేవ చేశామంటూ, మళ్లీ అధికారం చేపట్టగానే ప్రజా పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.



# 'మహా' కాషాయం

మహారాష్ట్రలో బీజేపీ-సేనలదే అధికారం.. అంచనాలు తప్పినా మెజారిటీ సాధించిన కాషాయ కూటమి

సీఎం గద్దెపై చెరో రెండున్నరేండ్లు .. ముందస్తు ఒప్పందం ప్రకారం నడుచుకుంటామన్న రెండు పార్టీలు

కమలనాథులకు తగ్గిన సీట్లు - పుంజుకున్న ఎన్సీపీ



మహారాష్ట్రలోని సంగ్లిలో బీజేపీ శ్రేణుల విజయ సంబురాలు

**ముంబై, అక్టోబర్ 24:** మహారాష్ట్రలో మరోసారి బీజేపీ-శివసేనల మహాకూటమి అధికారాన్ని చేపట్టనుంది. అత్యధిక సీట్లలో గెలుపొంది ప్రభంజనం సృష్టించాలనుకున్న ఈ రెండు పార్టీల ఆశలు గల్లంతయ్యాయి. గతంతో పోలిస్తే సీట్ల సంఖ్య తగ్గినప్పటికీ మరో ఐదేండ్ల పాటు ఈ కూటమి రాష్ట్రాన్ని పాలించనుంది. అధికార కూటమికి గట్టి పోటీనిచ్చిన ప్రతిపక్ష కాంగ్రెస్-ఎన్సీపీ తమ సీట్ల సంఖ్యను పెంచుకున్నాయి. 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీలో అధికారాన్ని చేపట్టేందుకు 145 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాగా బీజేపీ, శివసేన 161 స్థానాలను గెలుచుకున్నాయి. ఈ రెండు పార్టీలు 200 నుంచి 230 వరకు సీట్లను గెలుచుకోగలవన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. ఎన్నికలకు ముందు కుదిరిన ఒప్పందం మేరకు బీజేపీ-శివసేన చెరో రెండున్నరేండ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశాలున్నాయి. ఈ నెల 21న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం ప్రారంభమైంది. 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ 105 సీట్లను గెలుచుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే ఆ పార్టీ 17 సీట్లను కోల్పోయింది. శివసేన 56 సీట్లను గెలుచుకుంది. గత అసెంబ్లీలో ఆ పార్టీకి 63 సీట్లున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 స్థానాల్లో, ఎన్సీపీ 54 సీట్లలో గెలుపొందాయి. గతంతో పోలిస్తే కాంగ్రెస్ కేవలం రెండు సీట్లను అధికంగా గెలుచుకోగా, ఎన్సీపీ బాగా పుంజుకుంది. గత అసెంబ్లీలో 41 సీట్లున్న ఎన్సీపీ ఈసారి 54 సీట్లకు ఎగబాకింది. 2014లో ఒంటరిగా పోటీ చేసి 63 స్థానాలు గెలుచుకున్న శివసేన ఈసారి బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ ఏడు సీట్లను కోల్పోవడం గమనార్హం. మరో ఐదేండ్లపాటు బీజేపీ-శివసేన కూటమి రాష్ట్రాన్ని పాలిస్తుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. అయితే ఈ ఎన్నికల్లో తన కుమారుడు ఆదిత్య ఠాక్రేను గెలిపించుకున్న శివసేన అధినేత ఉద్ధవ్‌ఠాక్రే.. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తనతో చేసిన వాగ్దానాన్ని అమలు చేయాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. అధికారానికి వస్తే చెరో రెండున్నరేండ్లు సీఎం పదవిని చేపట్టాలని తమ మధ్య అంగీకారం కుదిరినట్టు ఉద్ధవ్ వెల్లడించారు. అధికారాన్ని పంచుకునే విషయంలో ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారమే నడుచుకుంటామని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే తమ విజయాల శాతం భారీగా పెరిగిందని అన్నారు. 2014లో 260సీట్లలో పోటీ చేసి 122 (47%) సీట్లు గెలుచుకున్నామని, ఈసారి 150 స్థానాల్లో బరిలోకి దిగి 105 (70%)సీట్లలో విజయం సాధించామని చెప్పారు. అయితే గత ఎన్నికల్లో 28 శాతం ఓట్లు పొందిన బీజేపీకి ఈసారి 26 శాతం పోలయ్యాయి.




**పార్టీల బలాబలాలు..**

| పార్టీ | గెలుపు | ఆధిక్యత |
|---|---|---|
| బీజేపీ | 105 | 0 |
| శివసేన | 56 | 0 |
| ఎన్సీపీ | 54 | 0 |
| కాంగ్రెస్ | 43 | 1 |
| ఎంఐఎం | 2 | 0 |
| సీపీఎం | 1 | 0 |
| సమాజ్‌వాది | 2 | 0 |
| ఇండిపెండెంట్లు | 13 | 0 |
| ఇతరులు | 11 | 0 |

### పృథ్వీరాజ్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఎన్నికల ఫలితాలు ఓ 'ఆసక్తికరమైన అవకాశానికి' తెర తీశాయి' అంటూ కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చేసిన వ్యాఖ్య సంచలనంగా మారింది. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

# హర్యానాలో హంగ్



- 40 స్థానాల్లో బీజేపీ.. కాంగ్రెస్ 31, జేజేపీ 10 స్థానాల్లో విజయం..
- ఏడు చోట్ల స్వతంత్రులు, చెరో స్థానంలో ఐఎన్ఎల్డీ, హెచ్ఎల్పీ గెలుపు
- బీజేపీకి ఐదుగురు స్వతంత్రుల మద్దతు!

**అధికారానికి ఆరు సీట్ల దూరంలో బీజేపీ..**

**చండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అధికార బీజేపీకి షాక్ ఇచ్చాయి. కాషాయ పార్టీనే సంపూర్ణ మెజార్టీతో అధికారం కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తలకిందులయ్యాయి. హర్యానా ఓటర్లు ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీని ఇవ్వలేదు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటుకు 46 స్థానాలు అవసరం. 75 స్థానాల్లో గెలుపొందాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ కేవలం 40 సీట్లలోనే విజయం సాధించింది. రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ అధికారానికి ఆరు సీట్ల దూరంలో నిలిచిపోయింది. కాంగ్రెస్ 31 స్థానాల్లో గెలుపొందింది. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ మునిమనుమడు దుష్యంత్‌చౌతాలా సారథ్యంలోని జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ) అనూహ్యంగా 10 స్థానాలను కైవసం చేసుకుంది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్డీ), హర్యానా లోక్‌హిత్ పార్టీ (హెచ్ఎల్పీ) చెరో స్థానంలో విజయం సాధించాయి. స్వతంత్రులు ఏడు చోట్ల గెలుపొందారు. 46 స్థానాల్లో పోటీచేసిన ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతా కూడా తెరువలేకపోయింది. హంగ్ అసెంబ్లీ ఏర్పడడంతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. ప్రభుత్వ ఏర్పాటులో జేజేపీ, స్వతంత్రులు కీలకం కానున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ వేగంగా పావులు కదుపుతున్నాయి. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ అధినాయకత్వంతో సమావేశమయ్యేందుకు ఢిల్లీకి పయనమైనట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఐదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కాషాయపార్టీకి మద్దతు ప్రకటించినట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. గెలుపొందిన ఏడుగురు స్వతంత్రుల్లో ఐదుగురు బీజేపీ రెబల్సే కావడం గమనార్హం. వీరిని తిరిగి పార్టీ గూటికి రప్పించగలిగితే.. దుష్యంత్ మద్దతుతో పనిలేకుండా ఆ పార్టీ సులభంగా ప్రభుత్వం ఏర్పాటుచేసే వీలుంది.

**సీట్లు తగ్గాయ్.. ఓట్లు పెరిగాయ్**

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 10 స్థానాలను గెలుపొందిన కాషాయపార్టీకి తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అసంతృప్తికి గురిచేశాయి. బీజేపీ బరిలో దింపిన 10 మంది మంత్రుల్లో ఏకంగా ఎనిమిది మంది పరాజయం పాలయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో 58% ఓట్లను సాధించిన బీజేపీ.. తాజా ఎన్నికల్లో 36.5 శాతానికే పరిమితమైంది. ఆరు సీట్లను కోల్పోయినప్పటికీ, 2014 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఆ పార్టీ 3% ఓట్లను అధికంగా సాధించడం విశేషం. మరోవైపు కాంగ్రెస్ 2014తో పోలిస్తే 8% ఓట్లను అధికంగా సాధించింది. కర్నాల్ నియోజకవర్గం నుంచి సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ మరోసారి గెలుపొందారు. కాంగ్రెస్ నేత, మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా రాష్ట్రంలోనే అత్యధికంగా 58,213 ఓట్ల రికార్డు మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. జేజేపీ అధినేత దుష్యంత్.. ఉచానా కలాన్ సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే ప్రేమ్‌లతపై విజయం సాధించారు. ప్రేమ్‌లత మాజీ కేంద్రమంత్రి బీరేందర్‌సింగ్ భార్య. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 47 స్థానాల్లో గెలుపొంది సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. నాడు కాంగ్రెస్ 17 స్థానాల్లో గెలుపొందగా, ఐఎన్ఎల్డీ 19 చోట్ల విజయం సాధించింది. శిరోమణి అకాలీదళ్, బీఎస్పీ చెరో స్థానంలో గెలుపొందాయి. స్వతంత్రులు ఐదుచోట్ల గెలుపొందారు.




**అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు**

| పార్టీ | గెలిచిన సీట్లు |
|---|---|
| బీజేపీ | 40 |
| కాంగ్రెస్ | 31 |
| జేజేపీ | 10 |
| ఐఎన్ఎల్డీ | 1 |
| హెచ్ఎల్పీ | 1 |
| స్వతంత్రులు | 7 |

**దుష్యంత్ దారెటు?**

ఎన్నికల ఫలితాల సందర్భంగా జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా మాట్లాడుతూ.. బీజేపీపై తీవ్ర వ్యతిరేకత ఉందని ఫలితాలు స్పష్టంచేస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఆయన ఎవరికి మద్దతు ఇస్తారనేదానిపై మాత్రం స్పష్టతనివ్వలేదు. కాగా, జాట్ల ప్రాబల్యమున్న దేశ్‌వాళీ బెల్ట్‌లో (రోహ్‌తక్, ఝజ్జర్, సోనిపట్ జిల్లాలు) కాంగ్రెస్ హవా కొనసాగించింది. ఇక్కడ 11 స్థానాల్లో గెలుపొందింది. బీజేపీ ఒక్క సీటును మాత్రమే సాధించింది. తాజా ఫలితాల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాల మేరకు సీఎం ఖట్టర్ ఢిల్లీకి వెళ్లి ఆయనను కలిశారు.

# సీఎం బరిలో ఆదిత్య ఠాక్రే!



వర్లిలో విజయం అనంతరం విజయ సంకేతం చూపుతున్న ఆదిత్య ఠాక్రే

**ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ-శివసేన కూటమి స్పష్టమైన మెజారిటీని కైవసం చేసుకొని అధికారాన్ని తిరిగి నిలబెట్టుకున్నది. అయితే, ముఖ్యమంత్రి పీఠంపై మిత్రపక్షం శివసేన మక్కువ చూపుతున్నట్టు తెలుస్తున్నది. గతంతో పోలిస్తే ఈసారి బీజేపీ సాధించిన స్థానాల సంఖ్య తగ్గింది. ఇదే సమయంలో మిత్ర పక్షం శివసేన 56 స్థానాల్లో విజయం సాధించింది. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 145 సీట్లు కావాలి. ప్రస్తుతం బీజేపీ 103 స్థానాల్లో విజయం సాధించింది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే బీజేపీకి మిత్ర పక్షం శివసేన మద్దతు తప్పనిసరి. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో శివసేన కింగ్ మేకర్‌గా అవతరించింది. ఆ పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే ముంబైలోని వర్లి నియోజకవర్గం నుంచి 70 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో ఆయన్ని మహారాష్ట్రకు యువ ముఖ్యమంత్రిగా చేయాలని శివసేన వర్గాలు యోచిస్తున్నాయి. 50-50 సూత్రంతో అధికారాన్ని పంచుకోవాలన్న ప్రతిపాదన తెరమీదకు వస్తే, ఠాక్రే కుటుంబం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన తొలి నేత ఆదిత్య ఠాక్రేనే సీఎంగా చేసే అవకాశం ఉన్నదని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




**ప్రముఖుల గెలుపోటములు**



అజిత్ పవార్ — ఎన్సీపీ — మహారాష్ట్ర — బారామతి



పంకజ ముండే — బీజేపీ — మహారాష్ట్ర — పర్లీ



ఆదిత్య ఠాక్రే — శివసేన — మహారాష్ట్ర — వర్లీ



రణ్‌దీప్ సుర్జేవాలా — కాంగ్రెస్ — హర్యానా — కైథల్



దుష్యంత్ చౌతాలా — జేపీపీ — హర్యానా — ఉచానా కలాన్



హర్షవర్ధన్ పాటిల్ — బీజేపీ — మహారాష్ట్ర — ఇందాపూర్



దేవేంద్ర ఫడ్నవీస్ — బీజేపీ — మహారాష్ట్ర — నైరుతి నాగ్‌పూర్



బబితాఫోగట్ — బీజేపీ — హర్యానా — దాద్రి



చంద్రకాంత్ పాటిల్ — బీజేపీ — మహారాష్ట్ర — కొథ్రూడ్



గోపీచంద్ పదల్కర్ — బీజేపీ — మహారాష్ట్ర — బారామతి



అశోక్ చవాన్ — కాంగ్రెస్ — మహారాష్ట్ర — భోకర్



విశ్వనాథ్ మహదేశ్వర్ — శివసేన — మహారాష్ట్ర — తూర్పు బాంద్ర



పృథ్వీరాజ్ చవాన్ — కాంగ్రెస్ — మహారాష్ట్ర — దక్షిణ కరాడ్



ప్రేమలత సింగ్ — బీజేపీ — హర్యానా — ఉచానా కలాన్



భూపిందర్ సింగ్ హుడా — కాంగ్రెస్ — హర్యానా — గఢీ సాంపలా



యోగేశ్వర్ దత్ — బీజేపీ — హర్యానా — బరోడా

## చౌతాలా కుటుంబం నుంచి ఐదుగురు ఎన్నిక



నైనా సింగ్



రంజిత్



అభయ్

**చండీగఢ్:** హర్యానా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నది చౌతాలా కుటుంబం. వారిది హర్యానా-పంజాబ్ రాష్ట్ర సరిహద్దుల్లోని సిర్సా సబ్ డివిజన్ పరిధిలోని దాద్వాలీ గ్రామం. గురువారం వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వివిధ పార్టీల తరపున చౌతాలా కుటుంబానికి చెందిన ఐదుగురు నేతలు అసెంబ్లీకి ఎన్నికవ్వడం ద్వారా మాజీ డిప్యూటీ ప్రధాని దేవీలాల్ వారసత్వం, దానికి గల పలుకుబడి ఏమాత్రం చెక్కు చెదరలేదని రుజువు చేశారు. దేవీలాల్ మునిమనుమడు దుష్యంత్ చౌతాలా స్థాపించిన జేజేపీ నుంచి ఇద్దరు, ఐఎన్ఎల్డీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఒక్కొక్కరు గెలుపొందగా, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఐఎన్ఎల్డీ నుంచి ఓం ప్రకాశ్ చౌతాలా చిన్న కొడుకు అభయ్ సింగ్.. తమ సంప్రదాయ స్థానం ఎల్లెనాబాద్ నుంచి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.. కానీ ఆ పార్టీ నుంచి ఎన్నికైన నేత ఆయన ఒక్కరే. జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా, కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్ భార్య ప్రేమలతను ఉచాన్ కలాన్ స్థానంలో మట్టి కరిపించారు. దుష్యంత్ తల్లి నైనాసింగ్ చౌతాలా, బాద్రా స్థానంలో తన కాంగ్రెస్ ప్రత్యర్థి రణ్‌బీర్‌సింగ్ మహేంద్రను ఓడించారు. ఓం ప్రకాశ్ చౌతాలా సోదరుడు రంజిత్ సింగ్ చౌతాలా స్వతంత్ర్య అభ్యర్థిగా రణియా స్థానం నుంచి విజయం సాధించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ దఫా కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో రంజిత్ సింగ్.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందారు.

# అధికారం.. చెరిసగం!

- 50-50 ఫార్ములాను అమలు చేయాలి
- బీజేపీకి శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్



ఎన్నికల్లో గెలిచిన ఆదిత్య ఠాక్రేను అభినందిస్తున్న ఉద్ధవ్ ఠాక్రే

**ముంబై, అక్టోబర్ 24:** మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి మిత్రపక్షం బీజేపీతో బేరసారాల విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే సంకేతాలిచ్చారు. అధికారం విషయంలో 50-50 ఫార్ములాను అమలుచేసేందుకు సమయం ఆసన్నమైందని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 105 స్థానాల్లో, శివసేన 56 స్థానాల్లో విజయం సాధించాయి. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన సీట్లను బీజేపీ సాధించలేకపోవడంతో శివసేన మద్దతు కీలకంగా మారింది. ముఖ్యమంత్రి పదవి ఏ పార్టీ చేపట్టనుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఉద్ధవ్ ఠాక్రే స్పందిస్తూ.. 'బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మా నివాసానికి వచ్చినప్పుడు రెండు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందాన్ని బీజేపీకి గుర్తు చేయాల్సిన సమయం వచ్చింది. కూటమి ఏర్పాటుకు 50-50 ఫార్ములాను మేం నాడు నిర్ణయించాం' అని ఆయన చెప్పారు. 'బీజేపీ కంటే తక్కువ సీట్లలో పోటీచేసేందుకు మేం అంగీకరించాం. అయితే ప్రతిసారీ నేను బీజేపీకి ప్రాధాన్యం ఇవ్వలేను. మా పార్టీ కూడా ఎదగాలి' అని ఠాక్రే పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై తమ పార్టీ నేతలతోనూ, బీజేపీతోనూ చర్చించి, అధికారం పంచుకోవడంపై శాంతియుతంగా, పారదర్శకంగా ఒక ఒప్పందానికి వస్తామని ఆయన చెప్పారు. ఎన్నికల ఫలితాలు చాలా మందికి కండ్లు తెరిపించాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యాన్ని బతికించారన్నారు.

'హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతో మోదీ మ్యాజిక్ వేగంగా క్షీణిస్తున్నదని తెలుస్తున్నది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న నిరాశ ఈ ఫలితాల్లో ప్రతిబింబిస్తున్నది.
**- అధిర్ రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత**

మహారాష్ట్రలో బీజేపీ అధికార అహంకారం ప్రజలకు నచ్చలేదన్నది ఈ ఫలితాల ద్వారా తెలుస్తున్నది. ఆ పార్టీలోని కొందరు పరిమితులు దాటి వ్యాఖ్యలు చేశారు. 220 సీట్లపై వారి చర్చను ప్రజలు అంగీకరించలేదు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం. **- శరద్ పవార్, ఎన్సీపీ అధినేత**

'ఓవైపు ఆర్థిక మాంద్యం, మరోవైపు ఉద్యోగాలు లేక ప్రజలు కష్టాల్లో ఉన్నారు. ఇలాంటి సమయంలో యుద్ధోన్మాదం పనిచేయదు. మహారాష్ట్ర, హర్యానాలో ఆశించిన స్థానాలను బీజేపీ గెలుచుకోలేకపోయింది'
**- సీతారామ్ ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి**

'వారు (బీజేపీ) అనుకున్నట్లుగా అన్నీ జరుగుతాయనుకోవడం సరికాదంటూ ప్రజలు తీర్పు ఇచ్చారు. నిరుద్యోగం, రూపాయి పతనం, ధరల పెరుగుదల వంటివే తమకు ముఖ్యం కాని ఎన్నార్సీ, ఆర్టికల్ 370 కాదంటూ బీజేపీకి ప్రజలు స్పష్టం చేశారు. బీజేపీ పతనానికి ఇది ఆరంభం'
**—డీ రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి**

## బీహార్‌లో ఎగిరిన ఎంఐఎం జెండా

- కిషన్‌గంజ్ ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి గెలుపు
- మహారాష్ట్రలో రెండు చోట్ల విజయం

**పాట్నా:** హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ బీహార్‌లో తొలిసారిగా విజయం సాధించింది. ఆ రాష్ట్రంలోని కిషన్‌గంజ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఎంఐఎం అభ్యర్థి కమ్రుల్ హొడా.. కాంగ్రెస్ అభ్యర్థి స్వీటీసింగ్‌పై 10,204 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న కాంగ్రెస్ నేత జావెద్ ఆలం లోక్‌సభ ఎన్నికల్లో గెలువడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మరోవైపు 2014లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల గెలిచిన ఎంఐఎం.. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ రెండు స్థానాల్లో విజయం సాధించింది. కొద్ది కాలం కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఔరంగాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే ఇప్పుడు బీహార్‌లోని కిషన్‌గంజ్‌లోనూ గెలిచింది.

# ఉపఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు

- బీజేపీ, మిత్ర పక్షాలకు 26 సీట్లు
- కాంగ్రెస్‌కు 12 స్థానాలు

**లక్నో/పాట్నా:** దేశంలోని 18 రాష్ట్రాల్లోని 51 శాసన సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడ్డాయి. బీజేపీ, ఆ పార్టీ మిత్ర పక్షాలు 26 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ 12 స్థానాల్ని కైవసం చేసుకున్నది. బీహార్‌లోని సమస్తిపూర్ లోక్‌సభ స్థానంలో ఎల్జేపీ, మహారాష్ట్రలోని సతారా లోక్‌సభ స్థానంలో ఎన్సీపీ గెలుపొందాయి. యూపీలో 11 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగగా బీజేపీకి ఏడు స్థానాలు లభించాయి. బీజేపీ మిత్ర పక్షం అప్నా దళ్‌కు ఒక్క సీటు దక్కింది. సమాజ్‌వాదీ పార్టీ మూడు స్థానాల్లో విజయం సాధించింది. బీహార్‌లో అధికార జేడీయూకు ఓటర్లు షాక్ ఇచ్చారు. ఆ పార్టీ కేవలం ఒక్క స్థానంలోనే గెలుపొందింది. ఆర్జేడీ రెండు, మజ్లిస్ పార్టీ ఒక సీటును గెలుచుకున్నాయి. మరో సీటును స్వతంత్ర అభ్యర్థి గెలుచుకున్నారు. గుజరాత్‌లో బీజేపీ, కాంగ్రెస్ చెరో మూడు స్థానాల్లో గెలుపొందాయి. అసోంలో మూడింటిని బీజేపీ, మరో స్థానాన్ని ఏఐయూడీఎఫ్ గెలుచుకుంది. పంజాబ్‌లో మూడు స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో శిరోమణి అకాలీదళ్ విజయం సాధించాయి. కేరళలో రెండు స్థానాల్లో ఎల్డీఎఫ్, రెండు స్థానాల్లో యూడీఎఫ్, ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. సిక్కింలో ఎస్కేఎం రెండు స్థానాల్ని, బీజేపీ ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నది. హిమాచల్‌లో రెండు స్థానాల్లోనూ బీజేపీ విజయం సాధించింది. తమిళనాడులో రెండు చోట్లా ఏఐడీఎంకే నెగ్గింది. రాజస్థాన్‌లో ఒక స్థానంలో కాంగ్రెస్ , మరో స్థానంలో ఆర్ఎల్పీ గెలుపొందాయి. ఇక, వివిధ రాష్ట్రాల్లో ఒక్కో సీటుకు జరిగిన ఉపఎన్నికల్లో అరుణాచల్(స్వతంత్ర), మధ్య ప్రదేశ్ (కాంగ్రెస్), ఒడిశా (బీజేపీ), ఛత్తీస్‌గఢ్ (కాంగ్రెస్), పుదుచ్చేరి(కాంగ్రెస్), మేఘాలయ (యూడీపీ), తెలంగాణలో టీఆర్ఎస్ గెలుపొందింది.

# విజేత బీజేపీ

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు.రెండు లోక్‌సభ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో మహారాష్ట్రలోని సతారా స్థానాన్ని ఎన్సీపీ, బీహార్‌లోని సమస్తిపూర్ సీటును లోక్‌జనశక్తి పార్టీ గెలుచుకున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా చతికిలబడిన కాంగ్రెస్ మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించింది. శరద్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) బాగా పుంజుకుంది. తన భాగస్వామి కాంగ్రెస్ కన్నా ఈసారి ఎన్సీపీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడం విశేషం. మొత్తం 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ 105, శివసేన 56 స్థానాలను గెలుచుకున్నాయి. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, పోలింగ్‌కు ముందు రోజు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడుల వంటి అంశాలు ఈసారి బీజేపీకి కలిసి రాలేదు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా జాతీయవాద అంశాలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ ఓటర్లు వాటి పట్ల ఆసక్తి చూపినట్టు కనిపించలేదు. ఈ ఎన్నికల్లో ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు సైతం తారుమారు కావడం గమనార్హం. మహారాష్ట్రలో బీజేపీ-శివసేన కూటమి 200 నుంచి 230 వరకు సీట్లు గెలుచుకుంటాయని ఆయా సర్వే సంస్థలు అంచనా వేశాయి. అలాగే హర్యానాలోనూ బీజేపీ 75 సీట్ల వరకు గెలుచుకొని రెండోసారి అధికారాన్ని చేపడుతుందని జోస్యం చెప్పాయి. కానీ రెండు రాష్ట్రాలలోనూ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి. మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటుకు 145 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరముండగా, బీజేపీ-శివసేన కూటమి 161 స్థానాలను గెలుచుకుంది. 90 సీట్లున్న హర్యానా అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటుకు 46 సీట్లు అవసరం కాగా బీజేపీ 40 స్థానాల వద్దనే ఆగిపోయింది. అయితే ఇండిపెండెంట్లుగా గెలుపొందిన తమ పార్టీ రెబల్స్‌ను మళ్లీ అక్కున చేర్చుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నది.

# మహిళలు దృఢంగా ఉండాలి

### రైజ్ అబో సదస్సులో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతి మహిళ విజయంలో పురుషుడి పాత్ర తప్పకుండా ఉంటుందని, మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. గురువారం మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యూఎన్) ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ అబో సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణకు యెగా చేయాలని, మహిళలు తమ ఆనందం విషయంలో రాజీపడవద్దని చెప్పారు. అమ్మాయిలపై వివక్ష కొనసాగుతున్నదని, షీటీమ్ వినూత్నమైన నిర్ణయమని ప్రశంసించారు. ఉపాధి అవకాశాలు లభించే విద్య అభ్యసించాలని తెలిపారు. హైదరాబాద్ యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రిఫ్‌మ్యాన్ మాట్లాడుతూ.. ప్రపంచంలో పనిచేసే మహిళలు 40 శాతం ఉన్నారని, వారిద్వారా జీడీపీకి 39 శాతం ఆదాయం సమకూరుతున్నదని, భారత్‌లో మాత్రం 24 శాతం మహిళలే పనిచేస్తున్నారని, 17 శాతం జీడీపీ సమకూరుతున్నదని చెప్పారు. సీఐఐ ప్రెసిడెంట్ రాజు మాట్లాడుతూ.. మహిళలు సమాజంలో పోటీపడాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ శిఖాగోయల్, ఐడబ్ల్యూఎన్ తెలంగాణ శాఖ అధ్యక్షురాలు నందితా సేథీ, ఐడబ్ల్యూఎన్ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షురాలు స్వాతి, సినీనటి మంచు లక్ష్మి, పూర్ణిమ కాంబ్లే , నందినీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లో రైజ్ అబో సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్. చిత్రంలో యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రిఫ్‌మ్యాన్, రాజు, శిఖాగోయల్

# మున్సిపల్ ఎన్నికల కసరత్తు ముమ్మరం

- కమిషనర్లతో సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి భేటీ
- వార్డుల విభజన, ఓటర్ల జాబితా సవరణపై చర్చ
- నేడు మరోసారి సమావేశం
- 29న కలెక్టర్లు, అధికారులతో ఎస్‌ఈసీ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబర్‌లోగా ఈ ఎన్నికలు పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో కసరత్తు ఊపందుకున్నది. దీనిలో భాగంగా సీడీఎంఏ డైరెక్టర్ టీకే శ్రీదేవి గురువారం మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై వార్డుల విభజన, ఓటర్ల జాబితా సవరణ, కోర్టు అంశాలపై చర్చించారు. శుక్రవారం మరోసారి సమావేశంకానున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్లు నివేదికలు సిద్ధంచేసి కోర్టుకు సమర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను ఒకట్రెండు రోజుల్లో పూర్తిచేసి ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలని భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) కూడా దృష్టిసారించింది. ఈ నెల 29న అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటుచేయనున్నది. నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ జారీచేసి.. కొత్త చట్టం ప్రకారం 20 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని ఎస్‌ఈసీ భావిస్తున్నది. ఇందుకు అవసరమైన బ్యాలెట్ బాక్సలను ఇప్పటికే అందుబాటులో ఉంచుకున్నది.



## సోయాబీన్ కొనుగోళ్లు 50 శాతానికి పెంచండి

- కేంద్రానికి మంత్రి నిరంజన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సోయాబీన్ కొనుగోళ్లు 50 శాతానికి పెంచాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం కేంద్రవ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు లేఖరాశారు. కేంద్ర ప్రభుత్వం 58,608 టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నదని ఆ మొత్తాన్ని 96,991 టన్నులకు పెంచాలని నిరంజన్‌రెడ్డి కోరారు.

## పీఏసీఎస్‌ల రుణాలపై వడ్డీపెంపు నిర్ణయం నిలుపుదల

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాణిజ్య బ్యాంకుల నుంచి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) తీసుకున్న రుణాల వడ్డీరేట్ల పెంపు నిర్ణయాన్ని నిలిపివేస్తూ కేంద్ర ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ వడ్డీరేట్ల పెంపుదలతో రైతులు నష్టపోతారని తెలంగాణ ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ గత నెలలో కేంద్రానికి లేఖ రాశారు. కేంద్రం నిర్ణయం వల్ల రైతులకు వడ్డీ రాయితీతో రూ.500 మేరకు లబ్ధి చేకూరుతుందని, రాష్ట్రంలో 1.5 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందుతారని వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## షైన్ దవాఖాన లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎల్బీనగర్‌లోని షైన్ దవాఖాన లైసెన్స్‌ను రద్దుచేసినట్టు రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి గురువారం వెల్లడించారు. ఈ నెల 21న ఈ దవాఖానలో జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు నెలల పసికందు మృతిచెందడంతోపాటు మరో నలుగురు శిశువులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై ప్రభుత్వానికి వైద్యశాఖ నివేదిక సమర్పించింది. షైన్ దవాఖాన నిర్వహణలో యాజమాన్య లోపాలే కాకుండా అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోని కారణంగానే ప్రమాదం జరిగినట్టు నివేదికలో స్పష్టంచేశారు. షైన్ దవాఖానలో కేవలం 20 పడకల ఏర్పాటుకు మాత్రమే అనుమతి ఇవ్వగా.. యాజమాన్యం 58 పడకల దవాఖానను నడుపుతున్నట్లు విచారణలో తేలింది. ప్రభుత్వం నిర్దేశించిన విధానాన్ని అనుసరించడంలో 'షైన్' యాజమాన్యం విఫలమైందని, దవాఖాన నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించిందని నివేదికలో పేర్కొన్నారు. ఇక నుంచి అన్ని దవాఖానల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

# 1,027 మందికి గ్రూప్-2 కొలువులు

- తుది ఫలితాలు విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ
- సరైన అభ్యర్థులు లేక ఖాళీగా ఐదు పోస్టులు
- వెబ్‌సైట్‌లో ఎంపికైనవారి జాబితా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో 1,032 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో 1,027 పోస్టులకు ఎంపికైనవారి తుది ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. సరైన అభ్యర్థులు లేకపోవడంతో ఐదుపోస్టుల ఫలితాలను ప్రకటించలేదు. గురువారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఆధ్వర్యంలో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 1,027 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని, వివరాలకు www.tspsc.gov.inను సంప్రదించాలని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ ఏ వాణీప్రసాద్ సూచించారు. 2015, 2017లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్లలో మొత్తం 1,032 గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రకటించారు. ఈ పోస్టుల భర్తీ కోసం 2016 నవంబర్ 11 నుంచి 13 వరకు మూడు రోజులపాటు రాతపరీక్షలు నిర్వహించారు. గ్రూప్-2 పోస్టుల నిర్వహణపై హైకోర్టులో కేసులు దాఖలవడంతో రాతపరీక్ష ఫలితాల విడుదల, ఇంటర్వ్యూలు నిర్వహించడంలో ఆలస్యమైంది. కొంతకాలం కిందట ఇంటర్వ్యూల కోసం 1,032 పోస్టులకు 1:2 నిష్పత్తి ప్రకారం మొత్తం 2,064 మంది అభ్యర్థులను ఎంపికచేశారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యం లో ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 27 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం తుది ఫలితా లు విడుదల చేశారు.

**హర్షం వ్యక్తంచేస్తున్న అభ్యర్థులు**

శాఖలవారీగా ఎంపికై న అభ్యర్థుల జాబితాలను సర్వీస్ కమిషన్ అధికారులు పంపించాక పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. గ్రూప్ -2 తుది ఫలితాలు ప్రకటించడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు సామాజిక మాధ్యమాల్లో కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**పోస్టుల వివరాలు:**

| పోస్టుకోడ్ | పోస్టు పేరు | పోస్టుల సంఖ్య |
|---|---|---|
| 1 | మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3 | 19 |
| 2 | అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ఏసీటీవో) | 156 |
| 3 | సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-2 (రిజిస్ట్రేషన్, సబ్ సర్వీస్) | 23 |
| 4 | ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి) | 67 |
| 5 | ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ | 284 |
| 6 | డిప్యూటీ తాసిల్దార్ (రెవెన్యూశాఖ) | 259 |
| 7 | అసిస్టెంట్ రిజిస్ట్రార్ (కో ఆపరేటివ్ సొసైటీస్) | 62 |
| 8 | ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రూప్-1 (ఎండోమెంట్ శాఖ) | 11 |
| 9 | అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (కార్మిక శాఖ) | 03 |
| 10 | అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్) | 20 |
| 11 | అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, (జీఏడీ, సెక్రటేరియట్) | 90 |
| 12 | అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఆర్థికశాఖ, సెక్రటేరియట్) | 28 |
| 13 | అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (న్యాయశాఖ, సెక్రటేరియట్) | 10 |
| మొత్తం | | 1,032 |

(నోట్:- సరైన అభ్యర్థులు లేని కారణంగా ఐదు పోస్టుల ఫలితాలు ప్రకటించలేదు)



గురువారం మాదాపూర్ శిల్పకళావేదికలో షీ టీమ్స్ ఐదో వార్షికోత్సవంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీలు, డీజీపీ మహేందర్‌రెడ్డి, తదితరులు

# మహిళల్లో పెరిగిన భరోసా

- షీ టీమ్స్ ఐదో వార్షికోత్సవంలో హోం మంత్రి మహమూద్‌అలీ
- విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు: విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మార్పు తేవడమే లక్ష్యం: డీజీపీ మహేందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఏర్పాటుచేసిన షీటీమ్‌లతో మహిళల్లో భరోసా కల్పించగలిగామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనతో ఐదేండ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన షీ టీమ్‌ల కారణంగా యువతులపై వేధింపుల కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని తెలిపారు. షీ టీమ్‌ల ఐదో వార్షికోత్సవం సందర్భంగా గురువారం శిల్పకళావేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లతో కలిసి పాల్గొన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని నమ్మిన సీఎం.. పోలీస్‌శాఖ బలోపేతానికి అత్యధికంగా నిధులు కేటాయించారన్నారు. ఫిర్యాదు అందిన నిమిషాల్లోనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొంటున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామని వెల్లడించారు. హన్మకొండలో చిన్నారి లైంగికవేధింపు, అత్యాచారం కేసును వేగంగా దర్యాప్తుచేసి రోజుల వ్యవధిలోనే శిక్ష పడేలా చేయడంతో తెలంగాణ పోలీస్ కీర్తి దేశవ్యాప్తమైందని సంతోషం వ్యక్తంచేశారు. విద్యార్థినుల్లో భరోసా నింపేందుకు పాఠశాలలు, కళాశాలల్లో షీ టీమ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడతామని విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. తెలంగాణ పోలీసులు దేశానికే తలమానికంగా మారారని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడేవారిలో మార్పు తేవడమే షీటీమ్‌ల ప్రథమ కర్తవ్యమని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. శ్రుతి మించి వ్యవహరించేవారిపై పీడీ యాక్ట్ కూడా నమోదుచేస్తున్నట్లు పేర్కొన్నారు. షీటీమ్‌ల కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా తెలిసేలా భారీగా వార్షికోత్సవం నిర్వహించాలని ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ప్రోత్సహించారని చెప్పారు. షీటీమ్‌లు విజయవంతంగా పనిచేయడంలో అన్ని ప్రభుత్వ శాఖలు, పౌరసమాజం భాగస్వామ్యం ఉన్నదని పేర్కొన్నారు. షీటీమ్స్‌లో ఉత్తమ సేవలందిస్తున్న సిబ్బందికి హోం మంత్రి మహమూద్‌అలీ జ్ఞాపికలను అందజేశారు. షీటీమ్స్ బ్రోచర్, ఉమెన్ సేఫ్టీ ఈ లెర్నింగ్ కోర్సులను మంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్‌సేఫ్టీ వింగ్ ఇంచార్జి, ఐజీ స్వాతిలక్రా, ఎంపీలు రంజిత్‌రెడ్డి, మాలోత్ కవిత, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సునీల్‌కుమార్, అదనపు డీజీ సంతోష్‌మెహ్రా, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, సైబరాబాద్ సీపీ సజ్జనార్, రాచకొండ సీపీ మహేశ్ భగవత్ పాల్గొన్నారు.

**షీ టీమ్స్‌కు అభినందనల వెల్లువ**

మహిళల రక్షణలో కీలకంగా పనిచేస్తున్న షీటీమ్స్‌కు ఐదో వార్షికోత్సవం సందర్భంగా వివిధవర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ప్రముఖ క్రీడాకారిణులు సానియామీర్జా, పీవీ సింధు, సినీ హీరోయిన్లు సమంత, మంచు లక్ష్మి ట్విట్టర్‌లో షీటీమ్స్ సేవలను కొనియాడారు. షీటీమ్స్ మహిళల హక్కులపై అవగాహన పెంచుతున్నాయని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియామీర్జా ట్విట్టర్‌లో అభినందించారు. 'బంగారు తెలంగాణలో అందరి మహిళల్లా నేను ఎంతో సురక్షితంగా ఉన్నాను. ఐదేండ్లుగా అద్భుతంగా సేవలందిస్తున్న షీటీమ్స్‌కు అభినందనలు, కృతజ్ఞతలు' అంటూ ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ట్వీట్ చేశారు. 'మాకు రక్షణ కల్పిస్తూ మమ్మల్ని సురక్షితంగా ఉంచుతున్న షీటీమ్స్‌కు అభినందనలు. తెలంగాణ రాష్ట్రంలో షీటీమ్స్ ఏర్పాటు అద్భుతం' అంటూ సినీనటి సమంత ట్వీట్‌చేశారు. 'ఎంతో మంది మహిళలను ధైర్యంగా బయటికి వచ్చేలా చేసిన షీ టీమ్స్‌కు కృతజ్ఞతలు, ఐదేండ్లుగా ఎంతోమంది మహిళలకు షీటీమ్స్ అండగా నిలిచాయి' అంటూ మరో నటి మంచులక్ష్మి ట్విట్టర్‌లో పేర్కొన్నారు.





గురువారం రాజ్‌భవన్‌లోని సంస్కృతి ఆడిటోరియంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ చేతులమీదుగా అవార్డులు అందుకున్న వివిధ జిల్లాల కలెక్టర్లు

# తెలంగాణ శక్తిమంతమైన నేల

- ఇక్కడి బిడ్డలు చురుకైనవాళ్లు
- రెడ్‌క్రాస్ సేవా అవార్డుల ప్రదానంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ గడ్డ ఎంతో శక్తిమంతమైనదని, ఇక్కడి బిడ్డలు చురుకైనవాళ్లని గవర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్ కొనియాడారు. తెలంగాణవాసులంతా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని ప్రశంసించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ మూడో వార్షిక సర్వసభ్య సమావేశం, సేవా అవార్డుల ప్రదానోత్సవాన్ని గురువారం రాజ్‌భవన్‌లోని సంస్కృతి ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ అధ్యక్షురాలి హోదాలో హాజరైన గవర్నర్ పలువురికి సేవా అవార్డులు, గోల్డ్‌మెడల్స్ అందజేసి ప్రసంగించారు. తమిళనాడులో డాక్టర్‌గా పనిచేసినప్పుడు రెడ్‌క్రాస్ సొసైటీలో, జాతీయ మేనేజింగ్ కమిటీ సభ్యురాలిగా పనిచేశానని గుర్తుచేసుకొన్నారు. రక్తదానం చేయించడం కష్టమైనపనని, మెడికోగా ఉండగా ఎదురైన స్వీయ అనుభవాన్ని వివరించారు. డెంగీ జ్వరాలతో ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయని, రక్తం కొరతతో ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావొద్దని అన్నారు. రాష్ట్రంలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించాలని, ప్రభుత్వ దవాఖానలతో ఎంవోయూ చేసుకొని పేదలకు రక్తాన్ని ఉచితంగా అందించాలని కోరారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు 60 రోజుల పాటు విద్యాసంస్థల్లో సభ్యత్వనమోదు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని కలెక్టర్ల అంతా రెడ్‌క్రాస్ సొసైటీకి సహకరించాలని కోరారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు, రక్తదాన శిబిరాల నిర్వహణ సహా సేవలను విస్తృతం చేసేందుకు కృషిచేసిన ఎక్సైజ్, యువజన సర్వీసులశాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితోపాటు పలుజిల్లాల కలెక్టర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులకు సేవా అవార్డులను గవర్నర్ అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ మేనేజింగ్‌కమిటీ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ చైర్మన్ దేశాయి ప్రకాశ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సురేంద్రమోహన్, ప్రధానకార్యదర్శి, సీఈవో మదన్‌మోహన్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల నివారణపై దృష్టి

### అధికారులను కోరిన మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజల్లో ప్రబలే వ్యాధులకు చికిత్స అందించడంతోపాటు అవి రాకుండా నివారణ మార్గాలపై దృష్టి సారించడం ముఖ్యమని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలోని పీహెచ్‌సీలు, వాటి సిబ్బంది పనితీరుపై ప్రజారోగ్యశాఖ అధికారులతో గురువారం తన కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా ప్రజల్లో అవగాహన కలిగితేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వ్యాధులపై అవగాహన కల్పించి ఆరోగ్య తెలంగాణలో అందరిని భాగస్వాములను చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు ప్రాథమిక వైద్య చికిత్సపై శిక్షణ ఇవ్వాలని, పీహెచ్‌సీల్లో పనిభారం ఆధారంగా సిబ్బందిని క్రమబద్ధీకరించాలని చెప్పారు. ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు పూర్తిస్థాయిలో పని చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, ఆయా జిల్లాల్లోని డాటా ప్రోగ్రామింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎంఎల్ ఆర్ఐటీ కళాశాలకు లైవ్లీహుడ్ బిజినెస్ ఇంకుబేటర్ సెంటర్ మంజూరుకావడంతో కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రొఫెసర్లు, అధికారులు

## ఎంఎల్ ఆర్ఐటీకి ఇంకుబేటర్ సెంటర్

**దుండిగల్, నమస్తే తెలంగాణ:** మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటి పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలకు మినిస్ట్రీ ఆఫ్ స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వశాఖ లైవ్లీహుడ్ బిజినెస్ ఇంకుబేటర్ సెంటర్‌ను మంజూరుచేసింది. దక్షిణ భారతదేశంలో తమకే ఈ అవకాశం దక్కడంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తంచేసింది. ఈ ఇంకుబేటర్ సెంటర్‌తో గ్రామీణ భారతావని నుంచి నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు యువతకు ఆయారంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. సొంతంగా వ్యాపారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటుచేసుకొని ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని స్కీమ్ ఫర్ ప్రమోటింగ్ ఇన్నోవేషన్, రూరల్ ఇండస్ట్రీ,ఎంటర్‌ప్రైజెస్(ఏఎస్పీఐఆర్ఈ)లో అమలుచేస్తున్నట్టు నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్డీసీ) చైర్మన్ పురుషోత్తం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు లభించడం గొప్పవిషయమని, సామాజిక బాధ్యతతో గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి ఆయారంగాల్లో అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కళాశాల సెక్రటరీ,టీఆర్ఎస్ యువనేత మర్రి రాజశేఖర్‌రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. సమావేశంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి కే లక్ష్మీనారాయణ, నిమ్స్ ప్రొఫెసర్ .కే సూర్యప్రకాశ్‌గౌడ్, మాజీ డైరెక్టర్ ఏకే ద్వివేది, కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ మర్రి మల్లికార్జెడ్డి, డాక్టర్ కార్తీక్‌రాజేందర్, డీన్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర, డాక్టర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్‌ఈఆర్సీ కమిషన్ చైర్మన్‌గా శ్రీరంగారావు

మొదటిపేజీ తరువాయి...

పాటు లేదా 65 ఏండ్ల వయసు నిండేవరకు (రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే అప్పటివరకు) పదవుల్లో కొనసాగుతారు.

**శ్రీరంగారావు నేపథ్యమిదీ..**

సాధారణ కుటుంబంలో జన్మించిన తన్నీరు శ్రీరంగారావుకు వివిధ కోర్టుల్లో న్యాయవాదిగా పనిచేసిన అనుభవమున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాద వర్గం తరపున ఆయన కీలక పోరాటాలు చేయడంతోపాటు 'మిలియన్ మార్చ్' సందర్భంగా నమోదైన కేసుల్లో జైలుకు వెళ్లివచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్లు గ్రామంలో గోపాల్‌రావు, రాజమ్మ దంపతులకు జన్మించిన శ్రీరంగారావు.. ఉస్మానియాలో లా డిగ్రీని పూర్తిచేశారు. ఉస్మానియాలో చదువుతున్నప్పుడు విద్యార్థి సంఘం నాయకుడిగా ఆయన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. నాంపల్లి కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌చేస్తూ నాంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. టెక్నికల్ సభ్యునిగా నియమితులైన ఎండీ మనోహర్‌రాజు గతంలో ఎస్పీడీసీఎల్‌లో చీఫ్ ఇంజినీరుగా రిటైర్‌కాగా.. ఫైనాన్స్ సభ్యుడైన బండారు కృష్ణయ్య రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌లో ఉన్నతస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించి రిటైర్ అయ్యారు.



టీఎస్‌ఈఆర్సీ కమిషన్ చైర్మన్‌గా శ్రీరంగారావును నియమించిన సందర్భంగా నాంపల్లి కోర్టు ప్రాంగణంలో సంబురాలు జరుపుకొంటున్న న్యాయవాదులు

# బాలల హక్కులు పరిరక్షించాలి

### ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బాలల హక్కులను పరిరక్షించేందుకు తగినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం వినోద్‌కుమార్‌ను ఆయన నివాసంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ జే శ్రీనివాసరావు, సభ్యులుకలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో బాలకార్మికవ్యవస్థ లేకుండా చూడాలని కమిషన్ చైర్మన్, సభ్యులకు వినోద్‌కుమార్ సూచించారు. బాలలందరూ చదువుకొనేలా చూడాలని కోరారు. బాలల అభ్యున్నతికి కృషిచేస్తేనే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం పటిష్ఠప్రణాళిక అమలు చేయాలని.. బాలలను సమాజంలో ఉత్తమంగా తీర్చిదిద్దాలని సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులన్న స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. వినోద్‌కుమార్‌ను కలిసినవారిలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బృందాధర్‌రావు, అంజన్‌రావు, దేవయ్య, అపర్ణ, శోభారాణి, రాగ జ్యోతి తదితరులు ఉన్నారు.

# ఫలించిన ఎక్సైజ్ వ్యూహం

### మద్యం దుకాణాల దరఖాస్తులపైనే రూ.975.68 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని రెండేండ్లకు రూపొందించడంతో ఎక్సైజ్‌శాఖ అధికారుల వ్యూహాలు సత్ఫలితాలనిచ్చాయి. మొత్తం 2,216 మద్యం దుకాణాలకు అనూహ్యంగా 48,784 దరఖాస్తులు వచ్చాయి. టెండర్ దరఖాస్తుల నాన్‌రిఫండబుల్ ఫీజు ద్వారానే ప్రభుత్వానికి రూ.975.68 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి నాన్‌రిఫండేబుల్ ఫీజును రూ.లక్ష నుంచి 2 లక్షలకు పెంచినా.. కొన్ని వెసులుబాట్లు దరఖాస్తుదారులనుంచి సానుకూల స్పందనకు కారణమయ్యాయి. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడం, ధరావతు మొత్తాన్ని తొలగించడం, ఎక్సైజ్ పన్ను చెల్లింపు వాయిదాలను ఆరు నుంచి ఎనిమిదికి పెంచడం, బ్యాంక్ గ్యారంటీ మొత్తాన్ని 65 నుంచి 50 శాతానికి తగ్గించడంసహా అనేక మార్పులతో పాలసీని రూపొందించడంలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు. 2015లో ఒక్కో దుకాణానికి సగటున 14 దరఖాస్తులు మాత్రమే రాగా, ఈ ఏడాది 22 దరఖాస్తులు వచ్చాయి. 2015లో మొత్తం 30,990 దరఖాస్తులు వస్తే, 2017లో 41,119, ఈ ఏడాది 48,784 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ఫీజు ద్వారా 2015లో రూ.155 కోట్ల ఆదాయం వస్తే, ఈ ఏడాది రూ.975.68 కోట్లు వచ్చింది. మద్యం దుకాణాల సంఖ్యను పెంచనప్పటికీ ఫీజు పెంపుతో భారీగా ఆదాయం సమకూరింది. రాష్ట్రంలోని మొత్తం 2,216 దుకాణాలు కేటాయించేందుకు లక్కీడ్రా ప్రక్రియ గురువారంతో పూర్తయింది. ఈ నెల 18న కొన్ని దుకాణాలకు ఎంపిక పూర్తిచేసి, తక్కువగా దరఖాస్తులు వచ్చిన 29 దుకాణాల డ్రా నిలిపివేశారు. మరో రెండు రోజులు సమయం ఇవ్వడంతో 382 దరఖాస్తులు వచ్చాయి, అదనంగా రూ.7.64 కోట్ల ఆదాయం సమకూరింది.

**పారదర్శకంగా ప్రక్రియ పూర్తి**



మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశాం. సీఎం కేసీఆర్ సూచనలు, ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ నిర్ణయాలతో ఇది సాధ్యమైంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, డిప్యూటీ కమిషనర్లు, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు, స్టేషన్ హౌస్ అధికారులకు, సిబ్బందికి అభినందనలు.

–సోమేశ్‌కుమార్, ఎక్సైజ్‌శాఖ కమిషనర్

# వరి విత్తనోత్పత్తిలో మనమే టాప్

### వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డా ప్రవీణ్‌రావు



డాక్టర్ వీ ప్రవీణ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోని మొత్తం వరి విత్తనోత్పత్తిలో తెలంగాణ నుంచే 85 శాతం జరుగుతున్నదని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తెలిపారు. హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తిపై రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో జరుగుతున్న మూడురోజుల అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో ప్రవీణ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమెరికా, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్ నుంచి పలువురు శాస్త్రవేత్తలు, ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమంలో వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హైబ్రీడ్ వరి విత్తనోత్పత్తిలో తెలంగాణ రాష్ట్ర ప్రాముఖ్యాన్ని వివరిస్తూ.. దేశ విత్తనభాండాగారంగా తెలంగాణ భాసిల్లుతున్నదన్నారు. హైబ్రిడ్ వరిలో విశేష అనుభవం కలిగిన చైనా శాస్త్రవేత్త డాక్టర్ మావో, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ జవహర్ అలీ, పలువురు శాస్త్రవేత్తలు, విత్తన కంపెనీ అధిపతులు ఈ శిక్షణ కార్యక్రమంలో అనేక సూచనలు చేశారు. వ్యవసాయ వర్సిటీ పరిశోధన విభాగం సంచాలకుడు డాక్టర్ ప్రదీప్, భారతీయ వరి పరిశోధన సంస్థ ఇంచార్జి డాక్టర్ గురురాజ్ కట్టి, సంచాలకుడు డాక్టర్ అవిత్ కుమార్, రాజేంద్రనగర్ వరి పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎం వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

epaper.ntnews.com

# కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు!

- ఒకరి భూమి మరొకరి పేరిట పట్టా
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- తాసిల్దార్ సర్వేతో ఫలితం సున్నా
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ

ధర్మగంట

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది! అధికారులు చేసే పొరపాట్లకు అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు! ఒకరి భూమిని మరొకరికి పట్టాచేసి రైతులను తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పిస్తున్నారు. పట్టా లేక రైతుబంధు పెట్టుబడి సాయంతో పాటు రూ.ఐదులక్షల ప్రమాద బీమా కోల్పోతున్నారు. చేసిన తప్పును మాత్రం సరిదిద్దకపోవడంపై కలెక్టర్‌ను ఆశ్రయించినా పనికావడం లేదు. పొరపాట్లను సరిచేయాలని కలెక్టర్ ఆదేశించి నెలలు గడుస్తున్నా అధికారులు ఖాతరుచేయడం లేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వాల రైతుల పరిస్థితి ఇది.

**అడుగడుగునా నిర్లక్ష్యం**

కల్వాలకు చెందిన అడ్డూరి వెంకటేశ్వర్లు, రమేశ్, చీకటి సతీశ్, కొమురయ్య, కుదురుపాక నాగయ్యలకు చెందిన భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట పట్టా చేశారు. వీరంతా తమ పట్టా భూమిలో 40 ఏండ్లుగా సాగుచేస్తున్నారు. ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన చేపట్టిన తర్వాత మొత్తం భూమికి పట్టాఅందించాల్సిన రెవెన్యూ అధికారులు చేతివాటానికి పాల్పడి వీరి భూమిని ఇతరుల పేరిట పట్టాచేసి పాసు పుస్తకాలు ఇచ్చేశారు. ఆనాటి నుంచి తమకు పూర్తి భూమికి పాసుపుస్తకం ఇప్పించాలని రైతులు వీఆర్వో ఆశ్రయించారు. పొరపాటున ఇతరుల పేరిట నమోదైందని, మీ భూమికి పట్టా చేసి ఇస్తామని కాలం వెళ్లదీశారు. వీఆర్వో చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు, కేసముద్రం తాసిల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో నాలుగు నెలల కిందట కలెక్టర్ శివలింగయ్యను కలిసి గో డు వెళ్లబోసుకున్నారు. స్పందించిన కలెక్టర్ భూసర్వే చేసి బాధితులకు పూర్తిస్థాయిలో పట్టా, పాసుపుస్తకాలు అందజేసి న్యాయం చేయాలని తాసిల్దార్ సురేశ్‌కుమార్‌ను ఆదేశించారు. తాసిల్దార్ రైతుల భూములపై ప్రత్యేక్షంగా సర్వే నిర్వహించారు. భూముల వివరాలను తప్పుగా రికార్డుచేసిన ఇద్దరు వీఆర్ఏలను సస్పెండ్ చేశారు. పదిరోజుల్లో తప్పులు సవరించి పట్టా, పాస్ పుస్తకాలు అందిస్తామని రైతులకు తాసిల్దార్ హామీ ఇచ్చారు. తాసిల్దార్ సర్వేచేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కొత్త పాస్ పుస్తకాలు రాలేదు. దీంతో రైతులు ధర్మగంటను ఆశ్రయించారు.

### మరొకరికి పట్టాచేశారు



గ్రామంలోని 114 సర్వేనంబర్‌లో 1.07 ఎకరాలు, 117 సర్వేనంబర్‌లో 0.20 గుంటల భూమి ఉంది. వారసత్వంగా వచ్చిన భూమిని సాగుచేస్తున్నా. గతంలో పట్టా పాస్ పుస్తకం ఉండగా, భూరికార్డుల ప్రక్షాళన తర్వాత ఇచ్చిన కొత్త పాస్ పుస్తకంలో మొత్తం భూమి నమోదుచేయలేదు.114 సర్వే నంబర్‌లో 1.07 ఎకరాలు, 117 సర్వే నెంబర్‌లో 20 గుంటలు లింగమూర్తి పేరు మీద పట్టా చేశారు. కంప్యూటర్‌లో తప్పుగా నమోదయ్యాయని తప్పించుకుంటున్నారు.

– అడ్డూరి వెంకటేశ్వర్లు రైతు

### తాసిల్దార్ సర్వేతో ఫలితం లేదు



వారసత్వంగా వచ్చిన 108 సర్వే నెంబర్‌లో 12 గుంటలు, 112లో 13 గుంటల భూమి నమోదు కావాల్సి ఉంది. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత కొత్త పాసు పుస్తకం ఇచ్చారు. అందులో పూర్తి భూమికి పట్టారాలేదు. పలుమార్లు తాసిల్దార్‌కు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయింది. కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా, ఆయన ఆదేశాల మేరకు కొన్నినెలల కిందట తాసిల్దార్ సర్వేచేసి పదిరోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. సర్వేచేసి నెలలు గడుస్తున్నా తప్పులు సరిచేయలేదు.

– చీకటి సతీశ్, రైతు

### రైతుబంధు కోల్పోయా



అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పట్టా పాస్ పుస్తకంలో పూర్తి భూమికి పట్టా రాక రైతుబంధు పెట్టుబడి సాయం కోల్పోయాను. నాకు 3.19 గుంటలు భూమి ఉండగా, 108 సర్వేనంబర్‌లో 19 గుంటల భూమి నమోదుకావాల్సి ఉన్నది. పూర్తి భూమికి పట్టా ఇవ్వాలని ఎన్నిసార్లు తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. అధికారులు ఇప్పటికైనా తప్పులు సరిచేసి పాసుపుస్తకం అందించాలి.

– కొమురయ్య, రైతు



విభజన అంశంలోని సమస్యల పరిష్కారానికి తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ అడుగులు వేస్తున్నారని ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రజారంజకపాలన కొనసాగుతున్నదని కొనియాడారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని రాములోరిని, శ్రీలక్ష్మీతాయారు అమ్మవారిని, అభయాంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ స్పీకర్‌ను ఆలయ అధికారులు సన్మానించారు.

- భద్రాచలం, నమస్తే తెలంగాణ/సారపాక

## గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థులు

### గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

**హుజూరాబాద్‌టౌన్:** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు తప్పించుకోగా.. కొన్ని గంటల్లోనే పోలీసులు వారిని వెతికి పట్టుకున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన నలుగురు హుజూరాబాద్ మైనార్టీ గురుకుల పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్నారు. గురువారం ఉదయం 5.30 గంటలకు హాస్టల్ నుంచి పారిపోవడంతో తోటి విద్యార్థులు, వార్డెన్ గుర్తించి ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వెతికి మధ్యాహ్నం 12.15 గంటలకు హుజూరాబాద్ మండలం ఇప్పల్‌నర్సింగాపూర్‌లోని ఎల్లమ్మగుడి వద్ద విద్యార్థులను గుర్తించి హాస్టల్‌లో వదిలిపెట్టారు. సెలవులకు వెళ్లి పాఠశాలకు ఆలస్యంగా రావడంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మందలించడంతో పరారైనట్టు విద్యార్థులు పోలీసులకు తెలిపారు.



# గాడినపడ్డ ప్రజారవాణా

- పెద్దసంఖ్యలో రోడ్డెక్కిన బస్సులు
- ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



గురువారం ఖమ్మం బస్టాండ్ నుంచి బయలుదేరుతున్న బస్సులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:**

ప్రజా రవాణా పూర్తిగా గాడిలో పడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయి. యంత్రాంగం కృషితో పట్టణాలు, పల్లెలకు మధ్య రవాణా సౌకర్యం పెరగడంతో పాటు ప్రయాణికులు ఎక్కువగా ఉండే మార్గాల్లో మరిన్ని బస్సులు తిరుగుతున్నాయి. విద్యార్థులు రాకపోకలు సాగించే వేళలకు అనుగుణంగా బస్సులు తిరిగేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం సాయంత్రం 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా 6,395 బస్సులు నడిచినట్టు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. 4,290 బస్సుల్లో టిమ్స్ ద్వారా, 1,531 బస్సుల్లో మ్యానువల్‌గా టికెట్లు జారీ చేసినట్టు తెలిపారు.

✦ కరీంనగర్ రీజియన్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో గురువారం 98.78 శాతం బస్సులు నడిచాయి. 656 బస్సులు నడపాల్సి ఉండగా 451 ఆర్టీసీ, 197 అద్దె కలిపి 648 బస్సులు నడిపారు. 531 బస్సుల్లో టిమ్ మిషన్లు, 117 బస్సుల్లో టికెట్లు ఇచ్చారు. వరంగల్ రీజియన్‌లో పరిధిలో 690 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. ఖమ్మం జిల్లాలో బస్సులన్ని రోడ్డెక్కాయి. ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల్లో యథావిధిగా నడిచాయి. ఖమ్మం డిపోలో 130, మధిర డిపోలో 54, సత్తుపల్లి డిపోలో 104 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి 90 శాతానికి పైగా బస్సులు నడిచాయి. ఆయా డిపోల పరిధిలో 200 బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. మెదక్ రీజియన్‌లోని 8 డిపోల పరిధిలో 533 బస్సులు వివిధ ప్రాంతాలకు తిరిగాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 204 వాహనాలు ప్రయాణికులకు సేవలందించాయి. నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా డిపోల పరిధిలో 217 ఆర్టీసీ, అద్దె బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేశాయి.

✦ నిజామాబాద్ రీజియన్‌లో గురువారం 89 శాతం ఆర్టీసీ బస్సులు నడిచాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 455 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. ఆసిఫాబాద్ డిపో పరిధిలో 52 బస్సులు వివిధ రూట్లలో తిరిగాయి. పాలమూరు జిల్లా వ్యాప్తంగా 68 ఆర్టీసీ, 37 అద్దె బస్సులు 15 వేలమందిని గమ్యస్థానాలకు చేరవేశాయి. వనపర్తి డిపో నుంచి 80 ఆర్టీసీ, 23 అద్దె బస్సులు వివిధ రూట్లలో నడిచాయి. నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో గురువారం 303 బస్సు సర్వీసులు నడిచాయి. 184 బస్సుల్లో టిమ్స్ ద్వారా టికెట్లు అందించారు. సూర్యాపేట డిపో పరిధిలో 55 ఆర్టీసీ, 44 అద్దె బస్సులు, కోదాడ డిపో పరిధిలో 43 ఆర్టీసీ, 28 అద్దె బస్సులు వివిధ ప్రాంతాలకు తిరిగాయి. యాదగిరిగుట్ట డిపో లో 55 ఆర్టీసీ, 14 అద్దె బస్సులు నడిచాయి. వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి గురువారం 187 బస్సులు వివిధ ప్రదేశాలకు ప్రయాణికులను చేరవేశాయి.

**అంతిమ విజయం మాదే: అశ్వత్థామరెడ్డి**

కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నామని, అంతిమ విజయం తమదేనని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. ఈనెల 30న నిర్వహించే సమర భేరిని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ల వల్లే ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోగలిగామని చెప్పారు.

## ప్రైవేట్‌తోనే లాభాలబాట

### కేంద్ర నూతన వాహన చట్టంలో స్పష్టీకరణ

- ఆర్టీసీలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట
- కేంద్రం చట్టంపై రాష్ట్రంలో బీజేపీ దుష్ప్రచారం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం నూతన మోటారు వాహన చట్టంలో పలు మార్పులు చేసింది. ఇందులో ప్రధానంగా ఆర్టీసీలో ప్రైవేట్ రంగానికి అవకాశం కల్పిస్తే లాభాల బాట పడుతుందని స్పష్టంగా పేర్కొన్నది. ఇప్పటికే పలు కీలక రంగాలను ప్రైవేటీకరించిన కేంద్రం.. తాజాగా రవాణా శాఖలోనూ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే స్పీడ్ గవర్నెన్స్‌ను కచ్చితం చేసిన కేంద్రం.. దానికి సంబంధించిన యంత్రాలను బిగించే పనులన్నీ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్రాలకు సూచించింది. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆ చట్టంలోని 3వ సెక్షన్‌లో పలు సవరణలు చేస్తూ రూపొందించిన బిల్లును 2019 బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించి, చట్టం చేసింది. మోటార్ వెహికిల్(సవరణ) చట్టం–2019' పేరిట అమలవుతున్న ఈ చట్టంలో రవాణారంగంలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి, తక్కువ ధరల్లో ప్రయాణించడానికి పోటీ అనివార్యమని కేంద్రం పేర్కొన్నది. మొబైల్ రంగంలో, విమానయాన రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించడం వల్లే ఆయా రంగాల్లో రేట్లు తగ్గాయని, సౌకర్యా లు పెరిగాయని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కొత్త చట్టం అమలు సందర్భంగా కేంద్రం తరఫున అమిత్‌షా పార్లమెంట్‌లో ప్రకటించారు. కాగా, కేంద్రం చేసిన చట్టానికి విరుద్ధంగా రాష్ట్రంలో బీజేపీ నేతలు ఆర్టీసీ సమ్మెకు మద్దతునివ్వడం, ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా మారింది.

**చెన్నైలో ప్రజారవాణాలో మార్పు**

కేంద్రం కొత్తచట్టం అమలు తర్వాత తమిళనాడు రాజధాని చెన్నైలో ప్రజారవాణా వ్యవస్థలో మొత్తం అద్దె బస్సులను తీసుకొచ్చారు. దీనికి కేంద్రం కూడా మద్దతునిచ్చింది. ప్రతి కిలోమీటరుకు కొంత చెల్లిస్తూ చెన్నై వీధుల్లో ఎలక్ట్రికల్ వాహనాలను తిప్పుతున్నారు. దీన్ని ప్రముఖ వాహన తయారీ కంపెనీ అశోక్‌లేలాండ్‌కు అప్పగించారు. ప్రస్తుతం చెన్నైలో తిరుగుతున్న బస్సులన్నీ అద్దెకు తీసుకున్న బస్సులే. ఇది కొత్త చట్టం అమలు తర్వాతనే నిర్ణయం తీసుకున్నారు. రూట్లకు సంబంధించిన పర్మిట్లను ఆర్టీసీతోపాటు ప్రైవేటు ఆపరేటర్‌కు కూడా సమానంగా ఇవ్వాలని కొత్త చట్టంలో పేర్కొన్నారు. కేంద్రం ఇలాంటి కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకువస్తే.. అదే బీజేపీ నాయకులు తెలంగాణలో మాత్రం ఆర్టీసీ విషయంలో విచిత్రంగా వ్యవహరిస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ డిమాండ్ చేయడం విడ్డూరంగా మారింది.

## గోదావరి జలాలతో రైతుల కల సాకారం



సూర్యాపేట జిల్లా నంద్యాలవారిగూడెంలో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న జగదీశ్‌రెడ్డి

### విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**ఆత్మకూర్.ఎస్:** గోదావరి జలాల రాకతో సూర్యాపేట జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరిందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నంద్యాలవారిగూడెం స్టేజీ సమీపంలో 22ఎల్ కాల్వ వద్ద గోదావరి జలాలకు మంత్రి పూజలు చేసి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ కాల్వలతో చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామన్నారు. రైతుల కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంజినీరు అవతారమెత్తి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, ఇంచార్జి ఎంపీపీ నేరెళ్ల వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ కృషితో చెరువులు పూర్వవైభవాన్ని సంతరించుకున్నాయని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంజీకేఎల్ఐ నీటితో నిండిన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కన్మనూరు పెద్దచెరువులో గురువారం మంత్రి పూజలు చేశారు. - అడ్డాకుల



జలపాతాన్ని తలపిస్తున్న దేవరుప్పల చెక్‌డ్యాం

## యశ్వంతాపూర్ వాగుకు జలకళ

- పచ్చబడ్డ బీడుభూములు
- మంత్రి ఎర్రబెల్లి కృషితో చెక్‌డ్యాంల నిర్మాణం
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

**దేవరుప్పల:** ఒకప్పుడు ఎడారిని తలపించిన వాగు నేడు జలాశయాన్ని మరిపిస్తున్నది. చెక్‌డ్యాంల నిర్మాణంతో ఆ వాగు పరీవాహక ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగి రైతులు ధీమాగా పంటలు సాగు చేస్తున్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలాన్ని రెండుగా చీలుస్తూ ప్రవహించే యశ్వంతాపూర్ వాగులో రెండు దశాబ్దాలుగా నీరులేక పరివాహక ప్రాంత రైతులు భూములను బీడుగా ఉంచారు. తెలంగాణ వచ్చాక వాగుపై పెదమదూరు, కడవెండి, దేవరుప్పులలో నిర్మించిన చెక్‌డ్యాముల్లో నీరు చేరి 12 కిలోమీటర్ల మేర బ్యాక్ వాటర్ నిలవడంతో వాగు జీవకళ సంతరించుకున్నది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పెదమదూరు, చినమదూరు, కడవెండి, దేవరుప్పుల గ్రామాల వద్ద రూ.20 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాంలు నిర్మించారు. వాగులో నీరు చేరగా ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హన్మకొండ బస్టాండ్ సమీపంలో మోకాలిలోతు నీటిలో వెళ్తున్న వాహనదారుడు



రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని నేతన్న చౌక్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

# వరంగల్ నగరాన్ని ముంచెత్తిన వాన

- రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- 10 సెం.మీ. వర్షపాతం నమోదు
- రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లోనూ భారీవర్షం
- గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్‌లో ఓ మోస్తరు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వరంగల్ నగరాన్ని ముంచెత్తింది. రెండు గంటలపాటు కురిసిన వానకు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 10 సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. సూర్యాపేట, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోనూ భారీ వర్షం పడగా, కరీంనగర్ జిల్లాతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

✦ వరంగల్ మహానగరంలో గురువారం సాయంత్రం 4 నుంచి రెండున్నర గంటల పాటు ఉరుములు, మెరుపులతో అతి భారీ వర్షం కురిసింది. స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు ఇండ్లకు వెళ్లే సమయం కావడంతో ఎక్కడివారు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. హన్మకొండ, కాజీపేట, వరంగల్ నగరాల్లోని రోడ్లపై మోకాలిలోతు వరకు వరద చేరింది. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

✦ వరంగల్ అండర్ బ్రిడ్జి మధ్యలో వరదలో చిక్కుకున్న స్కూల్‌వ్యాన్ నుంచి స్థానికులు 35 మంది విద్యార్థులను బయటకు తీశారు.

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీగా..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. సిరిసిల్ల పట్టణంతోపాటు ఇల్లంతకుంట, కోనరావుపేట మండలాల్లో సాయంత్రం గంటపాటు వర్షంపడింది. దీంతో సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్, వెంకంపేట రోడ్డు, నేతన్నచౌక్, సంజీవయ్యనగర్ లోని రోడ్లు జలమయమయ్యాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గురువారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురువగా, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో ఓ మోస్తరు వాన పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురువగా, పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చొప్పదండిలో 4.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మంచాల, మాడ్గుల, ఫరూక్‌నగర్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం పడింది. మెహిదీపట్నం 2.5 సెం.మీ., రామచంద్రాపురం 2.4 సెం.మీ., లంగర్‌హౌస్, గుడిమల్కాపూర్‌లో 2.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**వచ్చే మూడ్రోజులు గ్రేటర్‌కు వర్షసూచన**

**హైదరాబాద్ సిటీబ్యూరో:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాగల మూడ్రోజులు గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తా ఆంధ్ర, దానిని ఆనుకొని ఉన్న దక్షిణ ఒడిశా, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్నదని, దీనికి అనుబంధంగా 5.8 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందన్నారు.

**భారీ వర్షం.. పంటకు నష్టం**

కరీంనగర్ జిల్లావ్యాప్తంగా గురువారం కురిసిన వర్షానికి పలుచోట్ల ధాన్యం తడిచిపోయింది. చొప్పదండి మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చిన ధాన్యం తడవడంతో రైతులు అష్టకష్టాలు పడ్డారు. మానకొండూర్, హుజూరాబాద్, జమ్మికుంట మండలాల్లోనూ వరిపంట నేలవాలింది. జమ్మికుంట మండలంలోని విలాసాగర్, పాపక్కపల్లి, వావిలాలలో వర్షాలకి నేలవాలిన వరిని అధికారులు పరిశీలించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట, కోనరావుపేటలో వరి ధాన్యం తడిసింది.

### కాకతీయ కాల్వలో ఇద్దరి గల్లంతు



అబ్దుల్ కరీం, రిజ్వానుద్దీన్ (ఫైల్)

**తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ శివారులోని కాకతీయ కాల్వలో గురువారం సాయంత్రం ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఎల్‌ఎండీ ఎస్సై నరేశ్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం..కరీంనగర్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రియాజ్ రెండో కొడుకు రిజ్వానుద్దీన్(16), మేనమామ అబ్దుల్ కరీం (25)తో కలిసి గురువారం మధ్యాహ్నం కాకతీయ కాల్వలో స్నానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు జారిపడి ఒకరి తర్వాత ఒకరు నీటిలో కొట్టుకుపోయారు. సమాచారం తెలుసుకున్న మానకొండూర్ సీఐ సంతోశ్‌కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై నరేశ్ రెడ్డి కాల్వను పరిశీలించి, మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్ పోలీసులను అప్రమత్తం చేశారు. కాల్వ గట్టుపై ఉన్న బైకు, దుస్తులను పరిశీలించి బంధువులకు సమాచారమిచ్చారు. సాయంత్రం భారీ వర్షం కురవడం, నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గల్లంతైన వారి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్సై తెలిపారు. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి నీటి ప్రవాహం తగ్గించాలని సూచించారు. రిజ్వానుద్దీన్ తండ్రి రియాజ్ ప్రస్తుతం మండలి విప్ భానుప్రసాద్ వద్ద గన్‌మన్‌గా పని చేస్తున్నారు.

# ఉప్పొంగిన కృష్ణమ్మ

- శ్రీశైలానికి 6.29 లక్షల క్యూసెక్కుల వరద
- 10 గేట్ల ద్వారా దిగువకు 5.48లక్షల క్యూసెక్కులు..
- సాగర్ నుంచి 22 క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల
- ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద



శ్రీశైలం డ్యాం నుంచి 10 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

**హైదరాబాద్, జోగుళాంబగద్వాల, నాగరకర్నూల్, నమస్తే తెలంగాణ/అయిజ, నందికొండ:** రికార్డు స్థాయిలో కృష్ణమ్మకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఈ సీజన్‌లో ఇప్పటికే పలుమార్లు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదలగా మరోసారి భారీస్థాయిలో వరద పోటెత్తింది. అటు ఆల్మట్టి నుంచి ఇటు ప్రకాశం బరాజ్ వరకు నీటి విడుదల కొనసాగుతున్నది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు 6.29లక్షల క్యూసెక్కుల వరద రావడంతో 10 గేట్లను ఎత్తి 5.48 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. గురువారం సాయంత్రం ఆల్మట్టికి 2.03 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2.44 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నారాయణపుర జలాశయానికి 2.10 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు 1.78 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల జలాశయం వద్ద 4.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 47 గేట్లు ఎత్తి 5.08 లక్షల క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. టీబీ డ్యాం నుంచి ప్రధాన కృష్ణాలోకి 48 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతుంది. ఇటు జూరాలతోపాటు తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద చేరుతున్నది. గురువారం 6.63 లక్షల క్యూసెక్కుల వరద రాగా, 10 గేట్లను ఎత్తి 5.47 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలోకి కూడా వరద ఉధృతి కొనసాగుతున్నది. 6.07 లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో నమోదవుతుండటంతో అధికారులు 22 క్రస్టు గేట్లను ఎత్తి దిగువకు 5.46 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. పులిచింతలకు 6.38 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 5.86 లక్షల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బరాజ్‌కు వదులుతున్నారు.

**ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో**

**మెండోరా, మహదేవపూర్:** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీకి ఎగువ నుంచి గురువారం మళ్లీ వరద పెరిగింది. మహారాష్ట్ర నుంచి దాదాపు 33,400 క్యూసెక్కుల వరద వస్తుండటంతో అధికారులు 8 వరద గేట్లను ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సరస్వతి కాల్వకు 400 క్యూసెక్కులు వదిలారు. కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి లో90 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో నిర్మించిన కాళేశ్వరం లక్ష్మీ(మేడిగడ్డ)బరాజ్‌లో గురువారం 15 గేట్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
8
[ కరీంనగర్ ]
శుక్రవారం 25 అక్టోబర్ 2019
WWW.NTNEWS.COM




ముంబైలో గురువారం ఆడి ఏ6 కారు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ

## నేడే హజారే ఫైనల్

**బెంగళూరు:** విజయ్ హజారే ట్రోఫీలో శుక్రవారం జరిగే ఫైనల్లో తమిళనాడు, కర్ణాటక తలపడుతాయి. బలబలాల పరంగా చూస్తే ఇరు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. నాకౌట్ మ్యాచ్‌ల్లో కర్ణాటక అదృష్టంతో గట్టెక్కితే...లీగ్ ఆసాంతం తమిళనాడు మెరుగైన ఆటతీరు కనబరిచింది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రాణించిన మయాంక్ అగర్వాల్, అశ్విన్‌పై అందరి దృష్టి ఉంది.



గురువారం హైదరాబాద్‌లో చెస్ ప్లేయర్ సరయును అభినందిస్తున్న రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే ధర్మారెడ్డి

## సరయుకు క్రీడా మంత్రి అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన సరయును రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ గురువారం అభినందించారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మంత్రిని సరయు మర్యాదపూర్వకంగా కలిసింది. ఈనెల 1 నుంచి 13 వరకు ముంబైలో జరిగిన ప్రపంచ యూత్ చెస్ టోర్నీ అండర్-13 విభాగంలో పోటీకి దిగిన సంగెం మండలం మొండ్రాయికి చెందిన సరయు ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం క్రీడా హబ్‌గా రూపాంతరం చెందుతున్నదని, క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలతో అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలని మంత్రి అన్నారు.

# విరాట్‌కు విశ్రాంతి



శివమ్ దూబే

### టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా రోహిత్‌శర్మ.. జట్టులోకి శివమ్ దూబే, శాంసన్

### మార్పుల్లేకుండానే టెస్టు టీమ్.. బంగ్లాతో సిరీస్‌లకు జట్ల ఎంపిక

**రన్‌మెషీన్ విరాట్ కోహ్లీకి బంగ్లాదేశ్‌తో స్వదేశంలో జరిగే టీ20 సిరీస్ నుంచి విశ్రాంతి లభించింది. భీకరఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ జట్టును ముందుకు నడిపించనుండగా.. ఆల్‌రౌండర్ శివమ్ దూబే తొలిసారిగా టీమ్‌ఇండియాకు ఎంపికయ్యాడు. నాలుగేండ్ల తర్వాత జట్టులో యువ క్రికెటర్ సంజూ శాంసన్ చోటు దక్కించుకున్నాడు. పొట్టి సిరీస్ నుంచి ఆల్‌రౌండర్ జడేజాకు విశ్రాంతినివ్వగా.. చాహల్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. ధోనీతో మాట్లాడామని చెప్పిన చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే.. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేశామని, యువకులకు మరిన్ని అవకాశాలు ఇస్తామని తేల్చేశాడు. పంత్‌కు రెండు ఫార్మాట్లలో చోటు దక్కింది. ఇక బంగ్లాతో రెండు టెస్టులకు మాత్రం సఫారీలను క్లీన్‌స్వీప్ చేసిన జట్టునే ఎంపిక చేయగా... కోహ్లీ సారథిగా తిరిగిరానున్నాడు.**

**ముంబై:** దక్షిణాఫ్రికాను చిత్తుచేసిన ఉత్సాహంలో ఉన్న టీమ్‌ఇండియా స్వదేశంలో బంగ్లాదేశ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. నవంబర్ 3న సిరీస్ మొదలు కానుండగా.. బంగ్లాతో మూడు టీ20లు, రెండు టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్‌లకు భారత జట్లను చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ గురువారం ఎంపిక చేసింది. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీకి టీ20 సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చింది. సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. కొంత కాలంగా ఇండియా-ఏ తరఫున నిలకడగా రాణిస్తున్న ముంబై యువ ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఎట్టకేలకు పొట్టి సిరీస్‌కు తొలిసారిగా ఎంపికయ్యాడు. అలాగే టీ20 జట్టులోకి వికెట్ కీపింగ్ బ్యాట్స్‌మన్ సంజూ శాంసన్, స్పిన్నర్ యజువేంద్ర చాహల్ పునరాగమనం చేశారు. మరోవైపు దక్షిణాఫ్రికాను సొంతగడ్డపై టెస్టు సిరీస్‌లో 3-0తో చిత్తుచిత్తుగా ఓడించిన జట్టునే.. బంగ్లాతో సుదీర్ఘ ఫార్మాట్ సిరీస్‌కు సెలెక్షన్ కమిటీ కొనసాగించింది. రెండు ఫార్మాట్లలోనూ వికెట్ కీపర్ పంత్‌కు చోటు దక్కింది. బంగ్లా ప్లేయర్లు సమ్మె విరమించడంతో భారత పర్యటనపై నెలకొన్న సందిగ్ధతకు కూడా తెర పడింది.

**హార్దిక్ స్థానంలో దూబే**

దేశవాళీ టోర్నీల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శివమ్ దూబే ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) తరఫున బరిలోకి దిగి ఆకట్టుకున్నాడు. బంగ్లాతో టీ20లకు ఎంపికైన ఈ ముంబైకర్ మీడియం పేస్‌తో పాటు మిడిల్‌ఆర్డర్‌లో వచ్చి దూకుడుగానూ బ్యాటింగ్ చేయగల సమర్థుడు. అందుకే హార్దిక్ పాండ్య గైర్హాజరీలో దూబేను తీసుకున్నామని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చెప్పాడు. ఆ స్థానానికి దూబే సరిగ్గా సరిపోతాడని కితాబు కూడా ఇచ్చేశాడు. దూబే రాకతో... వైఫల్యాల బాటలో ఉన్న విజయ్ శంకర్‌కు దాదాపుగా టీమ్‌ఇండియా తలుపులు మూసుకుపోయినట్టే కనిపిస్తున్నది.

**గాయాల దెబ్బ**

వెన్నునొప్పికి లండన్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న టీమ్‌ఇండియా యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య.. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లకు దూరమయ్యారు. యువ పేసర్ నవదీప్ సైనీ గాయం కారణంగా అందుబాటులో లేకుండా పోయాడు. స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌దీ అదే పరిస్థితి. వచ్చే సిరీస్‌కు అతడు కోలుకునే అవకాశం ఉందని సెలెక్టర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

**ధోనీతో మాట్లాడాం.. పంత్‌కు మద్దతిస్తాం**

బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు జట్టు ఎంపికకు ముందే టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ధోనీతో మాట్లాడామని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చెప్పాడు. యువ ఆటగాళ్లను ప్రోత్సహించాలన్న ఆలోచనలకు మహీ కూడా మద్దతు తెలిపాడని అన్నాడు. రిటైర్మెంట్‌పై తుదినిర్ణయం ధోనీ వ్యక్తిగతమని అభిప్రాయపడ్డాడు. అలాగే కీపర్ పంత్‌కు మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేశాడు. 'వన్డే ప్రపంచకప్ తర్వాతి నుంచి పంత్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాం. ఇప్పుడు కూడా అతడికి మద్దతుగానే ఉన్నాం. పంత్ మెరుగవుతున్నాడు కూడా. అతడి స్థాయి, అంచనాలకు తగ్గట్టు కొన్ని మ్యాచ్‌లు ఆడకున్నా... మద్దతివ్వడం ద్వారానే మనం ఓ అత్యున్నత ఆటగాడిని తయారు చేయగలమనేది నిజం. పంత్ విజయవంతమవుతాడనే నమ్మకం మాకుంది. టీ20 ప్రపంచకప్ కోసం మా దృష్టంతా అతడిపైనే ఉంటుంది' అని ఎమ్మెస్కే చెప్పాడు.

**టెస్టులకు అదే జట్టు**

దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన.. టీమ్‌ఇండియానే బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు సెలెక్టర్లు ఎంపిక చేశారు. పొట్టి ఫార్మాట్‌లో విశ్రాంతి తీసుకోనున్న కెప్టెన్ కోహ్లీ.. సుదీర్ఘ ఫార్మాట్‌కు తిరిగి రానున్నాడు. ఇక సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్ మరోసారి స్వదేశంలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. టీ20ల్లో విశ్రాంతి పొందిన ఆల్‌రౌండర్ జడేజా టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. స్పిన్నర్ కుల్దీప్‌కు గాయం కారణంగా అతడి స్థానంలో సఫారీలతో చివరి టెస్టు ఆడి రాణించిన షాబాజ్ నదీమ్‌కు చాన్స్ దక్కలేదు. సఫారీ సిరీస్‌కు ముందుగా ఎంపికైన చైనామన్ బౌలర్ తన స్థానాన్ని నిలుపుకున్నాడు. ఇక కీపర్లుగా సాహా, పంత్ ఉండగా.. షమీ, ఉమేశ్, ఇషాంత్‌తో పేస్ విభాగం పటిష్ఠంగా ఉంది.

## నాలుగేండ్ల తర్వాత శాంసన్



**మోస్ట్** టాలెంటెడ్ కేరళ ప్లేయర్, ఐపీఎల్‌లో ఎన్నో ఏండ్లుగా అదరగొడుతున్న సంజూ శాంసన్ ఎట్టకేలకు టీమ్‌ఇండియా టీ20 జట్టులోకి పునరాగమనం చేశాడు. చివరిసారిగా అతడు 2015లో జింబాబ్వేపై భారత జట్టు తరఫున ఓ మ్యాచ్ ఆడాడు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్‌లో 410 పరుగులతో రాణించి మళ్లీ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇండియా-ఏ తరఫున కూడా చాలా కాలంగా శాంసన్ నిలకడగా రాణిస్తున్నాడు. వెస్టిండీస్‌తో పాటు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో అద్భుతంగా ఆడాడు. వికెట్ కీపింగ్ కూడా చేయగలగడం సంజూకు మరో పెద్ద సానుకూలత. రిషభ్ పంత్‌కు అతడు బ్యాకప్‌గానూ ఉంటాడు. ఇక జడేజాకు కూడా ఈ సిరీస్ నుంచి విశ్రాంతినివ్వడంతో పేసర్ శార్దూల్ ఠాకూర్ జట్టులోకి వచ్చాడు. చాహర్ బ్రదర్స్ రాహుల్, దీపక్ జట్టులో చోటు నిలుపుకున్నారు.

| భారత్- బంగ్లాదేశ్ షెడ్యూల్ | | |
|---|---|---|
| మ్యాచ్ | తేదీ | వేదిక |
| తొలి టీ20 | నవంబర్ 03 | ఢిల్లీ |
| రెండో టీ20 | నవంబర్ 07 | రాజ్‌కోట్ |
| మూడో టీ20 | నవంబర్ 10 | నాగ్‌పూర్ |
| టెస్టు సిరీస్ | | |
| తొలి టెస్టు | నవంబర్ 14-18 | ఇండోర్ |
| రెండో టెస్టు | నవంబర్ 22-26 | కోల్‌కతా |

**టీ20 జట్టు :** రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధవన్, కేఎల్ రాహుల్, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, కృనాల్ పాండ్య, యజువేంద్ర చాహల్, రాహుల్ చాహర్, దీపక్ చాహర్, ఖలీల్ అహ్మద్, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్

**టెస్టు జట్టు :** విరాట్ కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్, చతేశ్వర్ పుజార, అజింక్య రహానే, హనుమ విహారి, సాహా(వికెట్‌కీపర్), జడేజా, అశ్విన్, కుల్దీప్, షమీ, ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మ, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్

> ఒక విషయం స్పష్టంగా చెప్పగలను. టీ20 ప్రపంచకప్ కంటే ముందు ఎక్కువ మంది యువకులకు అవకాశాలిస్తాం. వారిని వారు నిరూపించుకునేందుకు ప్రోత్సహిస్తాం. రిషభ్ పంత్ బాగానే ఆడుతున్నా.. సంజూ శాంసన్‌కు చోటిచ్చాం. దీన్నిబట్టే మా ఆలోచనా విధానం అర్థమై ఉంటుందని అనుకుంటున్నా. ప్రపంచకప్ కోసం ఓ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశాం. ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతాం'
>
> **- చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్**

## దూకుడే ఇష్టం

### భారత్‌కు ఎంపికవుతానని ముందే అనుకున్నా

### ఆల్‌రౌండర్ శివమ్ దూబే

**బ్యాటింగ్‌లో** ధనాధన్ ఆటే తనకు ఇష్టమని, దూకుడు ఎప్పటికీ విడిచిపెట్టనని యువ ఆల్‌రౌండర్ శివమ్ దూబే చెప్పాడు. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు ఎంపికయ్యాక అతడు మీడియాతో మాట్లాడాడు. 'నాకు సాధారణంగానే హిట్టింగ్ చేసే బలముంది. కాస్త కసరత్తులు చేశా, చేస్తున్నా. నన్ను దూకుడైన బ్యాట్స్‌మన్ చేయాలని మా నాన్న కోరుకున్నారు. నేను టీమ్‌ఇండియాకు ఆడడమే ఆయన లక్ష్యం. అదే నా లైఫ్‌స్టైల్‌గా మారింది. పవర్ హిట్టింగ్ అంటే నాకిష్టం. భారత జట్టుకు కచ్చితంగా ఎంపికవుతానని అనుకున్నా. పిలుపు కోసం ఎదురుచూశా. అది నెరవేరడం ఎంతో సంతోషంగా ఉంది. మా నాన్నకు, దేవుడికి కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నా. కష్టపడడం ఎప్పటికీ ఆపను. ఆల్‌రౌండర్‌గా నేను 100 శాతం ఏకాగ్రత, ఫిట్‌నెస్‌తో ఉండడం ఎంతో ముఖ్యం. ఐపీఎల్‌లో బెంగళూరుకు ఆడిన సమయంలో కోహ్లీ నిత్యం సహకరించాడు. మద్దతుగా నిలబడ్డాడు. ఒత్తిడిలో ఉన్నా, సమస్యలు ఎదుర్కొన్నా.. విరాట్‌తో మాట్లాడే వాడిని. అతనెప్పుడూ నన్ను సరిగా అర్థం చేసుకునే వాడు. ఇంత కాలం నాకు మద్దతుగా నిలిచిన మీడియాకు కూడా ధన్యవాదాలు' అని దూబే వెల్లడించాడు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ తనకు రోల్‌మోడల్ అని చెప్పాడు. దూబేను బెంగళూరు రాయల్ చాలెంజర్స్ గతేడాది వేలంలో రూ.5 కోట్లకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 16 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అతడు 1,012 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు.



## దాదాతో కోహ్లీ, రోహిత్ భేటీ

**ముంబై:** బీసీసీఐ నూతన అధ్యక్షుడు సౌరవ్ గంగూలీని భారత నాయక ద్వయం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గురువారం కలుసుకుంది. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లకు జట్టు ఎంపిక సందర్భంగా వీరంతా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ క్రికెట్ రోడ్‌మ్యాప్ గురించి వీరు చర్చించారు. దీనికి తోడు సీనియర్ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ భవితవ్యంపై చర్చకు వచ్చినా ఎవరూ మాట్లాడలేదని తెలిసింది. గంగూలీతో పాటు కార్యదర్శి జై షా, సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ పాల్గొన్న ఈ భేటీకి చీఫ్ కోచ్ రవిశాస్త్రి రాలేదు. సమావేశానికి సంబంధించిన ఫొటోను బీసీసీఐ సోషల్‌మీడియాలో షేర్ చేసింది. 'టీమ్‌ఇండియా కెప్టెన్, వైస్ కెప్టెన్‌ను అధ్యక్షుడు, కార్యదర్శి కలువాలనుకున్నారు. దేశ క్రికెట్ రోడ్‌మ్యాప్‌నకు సంబంధించి చర్చ జరిగింది. అధ్యక్ష హోదాలో గంగూలీ సలహాలు, సూచనలు చేశారు' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. విరామం లేకుండా వరుస సిరీస్‌లు ఆడుతున్న కోహ్లీకి విశ్రాంతినిచ్చిన సెలెక్షన్ కమిటీ.. రోహిత్‌శర్మకు టీ20ల కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది.

## సమ్మె వీడిన బంగ్లా ఆటగాళ్లు

### భారత పర్యటనకు లైన్‌క్లియర్



గురువారం చర్చల అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న షకీబ్

**ఢాకా :** బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఎట్టకేలకు సమ్మె విరమించడంతో భారత పర్యటనపై సందిగ్ధం వీడింది. వేతనాల పెంపు సహా అన్ని డిమాండ్లపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బోర్డు (బీసీబీ)తో దాదాపు రెండు గంటల పాటు ఆటగాళ్లు చర్చించారు. తమ డిమాండ్లకు బీసీబీ సానుకూలంగా స్పందించిందని, అందుకే సమ్మెను విరమిస్తున్నామని బంగ్లా కెప్టెన్ షకీబల్ హసన్.. చర్చల అనంతరం గురువారం ఇక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించాడు. 'బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్, డైరెక్టర్లతో సమావేశం ఫలవంతంగా సాగింది. మా డిమాండ్లను వీలైనంత త్వరగా నెరవేరుస్తామని చెప్పారు. వారి హామీ మేరకు మేము ఆడడం ప్రారంభిస్తున్నాం. ఎన్‌సీఎల్‌తో పాటు ట్రైనింగ్ క్యాంపులోనూ పాల్గొంటాం' అని షకీబ్ చెప్పాడు. సమావేశంలో షకీబ్‌తో పాటు సీనియర్ ప్లేయర్లు ముష్ఫికర్ రహీమ్, మహ్మదుల్లా, తమీమ్ ఇక్బాల్ ఉన్నారు. ఆటగాళ్లు ముందుగా 11 డిమాండ్లు చేయగా మరో రెండు జత చేశారు. బీసీబీ ఆదాయంలో ప్లేయర్లకు వాటా ఇవ్వాలని, మహిళా క్రికెటర్లకు కూడా సమాన వేతనం అమలు చేయాలని కోరారు. అయితే తాజా డిమాండ్లపై మాత్రం బీసీబీ అధ్యక్షుడు నజ్ముల్ హామీ ఇవ్వలేదు. బంగ్లాదేశ్ జట్టు వచ్చే నెలలో భారత పర్యటనకు రానుంది.

## ఐఎస్‌ఎల్‌లో హైదరాబాద్ అరంగేట్రం

### సహ యజమానిగా రానా




**కోల్‌కతా :** ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్‌ఎల్) ఆరో సీజన్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు అరంగేట్రం చేయనుంది. శుక్రవారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో మాజీ చాంపియన్ అట్లెటికో డీ కోల్‌కతా(ఏటీకే)ను హైదరాబాద్ తన తొలి పోరులో ఢీకొననుంది. మాజీ ఇంగ్లిష్ ప్లేయర్, సీనియర్ కోచ్ ఫిల్ బ్రౌన్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా.. డేవిసన్ రొగేరియో డిసిల్వా, గైల్స్ బర్నెస్ లాంటి విదేశీ స్టార్ ఆటగాళ్లు హైదరాబాద్ జట్టులో ఉన్నారు. అయితే స్పానిష్ స్టార్ ఆటగాడు నెస్టల్ గాడిలో తొలి 8 మ్యాచ్‌లకు దూరం కావడం కాస్త ఎదురుదెబ్బగా మారింది. గనీ నిగమ్, సహిల్ తవోరా, లాల్‌ధన్‌మావియా, దీపేందర్ నేగీ, అశీష్ రాయ్, తారిఫ్ అఖంద్ లాంటి ప్రతిభావంతులైన దేశీయ ఆటగాళ్లు హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇంగ్లిష్ ప్లేయర్ మాథ్యూ కిల్‌గలాన్, రఫా లోపేజ్ గేమేజ్ లాంటి ఆటగాళ్లతో డిఫెన్స్ పటిష్ఠంగా ఉంది. కాగా, హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు సహ యజమానుల జాబితాలో ప్రముఖ హీరో దగ్గుబాటి రానా చేరాడు. ఈ విషయాన్ని యాజమాన్యం గురువారం ప్రకటించింది. మరోవైపు కొచ్చి వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి సిటీ 1-0తో కేరళ బ్లాస్టర్స్‌పై విజయం సాధించింది.



## మరాఠా జట్టులో యువరాజ్

**దుబాయ్:** డాషింగ్ క్రికెటర్ యువరాజ్ సింగ్ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతున్నాడు. ధనాధన్ క్రికెట్‌కు చిరునామాగా వెలుగులోకి వచ్చిన టీ10 టోర్నీలో సత్తాచాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. అబుదాబి వేదికగా వచ్చే నెల 14 నుంచి మొదలయ్యే టీ10 టోర్నీలో మరాఠా అరేబియన్స్ తరఫున యువీ బరిలోకి దిగుతున్నాడు. గురువారం అరేబియన్స్ జట్టు యాజమాన్యం యువీని ఐకానిక్ ప్లేయర్‌గా ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## సాత్విక్ - చిరాగ్ సంచలనం

### ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ చాంపియన్ జోడీపై గెలుపు.. క్వార్టర్స్‌లో సింధు, సైనా.. ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



**పారిస్ :** భారత షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి - చిరాగ్ శెట్టి ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనం సృష్టించారు. మూడు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఇండోనేషియా ద్వయాన్ని పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో మట్టికరిపించారు. భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ ప్రిక్వార్టర్స్‌లో ప్రత్యర్థులపై విజయాలు సాధించారు. గురువారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి - చిరాగ్ శెట్టి జోడీ 21-18, 18-21, 21-13 తేడాతో ప్రపంచ చాంపియన్, రెండో సీడ్ ఇండోనేషియా జోడీ మహమ్మద్ అహ్సాన్ - హెండ్రా సెటివాన్‌పై విజయం సాధించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. 53 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్ తొలి గేమ్‌లో భారత జోడీ 3-0తో ఆధిక్యంలో నిలిచి శుభారంభం చేసింది. అయితే ఇండోనేషియా జోడీ దూకుడు ప్రదర్శించి 16-14తో పైచేయి సాధించింది. అయితే ఆ తర్వాత పుంజుకున్న రాంకీరెడ్డి ద్వయం వరుసగా ఐదు పాయింట్లు సాధించడం సహా గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో ప్రపంచ చాంపియన్ జంట అదరగొట్టడంతో మ్యాచ్ నిర్ణయాత్మక గేమ్‌కు చేరుకుంది. అనూహ్యంగా చివరి గేమ్‌లో భారత ద్వయం విజృంభించి 21-13తో గెలిచి సంచలనం సృష్టించింది. క్వార్టర్స్‌లో కిమ్ అస్ట్రప్ - ఆండ్రెస్ స్కారప్‌రస్ముసెన్(డెన్మార్క్)తో సాత్విక్ - చిరాగ్ తలపడనున్నారు.

**సింధు, సైనా ముందడుగు**

మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ సైనా నెహ్వాల్ 21-10, 21-11 తేడాతో లైన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్)పై గెలిచింది. క్వార్టర్స్‌లో అన్‌సే యంగ్ (కొరియా)తో సైనా తలపడనుంది. ప్రపంచ చాంపియన్ పీవీ సింధు 21-10, 21-13 తేడాతో యీ జినామిన్ (సింగపూర్)పై గెలువగా, క్వార్టర్స్‌లో టాప్ సీడ్ తైజు యింగ్ (చైనీస్ తైపీ)చేరింది.

## భారత్ @ 106



**న్యూఢిల్లీ:** భారత ఫుట్‌బాల్ జట్టు తమ ర్యాంకింగ్స్‌ను చేజార్చుకుంది. గురువారం విడుదలైన తాజా ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ రెండు స్థానాలు కోల్పోయి 106 ర్యాంక్‌లో నిలిచింది. ఈనెల మొదట్లో తమ కంటే తక్కువ ర్యాంక్‌లో ఉన్న బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకోవడం ద్వారా బ్లూ టైగర్స్ ర్యాంక్‌లో క్షీణత వచ్చింది. ఆసియా చాంపియన్ ఖతార్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న ఛెత్రీసేన బంగ్లాతో మ్యాచ్‌లో స్థాయికి తగ్గ ఆటతీరుతో రాణించలేకపోయింది. డ్రా ద్వారా బంగ్లా మూడు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 184వ ర్యాంక్‌కు చేరుకుంది. ఓవరాల్‌గా బెల్జియం టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నది.

# రేక్ పాయింట్లు పెంచాలి

## రైల్వేకు రాష్ట్ర వ్యవసాయాధికారుల విజ్ఞప్తి

## యాసంగికి ఎరువుల సరఫరాపై సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి సీజన్‌లో ఎరువుల లభ్యతను పెంచేలా ప్రణాళిక చేపట్టేందుకు దక్షిణమధ్య రైల్వే అధికారులు గురువారం హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కాకినాడ, కృష్ణపట్నం, విశాఖపట్నం, గంగవరం పోర్టులకు దిగుమతయిన ఎరువులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు వేగంగా రవాణా చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు. యాసంగిలో యూరియా వినియోగం చాలా తక్కువగా ఉంటుందని, అయినప్పటికీ తగినంత బఫర్‌స్టాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని ప్రతిపాదించారు. ఎరువుల పంపిణీకి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్‌స్టాక్‌ను కేటాయించారు. ఈ నెలతోపాటు వచ్చే నెలలో రైతులకు అందజేయాల్సిన యూరియాను సజావుగా సరఫరాచేసేందుకు రైల్వే అధికారులు సకాలంలో తగినన్ని రేక్ పాయింట్లను అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు కోరారు. తెలంగాణలో జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ జరిగినందున రేక్ పాయింట్లను 10 నుంచి 33కు పెంచి ఎరువుల పంపిణీని సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. జమ్మికుంట, మహబూబ్‌నగర్, జహీరాబాద్, చిట్యాల, వంగపల్లి, తాండూర్ లాంటి కొన్ని నాన్-ఫంక్షనల్ రేక్ పాయింట్లను ఫంక్షనల్ రేక్ పాయింట్లుగా మార్చడంతోపాటు అన్‌లోడింగ్ పాయింట్లను పెంచాలన్నారు. ఎరువుల కంపెనీలు వినియోగించుకునేలా అదనపు లోడింగ్ కేంద్రాలను రైల్వేబోర్డు సూచించింది. ఈ కేంద్రాల్లో ఎరువులను దిగుమతి చేయడానికి ఎరువుల కంపెనీలు ఒప్పుకోవడంతో మార్కెట్లకు ఎరువులు త్వరగా చేరుకొనేందుకు వీలవుతుంది. రైల్వే తరఫున ప్రిన్సిపల్ ఆపరేషన్స్ మేనేజర్ కే శివప్రసాద, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జాన్‌ప్రసాద్, రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్ శ్రీవాత్సవ, చీఫ్ ఫ్రైట్ ట్రాఫిక్ మేనేజర్ నాగ్య, ఫ్రైట్ సర్వీసెస్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ క్రిష్టఫర్, రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, అదనపు డైరెక్టర్ విజయకుమార్, కాకినాడ పోర్టు అధికారులు, ఇఫ్కో, ఐపీఎల్, జువారీ, క్రిభ్‌కో, ఎన్‌ఎఫ్‌సీఎల్, సీఎఫ్ఎల్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.


రైల్వే అధికారులతో సమావేశమైన రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు


ఏపీలోని గన్నవరంలో అనారోగ్యంతో కన్నుమూసిన ఓ వృషభానికి గురువారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. కాసరనేని రాజా పెంచుకుంటున్న ఈ వృషభం జాతీయస్థాయి పశువుల పోటీల్లో 122 పతకాలు సాధించింది. ఇటీవల ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో నిర్వహించిన జాతీయ బండలాగుడు బల ప్రదర్శనలో కూడా మొదటి బహుమతి లభించింది. -అమరావతి, నమస్తే తెలంగాణ

## సమర్థంగా సంక్షేమం

### సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

### క్యాబినెట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం ఆయా సంక్షేమశాఖల ద్వారా అమలుచేస్తున్న కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. మైనార్టీ, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధ్యక్షతన గురువారం సంక్షేమభవన్‌లో నిర్వహించిన తొలిసమావేశంలో బీసీ సంక్షేమశాఖమంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ సలహాదారు ఏకేఖాన్ పాల్గొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖలకు సంబంధించి అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్, విదేశీ విద్య, స్కాలర్‌షిప్, సంక్షేమ హాస్టళ్లు, ఆర్థిక సహకార పథకాలు, నైపుణ్యాభివృద్ధికి కార్యక్రమాలపై చర్చించారు. ఆయా పథకాలు, వాటి ఫలితాలు అందరికీ అందేందుకు ప్రస్తుత విధానాలు, తలెత్తే సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, ఎస్సీ,ఎస్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కరుణాకర్, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీ శైలజ, బీసీ సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శి సైదా తదితరులు పాల్గొన్నారు.




## నవంబర్ 5 నుంచి ఐఐఎస్ ఫెస్టివల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌ను (ఐఐఎస్ఎఫ్) నవంబర్ 5 నుంచి 8 వరకు కోల్‌కతాలో నిర్వహించేందుకు ఇండియన్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నది. అందుకు సంబంధించి గురువారం ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఎన్‌సీవోఐఎస్) హైదరాబాద్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

## టీసీసీ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు నవంబర్ 4

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష ఫీజు చెల్లింపునకు నవంబర్ 4 వరకు గడువు విధించామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆలస్య రుసుంతో నవంబర్ 18 వరకు గడువు విధించామని, దరఖాస్తు తదితర వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.






కరీంనగర్

నమస్తే తెలంగాణ

# జిందగీ

శుక్రవారం 25 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## స్పైడర్ వుమన్





**గోడలపై పాకుతూ.. మేడలను దాటుతూ వెళ్లే మనుషుల్ని సినిమాల్లో చూస్తుంటాం. ఇదే నేపథ్యంతో వచ్చిన స్పైడర్ మ్యాన్ సినిమా కూడా ఎంతో మందిని అలరించింది. కానీ ఇటీవల ఓ యువతి స్పైడర్ వుమన్‌లా మారింది. ప్రస్తుతం ఆమె వీడియో కూడా ఎంతో మందిని అలరింపజేస్తుంది. ఆమె ఏం చేసిందంటే..**

ఇండోనేషియాకు చెందిన ఎరీస్ సుసంతి రహాయు అనే యువతి గోడపై పరుగెత్తి కొత్త రికార్డు సృష్టించింది. 15 మీటర్ల గోడను కేవలం 7 సెకన్లలోపు పాకింది. ఆ యువతి స్టన్నింగ్ స్టంట్స్ చూసి అక్కడున్నవారు ఆశ్చర్యపోయారు. ఇటీవల చైనాలోని జియామెన్‌లో ఐఎఫ్‌ఎస్‌సీ క్లైంబింగ్ ప్రపంచకప్ పోటీలు జరిగాయి. ఇందులో మహిళల విభాగంలో పోటీ పడిన రహాయు అతి పెద్ద గోడను అవలీలగా ఎక్కేసింది. ప్రపంచ చరిత్రలో ఇంత వేగంగా అంత ఎత్తు గోడ ఎక్కిన యువతిగా రహాయు నిలిచించింది. ఈ విన్యాసాలు చూసినవారంతా ఆమె ధైర్య సాహసాలకు హ్యాట్సాఫ్ చెబుతున్నారు. 'షీ ఈజ్ స్పైడర్ వుమన్' అంటూ ఆమెను అభినందనలతో ముంచెత్తుతున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం రహాయు వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియో ఎంతో మందిని అలరింపజేస్తున్నది.

# పండుగ పూట లెహంగా!

**ఏడాదికి ఎన్ని పండుగలు వచ్చినా.. మగువలు లెహంగా వేసుకోకుండా ఉండలేరు. ఎన్నిసార్లు లెహంగా వేసుకున్నా వాటిపై మోజు తీరదు. వారి అభిరుచికి తగ్గట్లుగానే లెహంగా లుక్ రోజురోజుకూ మారుతూనే ఉంది. మరి వచ్చే దీపావళికి కూడా లెహంగాపైనే కన్నేశారా? అయితే ఈ విభిన్న కాంబినేషన్‌తో లెహంగాలను ఓసారి ట్రై చేయండి.**



మ్యాచింగ్ కుదరాలంటే.. మల్టీ కలర్ లెహంగానే. బేబీపింక్ నెట్ లెహంగాకు గోల్డ్ కలర్ ఎంబ్రాయిడరీ వర్క్ ఇచ్చాం. దీనికి గోల్డ్ కలర్‌లోనే బార్డర్ జత చేశాం. బేబీపింక్ రాసిల్క్‌తో హాఫ్‌స్లీవ్స్ కుట్టాం. దీనికి హెవీగా ఎంబ్రాయిడరీ వర్క్ చేయడంతో అదనపు ఆకర్షణగా ఉంది. నెపీచ్‌కలర్ నెట్ దుపట్టాకు కట్‌వర్క్ చేశాం. మధ్యలో సీక్వెన్స్ బుటీస్ ఇచ్చాం. మల్టీకలర్స్‌తో అందరి చూపు మీవైపే ఉంటుంది.

అందరినీ ఆకర్షించేందుకు ఆరెంజ్ లెహంగా వేయాల్సిందే. నెట్ లెహంగాపై థ్రెడ్ వర్క్, సీక్వెన్స్‌తో హెవీగా డిజైన్ చేశాం. బార్డర్‌కు గోల్డ్ కలర్ లేస్ అదనపు ఆకర్షణగా నిలిచింది. దీనికి ముత్యాలతో పెద్ద టస్సెల్స్ జతచేశాం. మీడియం స్లీవ్‌బ్లౌజ్‌కు లెహంగా డిజైన్ ఇచ్చాం. సీగ్రీన్ దుపట్టాపై కట్ వర్క్ చేశాం. సీక్వెన్స్‌తో బార్డర్ డిజైన్ చేయడంతో లుక్ అదిరిపోయింది.

విభిన్న లుక్‌లో కనిపించేందుకు సీబ్లూ, పింక్ లెహంగా వేయాల్సిందే.. సీబ్లూ నెట్ లెహంగాకు గోల్డ్ కలర్ ఎంబ్రాయిడరీ వర్క్ ఇచ్చాం. దీనికి కాంబినేషన్‌గా పింక్ రాసిల్క్ బ్లౌజ్ ఎంచుకున్నాం. దీనిపై హెవీ ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. బ్లౌజ్, లెహంగాకు తగినట్లుగా ఎల్లో కలర్ నెట్ దుపట్టాకు కట్ వర్క్ డిజైన్ చేశాం. ఈ డిఫ్రెంట్ కాంబినేషన్ ధరిస్తే మెరిసిపోతారు.

ఏ శుభకార్యానికైనా ఎరుపురంగు పర్‌ఫెక్ట్ అని చెప్పొచ్చు. కాంచీపురం పట్టు లెహంగాకు గోల్డెన్ బార్డర్ ఇచ్చాం. బార్డర్‌కు సీక్వెన్స్ లేస్, బ్లూకలర్ బార్డర్, చివరగా రాసిల్క్‌తో ఫ్రిల్స్ కుట్టాం. దీనికి బెల్ట్‌లా గోల్డ్‌న్‌కలర్ ఎంచుకున్నాం. రెడ్ వెల్వెట్ బ్లౌజ్‌కు గోల్డ్‌కలర్ జరీవర్క్ చేశాం. మీడియం స్లీవ్స్ ఇచ్చాం. రెడ్‌కలర్ నెట్ దుపట్టాకు కట్‌వర్క్ ఇచ్చాం. మధ్యలో బుటీస్ ఇవ్వడంతో అందంగా కనిపిస్తుంది.

పద్ధతిగా, చూడముచ్చటగా కనిపించేందుకు పింక్ లెహంగాను ఎంచుకోండి. బనారస్ లెహంగాకు గోల్డ్‌కలర్ బార్డర్ ఇచ్చాం. పింక్‌రాసిల్క్, ఫుల్‌స్లీవ్‌తో బ్లౌజ్ ఇచ్చాం. లక్ష్మీకాసులు ఎంబ్రాయిడరీతో నెక్ డిజైన్ చేశాం. బ్లౌజ్‌కు మధ్యలో సీక్వెన్స్, కాసులతో బుటీస్ ఇచ్చాం. గోల్డ్‌కలర్ నెట్ దుపట్టాకి కట్‌వర్క్ చేశాం. మధ్యలో సీక్వెన్స్ బుటీస్ ఇచ్చాం.

ఫిరోజ్ & అమ్ము
ఫ్యాషన్‌డిజైన ర్స్
ఫిరోజ్ డిజైన్ స్టూడియో
https://www.facebook.com/firozdesignstudio/
హైదరాబాద్
ఫోన్ : 8142049755, 9505340228

## చంటివాడికిమెడవాపు.. ఎందుకు?



అడుగండి చెబుతా

**మా బాబుకు రెండేళ్ల వయసు. నాలుగు రోజుల క్రితం బాగా జ్వరం వచ్చింది. ఇప్పుడు జ్వరం తగ్గింది గానీ మెడలో వాపు ఉంది. ఇలా ఎందుకవుతున్నది? దీనివల్ల ఏమన్నా ప్రమాదమా? దీనికి చికిత్స ఉందా?**

**- ప్రవల్లిక,** జగిత్యాల

శరీరంలో ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు జ్వరం వస్తుంది. ఇలాంటప్పుడు మన శరీరంలో ఉండే వ్యాధి నిరోధక వ్యవస్థ వ్యాధినిరోధక కణాలను తయారుచేసి ఇన్‌ఫెక్షన్‌కు కారణమైన దానిపై దాడికి పంపిస్తుంది. మన ఇమ్యూనిటీ, వ్యాధి కలిగించిన బ్యాక్టీరియా మధ్య అనేక చర్యలు జరిగి ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. ఈ ఇమ్యూనిటీకి ప్రధాన కారణం మన శరీరంలోని లింఫాటిక్ వ్యవస్థ. లింఫ్ గ్రంథులు ఈ వ్యవస్థలోని ప్రధాన అవయవాలు. జ్వరం వచ్చినప్పుడు ఆ ఇన్‌ఫెక్షన్‌కి కారణమైన బ్యాక్టీరియా మెడ దగ్గర ఉండే లింఫ్ గ్రంథుల్లో పేరుకుపోతాయి. అందువల్ల లింఫ్‌గ్రంథులు వాచిపోయి, మెడలో కూడా వాపు కనిపిస్తుంది. మీ బాబులో జ్వరం తరువాత మెడ వాపు ఉండడానికి కారణం ఇదే. దీన్నే సర్వైకల్ లింఫ్ అడినైటిస్ అంటారు. ఈ సమస్యను చాలావరకు యాంటిబయాటిక్స్ ద్వారా తగ్గించవచ్చు. కొన్నిసార్లు లింఫ్‌గ్రంథుల్లో చీము కూడా ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు ఆపరేషన్ ద్వారా ఆ చీమును తొలగించాల్సి వస్తుంది.



డాక్టర్ లావణ్య
కన్సల్టెంట్‌పీడి యాట్రిక్ సర్జన్,పీ డియాట్రిక్ యూరాలజిస్ట్
రెయిన్‌బో హాస్పిటల్స్
హైదరాబాద్

## ముఖచర్మంపై రంధ్రాలున్నాయా?



**మొటిమలు వస్తాయి. కొన్ని రోజులకు తొలగిపోతాయి. కానీ వాటి తాలూకూ మచ్చలు మాత్రం ముఖంపైనే ఉండిపోతాయి. ముఖం ఎంత కాంతివంతంగా ఉన్నప్పటికీ ఆ మచ్చలు, చిన్న చిన్న రంధ్రాలు అందవిహీనంగా కనిపిస్తాయి. ఆ రంధ్రాల్ని తొలగించడం ఇప్పుడు చాలా సులభం.**

- కోడిగుడ్డులోని తెల్లసొనను బాగా చిలికి ఫ్రిజ్‌లో 5 నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత అందులో కొద్దిగా నిమ్మరసాన్ని కలిపి ముఖంపై రాయాలి. కొన్ని నిమిషాల పాటు ఈ మిశ్రమాన్ని ముఖంపై ఉంచి కడగాలి. ఇలా ఒక నెలపాటు చేస్తే చర్మ రంధ్రాలు కూడుకుపోతాయి.
- ఒక టేబుల్ స్పూన్ వెనిగర్, నిమ్మరసం, తేనె, రెండు టేబుల్ స్పూన్ల తాజా ముల్లంగి రసాన్ని ఒక గిన్నెలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాస్ నీటిలో కలిపి ఒక జార్లో స్టోర్ చేయాలి. దూదితో ఈ మిశ్రమాన్ని చర్మంపై రాయాలి. ఇలా క్రమం తప్పకుండా వారం రోజులు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల దోసకాయ రసాన్ని తీసుకోవాలి. దానికి ఒక టేబుల్ స్పూన్ గులాబీ నీటిని కలపాలి. రెండింటి మిశ్రమాన్ని దూదితో ముఖంపై రాయాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- పండిన బొప్పాయి పండును బాగా మెత్తగా చేసి ముఖంపై సమానంగా రాయాలి. రంధ్రాలు ఎక్కువగా ఉన్న చోట రాసి 30 నిమిషాల తర్వాత వెచ్చని నీళ్లతో కడగాలి. ఇది రంధ్రాలను తొలగిస్తుంది. చర్మాన్ని కాంతివంతం చేస్తుంది.
- తేనె కూడా చర్మానికి చాలా మంచిది. ఇది మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. తేనెని ముఖంపై రాస్తే చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. మచ్చలు తొలిగిపోతాయి. చర్మం మెరుస్తుంది.

### వంటింటి చిట్కాలు

- ఇడ్లీలు బాగా రావాలంటే.. మిక్సీ పట్టేటప్పుడు చల్లని నీళ్లు పోయాలి.
- వర్షాకాలం ఈగలు ఎక్కవగా వస్తుంటాయి. పుదీనా ఆకుల్ని ఈగలున్న ప్రదేశంలో పెడితే ఘాటుకు ఈగలన్నీ పారిపోతాయి.
- ఫ్రిజ్ నుంచి దుర్వాసన పోవాలంటే ఒక నిమ్మకాయను కట్ చేసి రెండు మూలలా పెట్టాలి.
- చపాతీలు చేసిన కొద్దిసేపటికే గట్టిగా అవుతుంటాయి. చపాతీ చేసేటప్పుడు నీటికి బదులు గోరువెచ్చని పాలను పోయాలి. ఇలా తయారు చేసిన చపాతీలు చాలా సేపటివరకు మెత్తగా ఉంటాయి.
- ఫ్రైడ్ రైస్, పొంగలి తయారు చేసేటప్పుడు అన్నం ముద్దగా అవుతూ ఉంటుంది. ఇలా కాకుండా ఉండాలంటే అన్నం వండేటప్పుడు ఒక స్పూన్ నూనె లేదా నెయ్యి వేయాలి.
- వేపాకులను ఎండబెట్టి పొడిచేసి బియ్యంలో కలిపి ఉంచితే పురుగు పట్టకుండా ఉంటుంది.
- కందిపప్పు, మినుపపప్పుకు పురుగులు పట్టకుండా ఉండాలంటే వాటిని నిల్వ ఉంచిన డబ్బాల కింద వేపాకులు ఉంచాలి.
- కొన్ని ఆహారపదార్థాల్లో ఫుడ్‌కలర్స్ వాడుతుంటాం. వాటికి బదులుగా బీట్‌రూట్‌ను చిన్నగా తురిమి పొడిచేసుకొని ఎండబెట్టుకొని వాడొచ్చు.



## చిన్నారుల ఆరోగ్యం కోసం..







**మూడేండ్ల ఆర్యన్‌కు బొమ్మలు వేయడమంటే చాలా ఇష్టం. ఆర్యన్ తల్లి మార్కెట్‌లో దొరికే రంగు పెన్సిళ్లు కొన్నిచ్చింది. అవి విషపూరితమైన రసాయనాలతో తయారు చేస్తున్నారని ఆమె గ్రహించింది. అటువంటి వాటితో బొమ్మలు వేయడం వల్ల చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలుసుకున్నది. అలా.. తన కొడుకులాంటి చిన్నారుల ఆరోగ్యం కాపాడేందుకు ఈ తల్లి ప్రత్యామ్నాయ ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది.**

బెంగళూరుకు చెందిన దేవశ్రీతాల్ అనే మహిళ బొమ్మలు వేయడానికి చిన్నారులు ఉపయోగించే క్రేయాన్స్(రంగు పెన్సిళ్లు) విషపూరితమని గ్రహించింది. వాటివల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతిని, అనేక వ్యాధులకు గురవుతున్నారని తెలుసుకున్నది. వాటికి ప్రత్యామ్నాయంగా సురక్షితమైన పెన్సిళ్లు అందించాలనుకున్నది. దేవశ్రీతాల్ ఓ రోజు బస్సులో ప్రయాణిస్తుండగా కొంతమంది మహిళల మధ్య విషపూరితమైన పెన్సిళ్ల గురించి చర్చ జరిగింది. వీటిని వినియోగించడం వల్ల చాలా మంది చిన్నారులు అనేక రోగాలబారిన పడుతున్నట్లు తెలుసుకున్నది. అందుకోసం కొంతమంది విదేశాల్లో తయారయ్యే క్రేయాన్స్ తెప్పించి వారి పిల్లలకు ఇస్తున్నారు. వాటిని కొనుగోలు చేయడానికి ఎక్కువ మొత్తంలో డబ్బు వెచ్చించాల్సి వస్తున్నది. ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయడం కంటే ఇక్కడే తయారు చేస్తే ఎలా ఉంటుందని దేవశ్రీ ఆలోచించింది. ఇతర దేశాల్లో రంగు పెన్సిళ్ల తయారీకి వారు ఉపయోగించే పద్ధతులను గురించి అన్వేషించింది. దేవశ్రీ కొడుకు స్విమ్మింగ్‌కు వెళ్లే దగ్గర నేహా, కరీన్ అనే ఇద్దరు తల్లులు కలిశారు. వారితో తన ఆలోచన పంచుకున్నది దేవశ్రీ. వారిద్దరికీ మార్కెటింగ్‌లో అనుభవం ఉండడంతో.. వారూ సహాయం అందిస్తామన్నారు. అలా వారిద్దరితో కలిసి సురక్షితమయిన రంగు పెన్సిళ్లు తయారు చేయడానికి సిద్ధమైంది దేవశ్రీ. అందుకోసం ఆరునెల్ల పాటు క్రేయాన్స్‌పై పరిశోధనలు చేశారు. 'డేబ్ల్' పేరుతో సురక్షితమైన ఉత్పత్తులను చిన్నారులకు అందించేందుకు ఓ స్టార్టప్‌ను ప్రారంభించారు. విదేశాల నుంచి కొనుగోలు చేయాలంటే ఐదు రెట్లు ధర చెల్లించాల్సి వచ్చేది. తక్కువ ధరకే అందుబాటులోఉన్న ఆరోగ్యకరమైన పదార్థాలతో రంగు పెన్సిళ్లు, తినుబండారాలను అందించడం మొదలు పెట్టారు.

**ఎవరేమన్నారు?**



మన చుట్టూ వున్న ప్రపంచం గురించిన ఒక అవగాహనే విజ్ఞానశాస్త్రం (సైన్స్). ప్రకృతిలో నువు ఎక్కడైతే, ఏదైతే సంతోషాన్ని కను గొంటావో అక్కడే విజ్ఞాన శాస్త్రం పనిచేస్తుంది.

**- సుబ్రహ్మణ్య చంద్రశేఖర్**
భారతీయఅమె రికన్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త
జయంతి: 19 అక్టోబర్,
వర్ధంతి: 21 ఆగస్టు,
జీవితకాలం: 1910–1995

## చేపకూ నొప్పి అనుభవం

**జీవశాస్త్రం**

మనిషిలా చేపకూ నొప్పి బాధ తెలుస్తుందని శాస్త్రవేత్తలు తాజాగా నిర్ధారించారు. వాటిలోని ప్రవర్తనా మార్పులనుబట్టి దీనిని గుర్తించినట్టు వారు తెలిపారు.



**నో**రుండి కూడా భాష తెలియని జీవులు కాబట్టే, చేపలు తమకు కలిగే నొప్పిని మనకు తెలిసేలా వ్యక్తం చేయలేక పోతుండవచ్చు. కానీ, మన మాదిరిగా వాటికీ నొప్పివల్ల కలిగే బాధ తెలుస్తున్నదని శాస్త్రవేత్తలు ఇటీవలి ఒక అధ్యయనంలో కనుగొన్నారు. ఇంగ్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ పరిశోధకులు చేపలలో నొప్పి అనుభవంపై మొత్తం 98 అధ్యయనాలు జరిపి దీనిని తేల్చారు. శ్వాస తీవ్రత (hyper-ventilation), దీర్ఘకాలిక ప్రవర్తనా మార్పులు వంటివాటి ఆధారంగా చేపలు నొప్పి బాధను అనుభవిస్తున్నట్టు వారు నిర్ధారించారు. 'చేప శరీరంలోని నాడీకణ వ్యవస్థ మనిషివలె అంతటి సంక్లిష్టం కాదని, కనుక వాటికి నొప్పి బాధ తెలియదని' ఇన్నాళ్లుగా భావిస్తున్న వారి అభిప్రాయం దీనితో మారిపోయింది. మన కాలి బొటనవేలుకు దెబ్బ తగిలినప్పుడు 'అబ్బా' అంటూ ఆ భాగాన్ని గట్టిగా నొక్కుకుంటామని, అలాగే చేప నోటికి దెబ్బ తగిలించగా, అది వెంటనే పక్కనున్న ప్రదేశంపై నోటితో రాసిందని వారు చెప్పారు. 'ఒకవేళ వాటికి నొప్పి తెలిసే అవకాశమే లేకపోతే అవి ఒక దాని నొకటి గాయపరుచుకొనేవి కదా' అని కూడా వారు అంటున్నారు. 'ఫిలాసఫికల్ ట్రాన్సాక్షన్స్ ఆఫ్ ది రాయల్ సొసైటీ బి' పత్రికలో ఈ పరిశోధనాంశం ప్రచురితమైంది.

**వి'జ్ఞానం' 2**

## సైన్స్‌ను అర్థం చేసుకోలేక పోతున్నామా?



**మంచి** సైన్స్ అని ఒక మాట వాడేసి నన్ను నేనే తికమక పెట్టుకున్నట్టు అనిపిస్తున్నది. 'చెడ్డ సైన్స్ కూడా ఉందా' అన్న ప్రశ్న నా మనసులో పుట్టింది. తర్కించి చూస్తే నిజంగా చెడ్డ సైన్స్‌కూడా ఉంది. సైన్స్‌కు స్వయంగా విలువలు లేవు. అది ఎవరి కోసమూ పనిచేయదు. వాడుకునే వాళ్లనుబట్టి దాని విలువలు మారుతాయి.

ఈ మధ్యన కొంతకాలంగా ఇటువంటి విషయాల గురించి చర్చ జరుగుతున్నది. గతంలో గొప్పవారు అని చెప్పిన సైంటిస్టులు అందరూ 'నిజంగా అంత గొప్పవారా?' అన్న అనుమానం మొదలైంది. కొంతమంది తమ ప్రయోజనం కోసం తాము చేసిన చిన్న పరిశోధనలను చాలా ఎత్తు ఎత్తి చూపించారు. ఆ మాటల ఆధారంగా పెద్ద పెద్ద ఊహాభవనాలు నిర్మింపబడ్డాయి. అసలు సత్యం మాత్రం బలహీనంగా ఉంది. దాని మీద కట్టిన భవనం మరీ పెద్దదిగా ఉంది. కనుక, అది నిలకడ లేకుండా ఉండిపోతున్నది.

ఉదాహరణకు ఆ మధ్యన జెనెటిక్ ఇంజినీరింగ్ గురించి పెద్ద గోల చేశారు. అందులో చెప్పినవి అబద్ధాలు అని నేను అనడం లేదు. కానీ, 'వాటిని వాడుకునే వీలు ఎంతవరకు ఉంటుంది' అన్న విషయంలో మాత్రం అతిశయోక్తులు చెప్పారు. ఇప్పుడు ఆ రంగం అనుకున్న దిశలో నడవడం లేదు. మరొక దిశలో మంచి ప్రయోజనాలను ఇస్తున్నది. వాస్తవాన్ని చూడగలగడం వైజ్ఞానికులకు కూడా ఎంతో అవసరమని ఇక్కడ గట్టిగా రుజువైంది.

కొన్నిచోట్ల మూలసిద్ధాంతం బలహీనంగా ఉన్నందుకు విచిత్రమైన పరిస్థితులు ఉంటాయి. పరిశోధకులుకూడా మనుషులే. వాళ్లకూ ప్రయోజనాలు కావాలి. బతుకుదెరువు కూడా కావాలి. ఒకప్పుడు అది అనుకున్నంతగా దొరికేది కాదు. పరిశోధన శాల కూడా లేక చాలామంది తమ ఇండ్లలోనే తమ పని కొనసాగించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అందరికీ ఐన్‌స్టీన్ లాగా, ఆలోచనతోనే పరిశోధించే వీలు ఉండదు. కొత్త ఆలోచనలను అందరూ అంత సులభంగా అంగీకరించరు. కనుక వాటికి మసిపూసి మారేడుకాయ చేయవలసి వస్తుంది. కొంతమంది పరిశోధకులకు నిజంగా గొప్పపేరు వచ్చింది. కానీ 'వారు నిజంగా అంత గొప్పవారు కాదు' అన్న వాదన తరువాత మొదలైంది.

లూయీ పాశ్చర్, జోసెఫ్ లిస్టర్, అలెగ్జాండర్ ఫ్లెమింగ్.. ఇలాంటి వాళ్లు ఆరోగ్యరంగంలో పని చేశారు. వాళ్ల ఫలితాలను గురించి వాళ్ళకే నమ్మకం లేకుండా ఉండేదన్న సత్యం తర్వాతగాని అందరికీ తెలియలేదు. నిజానికి వాళ్ళ పరిశోధనా పద్ధతులు కూడా అంతంతగానే ఉండేవని అన్నారు మరికొందరు. కానీ, ఇవాళ టీకా మందులు లేని ప్రపంచం నడవడమే లేదు. జోసెఫ్ లిస్ట్ ఫెర్టిలైజేషన్ పద్ధతిని ప్రవేశపెట్టాడు. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ గురించి తెలియని వారు బహుశా ఉండకపోవచ్చు.

పరిణామ సిద్ధాంతం గురించి జరుగుతున్న చర్చను గమనిస్తే అర్థమైన వాళ్లకు ఆశ్చర్యం కలుగుతుంది. అసలు 'పరిణామ సిద్ధాంతం అంటే ఏమిటో తెలియకుండానే 99% మంది జనం ఉన్నారు. అంటే, ఒక అనుమానం వస్తుంది. సైన్స్ తెలుసుకోవడం అవసరం లేదు అనిపిస్తుంది. కానీ, తెలుసుకున్న వాళ్ల ఆనందం చాలా గొప్పది. 'ఒకడు మాడిన రొట్టె తిని కడుపునొప్పి తెచ్చుకొంటే, వైద్యుడు అతని కంటికి మందు వేసెను' అని ఒకమాట చదివాను. అచ్చు వేసిన వాళ్ల దృష్టిలో అది ఒక జోక్. కానీ, నాకు అందులో బోలెడంత సైన్స్ కనిపించింది. 'రొట్టె మాడింది' అది కూడా తిన్నాడు. లేదా అది మాడినట్టు చూడలేక పోయాడు. చూడలేని సందర్భంలో కంటిమందు వేయక తప్పదు. వైద్యుడు తర్కం వాడుకున్నాడు. వాన కురిసింది. ఇంట్లో ఏవో వాసనలు మొదలయ్యాయి. కారణం అర్థం కావడం లేదు.

ఈ పరిస్థితికి వివరణ ఇస్తే సైన్స్ ఇవ్వాలి గాని, మరొక మార్గం లేదు. వర్షం తరువాత గుడ్డలు ఆరడం లేదు. అందుకు కారణం అందరికీ తెలిసిందే. అదికూడా సైన్స్. మాంసం ఉడకడం లేదు. అందులో బొప్పాయి కాయ ముక్క వేస్తే ఉడుకుతుంది. అది అంతకన్నా సులభమైన సైన్స్. ఇట్లా చెప్పలేక, తాను కనుగొన్న విషయం అందరికీ సులభంగా అర్థం కాదు కనుక, డార్విన్ రకరకాలుగా చెప్పాడు. చాలామంది 'కాదు పొమ్మ'న్నారు. తరువాత దాని గురించి పరిశోధనలు చేశారు. 'అతను చెప్పింది నిజం కదా' అని తర్వాత అన్నారు. మొక్కలు, పంటలు, తరాలు, లక్షణాలను గురించి గ్రెగార్ మెండల్ అనే పెద్ద మనిషి కొన్ని విషయాలు చెప్పాడు. అతడిని జన్యుశాస్త్ర పితామహుడు అంటున్నాం. కానీ, ఆయన పరిశోధనల మీద ఆయనకే నమ్మకం ఉండేది కాదు. తర్కం అంత సులభంగా అందేది కాదు మరి.

(సశేషం)

**- డా॥ కె.బి.గోపాలం,** సెల్: 9849062055

**దృష్టిశాస్త్రం**

# చీకట్లో కొత్త చూపు!

■ మనిషి కంటికి నిశీథిలోనూ మహావీక్షణం ■ దృశ్య సామర్థ్యాన్ని పెంచే సాంకేతికత ■ ప్రాథమిక ప్రయోగాలు విజయవంతం

నేత్ర ఆరోగ్యం, దృష్టి శాస్త్రం (science of vision) లో కీలకమైన ముందడుగు పడింది. మనిషి సాధారణ కండ్లతో రాత్రి(చీకటి) వేళ లోనూ వస్తువులను సహజ సిద్ధంగానే వీక్షించగల సాంకేతికతను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి పరిచారు. మన కంటికి కనిపించని పరారుణ (infrared) స్థాయి కాంతి కణాలను అధిక శక్తిదాయక స్థితికి మార్చే అద్భుత నానోపార్టికల్స్‌గా వారు రూపొందించారు. ఫలితంగా మానవనేత్రాలకు చీకటిలో సైతం చూడగల కొత్త సామర్థ్యం సిద్ధించనున్నది.



**పరారుణ** వికిరణతలోని కాంతి విద్యుదయస్కాంతత్వంతో సుదీర్ఘ తరంగదైర్ఘ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టే, మన కంటికి అంతటి అత్యల్ప స్థాయిలోని దృశ్యాలేవీ కనిపించవు. కాకపోతే, కొన్ని నిశాచర జీవులు రాత్రిళ్లు బ్రహ్మాండంగా చూడగలవు. కారణం, వాటి కండ్ల సామర్థ్యం పరారుణ స్థాయి కాంతిని దర్శించే రీతిలో నిర్మితమై ఉండడమే. కటిక చీకటిలోనూ అంతటి అత్యల్పస్థాయి కాంతి ఉంటుంది. దానిని చూసే సామర్థ్యం మన నేత్రాలకు లేదు. అందుకే, చీకటి పడిందంటే విద్యుద్దీప కాంతి ఉండాలి. లేదా మనం దాదాపు కళ్లున్న గుడ్డివాళ్ల కిందే లెక్క. అయితే, 1,050 నానోమీటర్ల స్థాయిలో తరంగ దైర్ఘ్యం కలిగివున్న పరారుణ కాంతిని మనం నేరుగా మన కళ్లతో చూడలేకున్నప్పటికీ కొన్ని ప్రత్యేక పరికరాలతో వీక్షించగలం. ఈ సౌలభ్యాన్నే నేరుగా సాధారణ కంటికి సహజసిద్ధంగానే వర్తింపజేయడానికి శాస్త్రవేత్తలు పై పరిశోధన జరిపి, ఈ మేరకు విజయం సాధించారు. 'అత్యల్ప శక్తికణాలను అధిక శక్తిలోకి మార్చడం' ద్వారా ఏర్పడేవే 'అధిక మార్పిడి వామనకణాలు' (UCNPs: upconversion nanoparticles). వీటి ద్వారానే వారు కొత్తచూపుకు శ్రీకారం చుట్టారు.

ఈశాన్య అమెరికాకు చెందిన అత్యధిక జనాభాతో కూడిన రాష్ట్రం మసాచుసెట్స్. ఇక్కడి 'యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ మెడికల్ స్కూల్' పరిశోధకుల బృందమే ఈ ఘనతను సాధించింది. మానవనేత్రాలకు పరారుణ స్థాయి కాంతిని గుర్తించగల సామర్థ్యాన్ని అందించగలగడంలో ఈ పరిశోధన ఒక కీలక మైలురాయి కాగలదని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ మేరకు రానున్న రోజుల్లో మనం చీకటిని సైతం ఛేదించగలమని వారంటున్నారు. మనిషి కన్ను 400–700 ఎన్ఎం (నానోమీటర్) పరిధిలోనే కనిపించే కాంతి (visible light) ని గుర్తిస్తుంది. మన కండ్లలోని కోన్ సెల్స్ (రెటీనాలోని వర్ణగ్రాహ్య కణాలు)లోని శక్తి మేరకు అత్యధిక స్థాయిలో చంద్రుని వెన్నెలలో 50 శాతం వరకు మసక కాంతిని చూడగలం. కనిపించే కాంతిని మించిన స్థాయి (700–2,500 ఎన్ఎం) లో 'సమీప పరారుణ' (NIR: near-infrared) పరిధిలోని అత్యల్ప కాంతిని మన కండ్లు అసలుకే చూడలేవు. ఆకాశంలో మన కంటికి కనిపించే కాంతి ఆధారంగా పలు నక్షత్రాలను చూస్తాం. నిజానికి అవి కాకుండా మనకు కనిపించనివి మరెన్నో ఉంటాయి. వాటన్నింటినీ శాస్త్రవేత్తలు పరారుణ తదితర కాంతి పరికరాల సాయంతో వీక్షిస్తూ పరిశోధనలు జరుపుతుంటారు. ఇందుకుగాను పరారుణ కాంతి వస్తువులను దర్శింపజేసే ప్రత్యేకమైన 'థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు' ఉంటాయి. కాకపోతే, ఇవి 'పెద్ద పరిమాణం'లో, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించడానికి అవకాశం లేని విధంగా, అననుకూలంగా ఉంటాయి.

ఈ క్రమంలోనే నేరుగా మన కండ్లతోనే అంతటి అల్పకాంతి వస్తువులను చూడడానికి వీలు కలిగించడానికే పరిశోధకులు పైన పేర్కొన్న 'అధిక మార్పిడి నానోకణాల'ను రూపొందించారు. వీటి ఆధారంగా ఆకాశంలో మనం ఇన్నాళ్లుగా చూడలేక పోతున్న అనేకానేక 'అద్భుత దృశ్యాలను' వీక్షించగలమని వారంటున్నారు. వారు అభివృద్ధి పరిచిన 'నానోపార్టికల్స్'తో మన కంటి లోపలే అంతటి సామర్థ్యాన్ని కలిగించవచ్చునని వారంటున్నారు. భూమిపై అరుదుగా లభ్యమయ్యే ఎర్బియమ్ (erbium), ఎటార్బియమ్ (ytterbium) మూలకాలను అమర్చడం ద్వారా సహజ సిద్ధంగానే అల్పశక్తిదాయక కాంతికణాల (photons) ను అధికశక్తి కాంతికణాలుగా మార్చగలిగినట్టు వారు చెబుతున్నారు.

దీంతో మనుషులతోసహా అనేక క్షీరదాల నేత్రాలకు 'అద్భుతమైన కొత్త దృష్టి' సిద్ధిస్తుంది. ఫలితంగా చీకటిలోని వస్తువుల్ని కూడా చక్కగా చూడవచ్చు. ఇటీవల సుమారు 10 వారాలపాటు కొన్ని ఎలుకలపై పలు ప్రయోగాలు జరపగా, అవి సత్ఫలితాలను ఇచ్చాయని, తాము అభివృద్ధి పరిచిన నానోకణాల పనితనం(సాంకేతికత) విజయవంతమైందని పై పరిశోధకులు వెల్లడించారు. ఎలుకల కంటిలోని రెటీనా (కనుగుడ్డులోని లోపలి పొర/ కంటితెర లేదా నేత్రాంతర/ నాడీ పటలం) వెనుకవైపు సూది మందు (ఇంజెక్షన్)తో 'యుసీఎన్‌పీఎస్' (UCNPs) కణాలను వారు ప్రవేశపెట్టారు. దాంతో ఎలుకల కళ్లలోని కాంతిగ్రాహకాల ఉపరితలంపై అవి తమ ప్రభావం చూపించాయి. ఒక చక్కెర కణంతో రూపొందే మాంసకృత్తు (ప్రొటీన్) ద్వారా వీటి పని సాధ్యపడిందని వారన్నారు.

ఆ ఎలుకలను చీకటిలో వుంచి జరిపిన ప్రయోగాలు ఆశావహ ఫలితాలను ఇచ్చినట్లు పై ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా॥ గ్యాంగ్ హ్యాన్ (Dr. Gang Han) తెలిపారు. సమీప పరారుణ పరిధిలోని కాంతిని అవి చూడగలిగాయనీ ఆయనన్నారు. తమ పరిశోధన అటు వైద్యచికిత్సకూ ఒకింత ఉపయోగపడగలదని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. కండ్లలో 'వర్ణదృశ్య లోపాలు' (color-vision impairments) గల ప్రజలకు చికిత్సలోనూ ఈ కొత్త సాంకేతికత ఉపయోగపడే వీలుందని డా॥ గ్యాంగ్ హ్యాన్ పేర్కొన్నారు. ఈ సానుకూలతలను యుసీఎన్‌పీఎస్ కణాలు కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. 'జీవసంబంధ రాత్రి కళ్లద్దాలు' (biological night goggles) గా ఆయన తాము అభివృద్ధి పరిచిన నానోకణాలను అభివర్ణించారు. భవిష్యత్తులో ఏదో ఒకనాటికి మనిషి నేత్రాలు రాత్రివేళ కూడా చక్కగా చూడగల సామర్థ్యాన్ని సముపార్జించుకోగలవన్న విశ్వాసాన్ని ఆయన ఈ సందర్భంగా వెలిబుచ్చారు. ఇటీవలి అమెరికన్ కెమికల్ సొసైటీ (ఏసీఎస్) ఫాల్ 2019, నేషనల్ మీటింగ్ అండ్ ఎక్స్‌పొజిషన్'లో ఈ పరిశోధనను వారు ప్రదర్శించారు.

**- దోర్బల బాలశేఖరశర్మ**

### అద్భుత దృశ్యాల ఆవిష్కారం



కొన్ని చలనచిత్రాలలో మనిషి ఆకాశంలోకి ఎగురడం, ఎక్స్‌రే, పరారుణ తదితర సంక్లిష్ట కాంతి ప్రతిఫలించే దృశ్యాలను వీక్షించగలగడం వంటి అద్భుతాలను ప్రదర్శించే సూపర్‌మేన్‌లను చూస్తుంటాం. ఇవేవీ కట్టుకథలు కావని, మనిషి సంకల్ప బలం, పట్టుదల, కృషితో వీటిని సాధించుకోగలడని కాలక్రమేణా నిరూపణవుతుందన్న నమ్మకాన్ని కొందరు శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్నారు. మనిషి ఆకాశంలోకి ఉన్న ఫలాన రెక్కలు లేకుండా ఎగురడం ఎలా వున్నా, సాధారణ కండ్లతో పరారుణ కాంతిని వీక్షించే రోజులైతే రానున్నాయని వారంటున్నారు. అంతరిక్షంలో మనం ఇప్పుడు మామూలు కళ్లతో కనిపించే కాంతిని ప్రతిఫలించే ఖగోళ వస్తువులనే చూడగలుగుతాం. సుదూర వస్తువులను కొన్ని శక్తివంతమైన బైనాక్యులర్స్‌తో చూడవచ్చు. అదే కొత్త 'నానోపార్టికల్స్' సాంకేతికతను మన కండ్లకు ప్రవేశపెట్టడం ద్వారా నేరుగా, సహజ సిద్ధంగానే నిశిలోనూ మన దృష్టిని కేంద్రీకరించవచ్చు. అప్పుడు కనిపించే దృశ్యాలు అద్భుతమని డా॥ గ్యాంగ్ హ్యాన్ అంటారు.

**ఎందుకంటే?**

## రంగుపూల కాంతులు

ముఖ్యంగా దీపావళి సందర్భంగా కాల్చే పటాసుల్లో రంగుపూల కాంతులు ప్రత్యేక ఆకర్షణ. అసలు, బాణసంచాల్లోంచి ఈ రంగులు ఎలా ఆవిర్భవిస్తాయో తెలుసుకొందాం.



**పటాసుల** తయారీలో వాడే పదార్థాలు, రసాయనాలే ఈ రంగులకు ప్రధాన కారణం. వాటిలో తెల్లని కాంతికి మూలం పొటాషియం, సల్ఫర్, ఆర్సెనిక్‌లను ఇంధన ఆక్సిడైజర్ మిశ్రమంగా వాడటమే. స్ట్రాన్షియం, లిథియంల వల్ల ఎరుపు, బేరియం వల్ల ఆకుపచ్చ, సోడియం వల్ల పసుపు, కాపర్‌వల్ల నీలం రంగులు ఏర్పడతాయి. పెల్లెట్ ఆకారంలో పేలుడు పదార్థాన్ని అమర్చితే చుక్కల వెలుగులను చూస్తాం. కంబషన్ ప్రక్రియవల్ల గాలిలోని ఆక్సీజన్ కాకుండా, పదార్థంలోని ప్రాణవాయువు మండటానికి తోడ్పడుతుంది. ఫలితంగానే చుక్కల ఆకారంలో వెలుగుపూలు వెలువడతాయి.

ఏ మూలకానికైతే పేలుడు సంఘటన ఉష్ణోగ్రత 2 కిలోక్యాలరీ/ గ్రాముకు తక్కువ కాకుండా ఉంటుందో దానివల్ల ఎక్కువ వెలుగును చూస్తాం. ఇలాంటి వాటిలో లిథియం, బెరీలియం, మెగ్నీషియం, అల్యూమినియం, క్యాల్షియం, జిర్కోనియం, కార్బన్, హైడ్రోజన్, బోరాన్, సిలికాన్, ఫాస్ఫరస్‌లు ఉంటాయి. దీపావళి రోజు వాడే రాకెట్ల తయారీలో మంచి నాణ్యమైన కాగితాన్ని వాడతారు. భూచక్రాల తయారీలో సిలిండ్రికల్ లేదా ట్యూబ్ ఆకారంలో కాగితాన్ని చుట్టి, అందులో బాణసంచా పౌడర్‌ను నింపి, వలయాకారంలో ఉంచుతారు. ప్రత్యేకించి శివకాశిలోనే పటాసులు ఎందుకు తయారు చేస్తారనడానికి ఆ ప్రదేశం తక్కువ తేమ ప్రాంతం కావడమేనని అంటారు.

బాణసంచా కాల్చేప్పుడు కాటన్ వస్త్రాలు ధరించడం మంచిది. పాదరక్షలూ ధరించాలి. ఒకవేళ బాణసంచావల్ల బట్టలు అంటుకొంటే, మనిషిని పడుకోబెట్టి, అటు ఇటు పొర్లించాలి. నీటితో శరీరభాగాలను తడుపుతూ ఉండాలి. వారికి జ్యూస్‌లు ఇవ్వడం మంచిది. ఇంట్లో గ్యాస్ సిలిండర్‌ను గట్టిగా మూసి వేయాలి. మంటల్లో చిక్కుకున్న వ్యక్తిపై చల్లడానికి నీరు దొరక్కపోతే దుప్పటిని వాడాలి. మన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి.

**డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**

## మాంసకృత్తులు ఇక్కడ లభించును!

**ఆహారశాస్త్రం**

శరీర పోషకాలలో ప్రధానమైన మాంసకృత్తులు ఏఏ పదార్థాలలో లభిస్తాయో తెలిస్తే, తీసుకొనే ఆహారం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడతారు.



**మాంసకృత్తులు** (ప్రొటీన్స్) పేరుకు తగ్గట్టు జంతువుల ఉత్పత్తులలో లభించినా కూరగాయల్లోనూ దొరుకుతాయి. మాంసకృత్తులు కేవలం మాంసంలోనే లభిస్తాయనుకోకూడదు. జంతు సంబంధ మాంసకృత్తులు లభించే పదార్థాలలో పాలు, గుడ్లు, మాంసం, చేపలు, కోళ్లు ఉండగా, పాల ఉత్పత్తులైన జున్ను, పెరుగు, కోవా వంటివీ వాటికిందికే వస్తాయి. వీటిలో అత్యంత నాణ్యమైన, పూర్తిస్థాయి మాంసకృత్తులు లభిస్తాయి. కనుకే, శరీరంలో వీటి వినియోగం సంపూర్ణంగా ఉంటుంది. వృక్ష సంబంధ మాంసకృత్తులు లభించే కూరగాయలలో గుండు పప్పులు, బద్ద పప్పులు, సోయా చిక్కుడు, గట్టిపండ్లు (విత్తులు/ గింజలు/ కాయలు), చమురు గింజలైన వేరుశనగ, బాదం, కాజు (జీడిపప్పు/ జీడిమామిడి) ఉన్నాయి. వీటిలోనూ పుష్కలంగా మాంసకృత్తులు లభిస్తాయి. తృణధాన్యాలైన గోధుమలు, బియ్యం వంటి వాటిలో కూడా అధికంగా మాంసకృత్తులు ఉంటాయి. వీటిలో లభించే మాంసకృత్తులు కూడా మంచి నాణ్యత, పోషక విలువలను కలిగి ఉంటాయి. 'ఎవరి ఆహారంలో అయితే ఇవే ఎక్కువగా ఉంటాయో వారికి మాంసకృత్తులు పూర్తిస్థాయిలో లభించినట్టు కాదని' పోషక ఆహార నిపుణులు అంటారు. వీటిని జంతుసంబంధ పదార్థాలతో కలిపి తీసుకొంటే మరింత అధిక పోషకశక్తి లభిస్తుందని, ఆరోగ్యానికి ఇదెంతో మంచిదనీ వారంటారు. తృణధాన్యాలు, గట్టిపండ్లను కలిపి తీసుకోవడం మరింత మంచిదని, ఈ రెండింటినీ కేవలం విడివిడిగా తీసుకోవడం కన్నా ఎక్కువ ప్రయోజనం కలిపి తీసుకోవడం ద్వారానే పొందుతామని వారంటారు. మిశ్రమ ప్రొటీన్స్ ఆహారంలో కిచిడీ, అన్నం, పప్పు, మిశ్రమ రొట్టె (గోధుమపిండి, శనగపిండి), ఇడ్లీ, దోశ చక్కని ఉదాహరణలుగా చెప్తారు. ఇదే విధంగా జంతు సంబంధ ఆహారమైన మాంసం, చేపలు వంటి వాటికి, వృక్ష సంబంధమైన రైస్ ఖీర్, కిచిడీ వంటివాటికి పాలు, పెరుగు వంటివి కూడా తీసుకోవడం వల్ల మిశ్రమ ఆహార పోషక ప్రయోజనాలు సిద్ధిస్తాయని నిపుణులు అంటున్నారు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వర్క్‌మెన్ క్యాడర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

### ఐఐటీఎంలో

**చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** ప్రొఫెసర్,అ సిస్టెంట్ ప్రొఫెసర్
- **డిపార్ట్‌మెంట్లు:** ఏరోస్పేస్‌ఇ ంజినీరింగ్, అప్లయిడ్‌మె కానిక్స్,బ యోటెక్నాలజీ, కెమికల్‌ఇ ంజినీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, ఈఈ, ఇంజినీరింగ్ డిజైన్, హ్యూమానిటీస్&సోషల్‌సై న్సెస్, మ్యాథ్స్, మెకానికల్‌ఇ ంజినీరింగ్, మెటలర్జిక ల్&మెటీరి యల్స్ ఇంజినీరింగ్, ఓషన్ ఇంజినీరింగ్, ఫిజిక్స్.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టు/బ్రాంచీలో పీహెచ్‌డీ. మంచి అకడమిక్ రికార్డు కలిగి ఉండాలి. దీంతోపాటు నిర్దేశిత అనుభవం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 22
- **వెబ్‌సైట్:** https://facapp.iitm.ac.in

### కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో



- **మొత్తం ఖాళీలు:** 45
- **పోస్టుల వివరాలు:** జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (మెకానికల్–10, ఎలక్ట్రికల్–4, ఎలక్ట్రానిక్స్–1, సివిల్–1), జూనియర్ కమర్షియల్ అసిస్టెంట్–7, స్టోర్ కీపర్–1, వెల్డర్ కమ్ ఫిట్టర్ (మెకానిక్ డీజిల్)–5, ఫిట్టర్ (ఎలక్ట్రానిక్స్–1, ఎలక్ట్రికల్–5), షిప్‌రైట్ ఉడ్–3, సెమీ స్కిల్డ్ రిగ్గర్–2, ఫైర్‌మెన్–2, జూనియర్ సేఫ్టీ అసిస్టెంట్–2 పోస్టులు ఉన్నాయి.
- వీటితోపాటు అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్)–1, అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)–1, ఏఈ (వెపన్స్)–1, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్–2, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–1, అకౌంటెంట్–2 ఖాళీలు ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, జీతభత్యాలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 18
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.com

### ఎన్ఎల్‌సీలో

**ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు–ఖాళీలు:** జనరల్ మేనేజర్ (మైనింగ్–4, థర్మల్ పవర్ ప్రాజెక్టు–3), డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్/మెడికల్ ఆఫీసర్ (జనరల్ సర్జరీ&జనరల్ మెడిసిన్)–2, డీజీఎం (హెచ్‌ఆర్)–2, డీసీఎం (హెచ్‌ఆర్)–2, డీజీఎం (ఫైనాన్స్)–4, అడిషనల్ చీఫ్ మేనేజర్ (ఫైనాన్స్)–3, డీసీఎం (ఫైనాన్స్)–1, చీఫ్ మేనేజర్ (సెక్యూరిటీ)–1, అసిస్టెంట్ మేనేజర్ (సెక్యూరిటీ)–3 ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** నవంబర్ 18
- **వెబ్‌సైట్:** https://www.nlcindia.com

### బెల్‌లో ఇంజినీర్లు

**భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ఇంజినీర్
- **మొత్తం ఖాళీలు:** 19.
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్–13, మెకానికల్–6
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో బీఈ/ బీటెక్ సంబంధిత సబ్జెక్టు/ బ్రాంచీలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** నవంబర్ 1 నాటికి 25 ఏండ్లు మించరాదు. రిజర్వ్‌డ్ కేటగిరీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఈ పోస్టులు మొదట ఏడాది కాలపరిమితికి భర్తీ చేస్తారు. తర్వాత ఈ కాలాన్ని మరో మూడేండ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.
- **జీతం:** నెలకు రూ.23,000/-
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 2
- **వెబ్‌సైట్:** http://bel-india.in

# స్థానిక నాయకత్వ లేమి వల్లే!

- ఆర్థిక మందగమనం కూడా జతకలిసింది
- మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాలపై ఆరెస్సెస్ వ్యాఖ్య

**ముంబై:** మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఆశించిన మేర రాణించకపోవడానికి స్థానిక నాయకత్వ లేమి ప్రధాన కారణమని ఆరెస్సెస్ వ్యాఖ్యానించింది. ప్రచార సమయంలో ప్రజల నుంచి అద్భుత స్పందన రావడం, దానికి తగినట్టే ఎగ్జిట్ పోల్స్ అన్నీ రెండు రాష్ట్రాల్లో బీజేపీకి బంపర్ మెజార్టీ ఖాయమని చెప్పడంతో ఆ పార్టీతోపాటు ఆరెస్సెస్ ముఖ్యులు సంబురపడ్డారు. అయితే ఫలితాలు మాత్రం వ్యతిరేకంగా వచ్చాయి. మహారాష్ట్రలో అధికారం నిలబెట్టుకున్నా సీట్లు తగ్గిపోవడం, హర్యానాలో అతిపెద్ద పార్టీగా నిలిచినా.. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ దక్కకపోవడం వారికి మింగుడుపడటం లేదు. ఈ నేపథ్యంలో ఆరెస్సెస్‌కు చెందిన సీనియర్ ముఖ్యనేత ఒకరు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో ఫలితాలకు స్థానిక నాయకత్వలేమి ప్రధాన కారణమని చెప్పారు. 'స్థానిక నాయకులు ప్రజలతో మమేకమై ఉంటారు. టికెట్ల కేటాయింపు నుంచి ప్రచారం వరకు అన్నీ దగ్గరుండి చూసుకుంటారు. ప్రచారాంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. కానీ అలా జరుగలేదు' అని పేర్కొన్నారు. దేశంలో కొనసాగుతున్న ఆర్థిక మందగమనం దీనికి తోడయ్యిందని చెప్పారు. ఈ ఫలితాలను బట్టి ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ అంశాలను పక్కనబెడుతున్నారని, స్థానిక అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు తేలిందన్నారు. మళ్లీ కుల రాజకీయాలు పుంజుకుంటున్నాయని స్పష్టమైన సంకేతాలు వస్తున్నాయని విశ్లేషించారు. ఆర్టికల్ 370 రద్దు, పాకిస్థాన్, లక్షిత దాడి, బాలాకోట్ దాడి వంటి జాతీయ అంశాలనే బీజేపీ తన ప్రచారానికి వినియోగించుకున్నదని, ఆయా రాష్ట్రాల ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్న సమస్యలపై పెద్దగా దృష్టి కేంద్రీకరించలేదని మరో ఆరెస్సెస్ నేత వ్యాఖ్యానించారు. హర్యానాలో జాట్ల నిరసనలు, మహారాష్ట్రలో రిజర్వేషన్ల కోసం మరాఠాల పోరాటం వంటివి జాతీయ అంశాలను వెనుకకు నెట్టాయన్నారు. గత ఏడాది జనవరి 1న మహారాష్ట్రలోని భీమా-కోరేగావ్‌లో కులాల మధ్య ఘర్షణ జరిగినప్పుడే ఆరెస్సెస్ ఆందోళన వ్యక్తం చేసింది. హిందువుల మధ్య మళ్లీ కులాల కొట్లాట మొదలవుతున్నదని దీనిపై దృష్టి కేంద్రీకరించాలని, హిందూ ఓటుబ్యాంకు విడిపోకుండా చూడాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాకు సూచించింది.



## రాజ్ ఠాక్రే విఫలం!

110 స్థానాల్లో పోటీ చేసి 1 స్థానంలో మాత్రమే విజయం

గతంలోనూ ఎంఎన్ఎస్‌కు చేదు అనుభవాలే



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24:** రాజ్ ఠాక్రే.. మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు. శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే తమ్ముడి కుమారుడు. ఒకప్పుడు శివసేనలోనే ఉన్న ఆయన 2006లో ఆ పార్టీ నుంచి బయటికి వచ్చి ఎంఎన్ఎస్‌ను స్థాపించారు. కానీ ఎన్నికల సంగ్రామంలో ఎప్పుడూ ప్రభావం చూపలేకపోయారు. ప్రస్తుతం జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎస్ 110 స్థానాల్లో పోటీ చేసింది. కానీ కేవలం ఒక్కస్థానంలో మాత్రమే విజయం సాధించింది. రాజ్ ఠాక్రే మంచి వక్త. ఆయన సభలకు జనాలు భారీగానే హాజరయ్యారు. కానీ జనంనాడిని పట్టుకోవడంలో, ఓట్లుగా మలుచుకోవడంలో ఆయన తొలి నుంచి విఫలవుతున్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎస్ 13 సీట్లు గెలువగా.. 2014లో కేవలం ఒక్క సీటుకే పరిమితమైంది. కొద్దికాలం కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంఎన్ఎస్ పోటీ చేయనప్పటికీ బీజేపీకి వ్యతిరేకంగా భారీగా ప్రచారం నిర్వహించింది. కానీ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలకుగాను బీజేపీ-శివసేన 42 చోట్ల విజయం సాధించాయి. దీంతో ఈవీఎంలలో అవకతవకలకు పాల్పడి బీజేపీ భారీ విజయం సాధించిందని ఆరోపించిన రాజ్ ఠాక్రే.. అసెంబ్లీ ఎన్నికలను బ్యాలెట్ పత్రాలతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని, తమతో కాంగ్రెస్, ఎన్సీపీ కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రతిపాదనకు కాంగ్రెస్, ఎన్సీ పీ ఒప్పుకోలేదు. దీంతో మనసు మార్చుకున్న రాజ్ ఠాక్రే అసెంబ్లీ ఎన్నికల్లో 110 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపా రు. కానీ ఆయనకు మహారాష్ట్ర ఓటర్ల నుంచి మళ్లీ చేదు అనుభవమే ఎదురైంది. కేవలం ఒక్క స్థానంలో మాత్రమే ఎంఎన్ఎస్ గెలిచింది. కాగా ఇన్‌ఫ్రాస్టక్చర్ లీజింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కేసులో ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాజ్ ఠాక్రేను ప్రశ్నించిన విషయం తెలిసిందే.

# ఏకమైన జాట్లు

- హర్యానాలో కాంగ్రెస్, జేజేపీలకు మద్దతిచ్చిన సామాజిక వర్గం
- జాట్ ప్రాబల్య ప్రాంతాల్లో రెండు పార్టీల మధ్యే పోటాపోటీ
- ప్రభుత్వ వ్యతిరేకతతో ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్‌పార్టీ, దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ) ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలు సాధించాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ సారథ్యంలోని బీజేపీ సర్కారుపై ఉన్న వ్యతిరేకతతోపాటు రాష్ట్రంలో రాజకీయంగా బలమైన జాట్ సామాజిక వర్గాన్ని మళ్లీ ఏకం చేయడంతో ఆ రెండు పార్టీలు లబ్ధిపొందాయి. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జాట్ వర్గం 29 స్థానాల్లో ఫలితాలను నిర్దేశించగలదు. మరో 18 స్థానాల్లో ఫలితాలపై ప్రభావం చూపగలదు. జాట్ల ప్రాబల్యం అధికంగా ఉన్న దక్షిణ హర్యానాలోని దేశ్‌వాళీ బెల్ట్‌లో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించింది. కాంగ్రెస్ నేత, మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా జాట్ వర్గానికి చెందినవారే. ఆయనకు గట్టి పట్టున్న రోహ్‌తక్, సోనిపట్ జిల్లాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇక్కడి నుంచి ఖట్టర్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నలుగురు మంత్రులు ఓటమి చవిచూడడం గమనార్హం. 2016లో జరిగిన జాట్‌ల ఆందోళనకు ఈ రెండు జిల్లాలే కేంద్రంగా నిలిచాయి. ఈ ఆందోళనల్లో 18 మంది జాట్లు సహా 31 మంది మరణించారు. కాగా, ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించింది. మొత్తం ఆరు రిజర్వ్‌డ్ స్థానాల్లో నాలుగింటిలో ఆధిక్యం కనబరిచింది. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి దేవీలాల్ కంచుకోట అయిన హిస్సార్, జింద్, భివానీ జిల్లాల్లో జేజేపీ ఉత్తమ ఫలితాలు సాధించింది. చర్ఖీ దాదరీ జిల్లాలోని భాండరా, భివానీ జిల్లాలోని తోశామ్ స్థానాల్లో జేజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇక్కడ పాలకపక్షం బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది. గ్రామీణ జింద్‌లోని మొత్తం నాలుగు స్థానాల్లోనూ జేజేపీనే ఆధిక్యం సాధించింది.

### ప్రభుత్వంపై జాట్‌ల అసంతృప్తి

తమ సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాట్‌లు చేసిన ఆందోళన ఎన్నికల్లో ప్రధానాంశం కాకపోయినా, అధికార బీజేపీ తమ పట్ల అనుసరించిన తీరు పట్ల జాట్ ఓటర్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి తోడు వ్యవసాయ సంక్షోభం కూడా ఎన్నికల్లో గణనీయ ప్రభావం చూపింది. గత కొన్నేండ్లుగా ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధరను తగిన స్థాయిలో పెంచలేదని రైతులు అసంతృప్తితో ఉన్నారు. అలాగే పంట సేకరణకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కోటా విధానం కూడా రైతుల పాలిట శాపంగా మారింది. ఈ విధానం వల్ల స్థానిక మార్కెట్లలో కమీషన్ ఏజెంట్ల దోపిడీ పెరిగింది.

### ప్రభావం చూపని ఆర్టికల్ 370 రద్దు

**జమ్ముకశ్మీర్‌కు** ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై బీజేపీ చేసిన ప్రచారం పెద్దగా ఫలితాన్నివ్వలేదు. కశ్మీర్ అంశం తమ జీవితాలపై ప్రభావం చూపదని ఓటర్లు భావించారు. గత మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి ఆమోదం తెలిపిన ఓటర్లు.. ఈసారి సీఎం ఖట్టర్ పాలనపై తీర్పు వెలువరించారు. పంజాబీ-బనియా ప్రాబల్యమున్న అర్బన్, సెమీ అర్బన్ నియోజకవర్గాల్లో బీజేపీ ఆధిక్యం కనబరిచింది. కర్నాల్ నియోజకవర్గంలో సీఎం ఖట్టర్ విజయం సాధించారు. కర్నాల్‌లోని ద్యాల్‌సింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రామ్‌జీ లాల్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ అంశాలు కాకుండా స్థానిక అంశాల ఆధారంగానే ప్రజలు ఓట్లు వేశారని చెప్పారు. 'స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, ఖట్టర్ ప్రభుత్వ పాలనపై ప్రజలు తీర్పు ఇచ్చారు. ఆర్టికల్ 370, ప్రధాని మోదీ ఇమేజ్‌పైనే బీజేపీ ప్రధానంగా ఆధారపడింది. తాము సాధించినదేమిటో చెప్పుకోలేని స్థితిలో ఖట్టర్ సర్కారు ఉన్నట్లు దీని ద్వారా స్పష్టమైంది' అని అభిప్రాయపడ్డారు.

## మహారాష్ట్ర ప్రజలకు రుణపడి ఉంటాం

- హర్యానాలో అభివృద్ధికి పాటుపడుతాం
- ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ ట్వీట్



**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన కూటమి విజయం సాధించడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు అపారమైన అభిమానంతో ఎన్డీయే ప్రభుత్వాన్ని దీవించారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలకు ఎన్డీయే ఎంతో రుణపడి ఉంటుందని చెప్పారు. గురువారం ఆయన ట్వీట్ చేస్తూ 'మహారాష్ట్ర అభివృద్ధిని కొనసాగించడానికి పాటుపడుతాం. ఎన్నికల్లో విజయం సాధించడానికి తీవ్రంగా కష్టపడిన బీజేపీ, శివసేన కార్యకర్తలకు, ఎన్డీయే కూటమిలోని పార్టీలకు సెల్యూట్ చేస్తున్నా' అని పేర్కొన్నారు. హర్యానా ఫలితాలపై స్పందిస్తూ బీజేపీని దీవించిన హర్యానా ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. హర్యానా అభివృద్ధి కోసం ఇంతకు ముందు ఎలాగైతే పాటుపడ్డామో.. ఇకపైనా అలాగే పాడుపడుతామని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

## చతికిలపడ్డ రెజ్లర్లు

- హర్యానలో బెడిసికొట్టిన బీజేపీ వ్యూహం
- బీజేపీ అసంతృప్త నేత సంబీర్ చేతిలో ఓటమిపాలైన బబితా ఫొగాట్
- బరోడాలో యోగేశ్వర్ ఫెయిల్



బబిత, యోగేశ్వర్ దత్

**న్యూఢిల్లీ:** క్రీడాకారులను బరిలోకి దింపి హర్యానాలోని కీలక స్థానాల్లో జెండా ఎగురవేయాలని చూసిన బీజేపీ ప్రయత్నాలు ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్లతో పోటీ చేసిన రెజ్లర్లు బబితా ఫొగాట్, యోగేశ్వర్ దత్ ఓటమిపాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందే పార్టీలో చేరిన బబితను హర్యానాలోని దాద్రీ నియోజకవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపింది. అయితే బీజేపీ అసంతృప్త నేత, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సంబీర్ సాంగ్వాన్ చేతిలో ఆమె ఓడిపోయారు. కాంగ్రెస్ నేత నృపేంద్ర సాంగ్వాన్ కూడా బబితకు గట్టిపోటీనిచ్చారు. మరోవైపు, 2012 ఒలింపిక్ పతక విజేత యోగేశ్వర్ దత్‌ను బీజేపీ హర్యానాలోని బరోడా నియోజకవర్గం నుంచి బరిలోకి దింపింది. అయితే యోగేశ్వర్ కూడా ఆ నియోజకవర్గం ప్రజలను ఆకట్టుకోలేకపోయారు. తాజా ఫలితాల్లో కాంగ్రెస్ సిట్టింగ్ అభ్యర్థి కృష్ణ హుడా చేతిలో 5 వేల పైచిలుకు ఓట్లతో ఆయన ఓటమిపాలయ్యారు. గత సెప్టెంబర్‌లో యోగేశ్వర్ దత్ బీజేపీలో చేరారు. నరేంద్ర మోదీ చేపట్టిన పనులు, పార్టీ సిద్ధాంతాలు నచ్చినట్టు చేరిక సమయంలో దత్ చెప్పారు. కాగా, బరోడా స్థానాన్ని బీజేపీ ఇంతవరకు గెలుచుకోలేదు. ఇప్పటివరకు కాంగ్రెస్ లేదా ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్డీ) పార్టీలే ఈ నియోజకవర్గంలో విజయం సాధిస్తూ వచ్చాయి.

## జేడీయూపై ఉప ఎన్నికల దెబ్బ

పోటీచేసిన నాలుగు స్థానాల్లో ఒక్కటే కైవసం

2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో సీట్ల సర్దుబాటుపై ప్రభావం?!



**పాట్నా, అక్టోబర్ 24:** బీహార్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో జనతా దళ్ యునైటెడ్(జేడీయూ)కు ఓటర్లు భారీ షాక్ ఇచ్చారు. ఉప ఎన్నికలు జరిగిన ఐదు స్థానాల్లో జేడీయూ నాలుగు స్థానాల నుంచి పోటీ చేయగా, మిగిలిన ఒక స్థానం నుంచి జేడీయూ మిత్రపక్షంగా ఉన్న బీజేపీ తమ అభ్యర్థిని నిలిపింది. అయితే, పోటీ చేసిన నాలుగు స్థానాల్లో కేవలం ఒక్క స్థానం (నాథ్‌నగర్) నుంచే జేడీయూ గెలిచింది. మైనార్టీ ఓటర్లను ఆకర్షిద్దామనుకున్న బీజేపీని కూడా ప్రజలు మరోసారి తిరస్కరించారు. కిషన్‌గంజ్ నియోజకవర్గంలో ఆ పార్టీ ఓటమిపాలైంది. జేడీయూ-బీజేపీ మిత్రపక్షాలుగా ఈ ఉప ఎన్నికల్లో బరిలోకి దిగాయి. కాగా, 2020లో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై తాజా ఉప ఎన్నికల ఫలితాల ప్రభావం ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ మధ్య సీట్ల సర్దుబాటులో మార్పులు జరుగొచ్చని, గతంతో పోలిస్తే బీజేపీ ఎక్కువ స్థానాల్ని ఆశించే అవకాశం ఉన్నట్టు వాళ్లు చెబుతున్నారు. దీన్ని బలపరుస్తూ ఇప్పటికే పలువురు బీజేపీ నేతలు జేడీయూపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఉపఎన్నికల వైఫల్యానికి బాధ్యత వహిస్తూ సీఎం నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ తున్నాజీ పాండే డిమాండ్ చేశారు. ఉపఎన్నికల ఫలితాల నేపథ్యంలో.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూను బీజేపీ కనీసం 50 శాతం సీట్లను అడిగే అవకాశం లేకపోలేదని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

# ఎట్టకేలకు కర్తార్‌పూర్ ఒప్పందం



కర్తాపూర్ కారిడార్ ఒప్పందంపై సంతకాలు చేస్తున్న కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్‌సీఎల్ దాస్, పాకిస్థాన్ విదేశాంగ శాఖ కార్యాలయ ప్రతినిధి మొహమ్మద్ ఫైజల్

- సంతకాలు చేసిన భారత్-పాక్
- వీసా లేకుండానే పాక్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాకు భారతీయులకు అనుమతి

**లాహోర్, అక్టోబర్ 24:** దేశాలు కర్తార్‌పూర్ కారిడార్‌కు సంబంధించిన చారిత్రాత్మక ఒప్పందంపై భారత్, పాకిస్థాన్ సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం మేరకు భారత్‌కు చెందిన యాత్రికులు వీసా లేకుండానే పాకిస్థాన్‌లోని గురునానక్ దేవ్ అస్తమించిన ప్రదేశాన్ని సందర్శించవచ్చు. అంతర్జాతీయ సరిహద్దుకు నాలుగు కిలోమీటర్ల ఆవల పాకిస్థాన్‌లోని నరోవాల్ జిల్లాలోగల కర్తార్‌పూర్ దర్బార్ సాహిబ్‌కు భారత్‌లోని పంజాబ్ రాష్ట్రంలో గల డేరాబాబా నానక్ గురుద్వారాకు మధ్య కారిడార్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ సరిహద్దుపై గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్‌సీఎల్ దాస్, పాకిస్థాన్ విదేశాంగ శాఖ కార్యాలయ ప్రతినిధి మొహమ్మద్ ఫైజల్ కర్తార్‌పూర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సిక్కుల డిమాండ్ పరిష్కారమైంది. సిక్కుల తొలి గురువు గురునానక్ తన చివరి 18 సంవత్సరాలను కర్తార్‌పూర్‌లోనే గడిపారు. ఆ ప్రదేశాన్ని ఇప్పుడు అన్ని మతాలకు చెందిన భారతీయులు వీసా లేకుండానే సందర్శించవచ్చు. భారత్-పాక్ మధ్య గత కాలంగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ కర్తార్‌పూర్ కారిడార్ విషయంలో మూడు దఫాలు చర్చలు జరిగాయి. ఒప్పందంపై సంతకం చేసిన అనంతరం మహమ్మద్‌ఫైజల్ మీడియాతో మాట్లాడుతూ, కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణాన్ని ఏడాదిలోపు పూర్తి చేస్తానన్న వాగ్దానాన్ని తమ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ నిలబెట్టుకున్నారని చెప్పారు. కర్తార్‌పూర్ గురుద్వారా ప్రపంచంలోనే అతిపెద్దదని చెప్పారు. ఈ కారిడార్ ద్వారా వచ్చే సిక్కులను పాకిస్థాన్‌లోని ఇతర గురుద్వారాలు సందర్శించేందుకు అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. గురుద్వారా లోపల, బయట పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. నవంబర్ 12న గురునానక్ దేవ్ 550వ జయంతి జరుగనుండగా, అంతకుముందు 9వ తేదీన ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కారిడార్‌ను లాంఛనంగా ప్రారంభిస్తారని ఫైసల్ తెలిపారు.

### ఒప్పందం ప్రకారం

- ☛ కర్తార్‌పూర్ వెళ్లే యాత్రికులు తమ వద్ద తప్పనిసరిగా పాస్‌పోర్ట్‌ను ఉంచుకోవాలి. భారత సంతతికి చెందిన ప్రవాసులు మాత్రం ప్రవాస భారతీయ పౌరసత్వం (ఓసీఐ) కార్డుతోపాటు పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండాలని ఢిల్లీలోని హోం మంత్రిత్వ శాఖ కార్యాలయం తెలిపింది. ఆ పాస్‌పోర్ట్‌పై పాక్ అధికారులు ఎటువంటి ముద్రలు వేయరు.
- ☛ ఒప్పందంపై సంతకాలు జరిగిన వెంటనే కర్తార్‌పూర్ యాత్రికుల కోసం 'prakashpurb550.mha.gov.in' వెబ్‌సైట్ ప్రారంభమైంది. యాత్రికులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, తమకిష్టమొచ్చిన రోజున ప్రయాణించవచ్చు.
- ☛ యాత్రికులు తమతోపాటు గరిష్ఠంగా రూ.11వేల వరకు నగదు, ఏడు కిలోల బరువు వరకు సరుకులు, సామగ్రితో కూడిన సంచిని మాత్రమే తీసుకెళ్లాలి. యాత్రా స్థలాన్ని దాటి ఎవరూ అవతలికి వెళ్లడానికి ప్రయత్నించకూడదు.
- ☛ కారిడార్‌ను అన్ని వేళలా తెరిచే ఉంచుతారు. ప్రతిరోజు ఐదువేల మంది భారతీయులను మాత్రమే అనుమతిస్తారు. వారు ఉదయం వెళ్లి సాయంత్రంలోగా తిరిగి రావాలి.
- ☛ కర్తార్‌పూర్ వెళ్లే యాత్రికుల వివరాలను భారత్ వారి ప్రయాణానికి 10 రోజుల ముందే పాకిస్థాన్‌కు తెలియజేస్తుంది. యాత్రికుల ప్రయాణ తేదీకి నాలుగు రోజుల ముందు ఎస్ఎంఎస్ ద్వారా వారి రిజిస్ట్రేషన్ వివరాలను పంపిస్తారు.
- ☛ ప్రతి యాత్రికుడు కర్తార్‌పూర్ వెళ్లడానికి 20 డాలర్లు (సుమారు రూ.1400) రుసుము చెల్లించాలి.

## ప్రిన్సిపాల్ సహా.. 16 మందికి ఉరిశిక్ష

బంగ్లాదేశ్ మదర్సాలో

బాలిక హత్య కేసుపై కోర్టు తీర్పు

**ఢాకా, అక్టోబర్ 24:** బంగ్లాదేశ్ మదర్సాలో ఓ బాలికపై కిరోసిన్ పోసి సజీవంగా దహనం చేసిన కేసులో మదర్సా ప్రిన్సిపాల్ సహా 16 మంది దోషులకు స్థానిక కోర్టు ఉరిశిక్ష విధించింది. దోషులంతా చెరో లక్ష టాకాల చొప్పున బాధితురాలి కుటుంబానికి చెల్లించాలని ఆదేశించింది. ఘటన జరిగిన 62 రోజుల్లోనే విచారణను పూర్తిచేసిన ఫాస్ట్ ట్రాక్ ట్రైబ్యునల్ గురువారం ఈ మేరకు తీర్పు వెల్లడించింది. 'దోషుల మెడకు ఉరి బిగించి చనిపోయేంత వరకు వేలాడదీయాలి' అని మహిళలు, పిల్లల అణచివేత నివారణ ట్రైబ్యునల్ జడ్జి మమునూర్ రషీద్ పేర్కొన్నారు. దోషుల్లో ఇద్దరు మహిళలతోపాటు అధికార అవామీ లీగ్ పార్టీకి చెందిన స్థానిక నేత, మదర్సా కమిటీ సభ్యులు ఉన్నారు. ఢాకాకు 162 కి.మీ దూరంలోని దక్షిణ ఫేనిలోని మదర్సాలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ దారుణ ఘటన జరిగింది. మదర్సా ప్రిన్సిపాల్ సిరాజ్ ఉద్ దౌలా తనను లైంగికంగా వేధిస్తున్నట్లు నస్రూత్ జహాన్ రఫీ (18) అనే విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడ్ని అరెస్ట్ చేశారు. ఫిర్యాదును ఉప సంహరించుకోవాలంటూ మదర్సాకు చెందిన వ్యక్తులు ఆ బాలికను బెదిరించారు. లెక్కచేయని నస్రూత్, తన ఊపిరి ఉన్నంత వరకు ఈ కేసుపై పోరాడతానని చెప్పింది. దీంతో ఆమెను అంతం చేయాలని జైల్లో ఉన్న ప్రిన్సిపాల్ తన అనుచరులను ఆదేశించాడు. దీంతో పరీక్షల సమయంలో వారు ఆమెను బలవంతంగా మదర్సాపైకి తీసుకెళ్లి కిరోసిన్ పోసి నిప్పటించారు. తీవ్ర కాలిన గాయాలతో దవాఖానలో చేరిన నస్రూత్ చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఘటనపై బంగ్లాదేశ్‌లో నిరసనలు వెల్లువెత్తాయి.

## యూపీ హోంగార్డులకు ఊరట

వారి సేవలను కొనసాగిస్తామన్న ప్రభుత్వం

**లక్నో, అక్టోబర్ 24:** ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల తొలగించిన హోంగార్డులకు ఊరట లభించింది. వరుస పండుగల నేపథ్యంలో వారి సేవలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యూపీ హోంగార్డులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రోజుకు రూ.500కు బదులు రూ.672 ఇవ్వాలని సుప్రీంకోర్టు జూలైలో ఆదేశించింది. ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్న నేపథ్యంలో 25 వేల మంది హోంగార్డులను తొలగిస్తున్నట్లు అక్టోబర్ 15న యూపీ ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై హోంగార్డులు ఆందోళన వ్యక్తం చేయడంతోపాటు విపక్షాలు మండిపడ్డాయి. విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఏ ఒక్క హోంగార్డును తొలగించబోమని రాష్ట్ర హోంగార్డు మంత్రి చేతన్ చౌహాన్ వారికి భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో 'పండుగల సీజన్ నేపథ్యంలో హోంగార్డుల విధులు గతం మాదిరిగానే ఇప్పుడు కూడా కొనసాగుతాయి' అని హోంశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి అవినేష్ అవస్థీ గురువారం ఆదేశాలు జారీ చేశారు. నిధులు అందుబాటులో ఉన్నంత మేరకు హోంశాఖ బడ్జెట్ కేటాయింపుల నుంచి వీరికి జీతాలు చెల్లిస్తామని అందులో పేర్కొన్నారు. మరోవైపు గతంలో మాదిరిగా నెలకు 25 రోజులు కాకుండా 15 రోజులు మాత్రమే హోంగార్డుల సేవలను వినియోగించుకోనున్నారు.

## కశ్మీర్‌లో ఆంక్షలు ఇంకెన్నాళ్లు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24:** కశ్మీర్ లోయలో ఇంకెన్నాళ్లు ఆంక్షలు కొనసాగించదలచుకున్నారని, ఇంటర్నెట్‌ను ఇంకెంతకాలం రద్దు చేస్తారని జమ్ముకశ్మీర్ పాలనా యంత్రాంగాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. జాతీయ ప్రయోజనాల రీత్యా ఆంక్షలు విధించవచ్చని, కానీ వాటిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించింది. కశ్మీర్ లోయలో రాకపోకలు, కమ్యూనికేషన్ వ్యవస్థపై విధించిన ఆంక్షలను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. తాము అడిగిన ప్రశ్నలకు 'స్పష్టమైన' సమాధానం చెప్పాలని, సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయాలను కనుగొనాలని ధర్మాసనం అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలను ఆదేశించింది. వీరిలో ఒకరు కేంద్ర ప్రభుత్వం తరఫున, మరొకరు జమ్ముకశ్మీర్ ప్రభుత్వం తరఫున కోర్టుకు హాజరయ్యారు. ఆంక్షలను ప్రతిరోజు సమీక్షిస్తున్నామని, రాష్ట్రంలోని 99శాతం ప్రాంతంలో ఎటువంటి ఆంక్షలు లేవని తుషార్ మెహతా చెప్పారు. ఈ వాదనతో పిటిషనర్ తరఫు న్యాయవాది వృందా గ్రోవర్ విభేదించారు. కశ్మీర్ లోయలో ఇంటర్నెట్‌పై రెండు నెలల క్రితం విధించిన నిషేధం ఇంకా కొనసాగుతున్నదని చెప్పారు. దీనికి ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. 'ఇంకెంతకాలం మీరు ఈ ఆంక్షలను కొనసాగించాలనుకుంటున్నారు?' అని నిలదీసింది. ఈ కేసుపై తదుపరి విచారణను కోర్టు నవంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. అదే రోజున, కశ్మీర్‌లో మైనర్లను నిర్బంధించారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై కూడా అదే రోజున విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది.

## జమ్ము బీడీసీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్!

**జమ్ము:** జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని జమ్ము జిల్లాలో బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (బీడీసీ) ఎన్నికల్లో దాదాపు వందశాతం ఓట్లు పోలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దుతో ప్రత్యేక హోదాను ఉపసంహరించిన తర్వాత రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నిక ఇది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు ఈ ఎన్నికలను బహిష్కరించాయి. జమ్ము జిల్లా పరిధి 20 బ్లాక్‌లలో 99.5 శాతం పోలింగ్ జరిగిందని, 2,703 మంది ఓటర్లలో 2,690 మంది ఓటు వేశారని జిల్లా ఎన్నికల అధికారి సుష్మాచౌహాన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు 50 శాతం పోలింగ్ నమోదుకాగా, ముగిసే సమయం మధ్యాహ్నం ఒంటి గంటకు 99.5 శాతం నమోదైనట్టు చెప్పారు. 1,797 మంది పురుషులు, 893 మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపారు. బీడీసీ చైర్‌పర్సన్ల ఎన్నికకు రాష్ట్రంలోని 310 బ్లాక్‌లలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 1,092 మంది అభ్యర్థులు పోటీపడగా, వీరిలో 27 మంది ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు ఎన్నికల అధికారి చెప్పారు.

# కుప్పకూలిన సైనిక హెలికాప్టర్

- సురక్షితంగా బయటపడిన సిబ్బంది
- కశ్మీర్‌లో ఘటన



ఘటనాస్థలంలో కొనసాగుతున్న సహాయ చర్యలు

**శ్రీనగర్, అక్టోబర్ 24:** ఆర్మీ నార్తర్న్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ రణ్‌బీర్ సింగ్‌కు, ఆయన సహచర సిబ్బందికి తృటిలో ప్రమాదం తప్పింది. ఆర్మీకి చెందిన అత్యాధునిక తేలికపాటి హెలికాప్టర్ గురువారం సాంకేతిక లోపంతో కుప్ప కూలడంతో ఒక పౌరుడికి గాయాలు అయ్యాయి. ఇటీవల సరిహద్దుల్లోని ఫార్వర్డ్ పోస్టులపై పాక్ సైన్యం తరుచుగా కాల్పులకు పాల్పడుతున్న నేపథ్యంలో లెఫ్టినెంట్ జనరల్ రణ్‌బీర్ సింగ్.. ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న '15కార్ప్స్' జవాన్లను కలుసుకునేందుకు హెలికాప్టర్‌లో జమ్ము నుంచి శ్రీనగర్ వైపు బయలుదేరారు. పూంచ్ జిల్లాలోని బిదర్ ప్రాంతానికి రాగానే హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని అధికారులు తెలిపారు. దీంతో అత్యవసరంగా ల్యాండింగ్ చేస్తుండగా హెలికాప్టర్ కుప్పకూలింది. లెఫ్టినెంట్ జనరల్ రణబీర్ సింగ్, ఇద్దరు పైలట్లు, మరో ఏడుగురు జవాన్లు సురక్షితంగా బయటపడ్డారు. హెలికాప్టర్ సిబ్బంది, సైనిక జవాన్లు సురక్షితమని రక్షణశాఖ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. రణ్‌బీర్‌సింగ్‌తోపాటు మిగతా వారికి సమీప ఆర్మీ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలు జరిపారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ సిబ్బందికి గానీ, జవాన్లకు గానీ తీవ్ర గాయాలేమీ కాలేదని అధికారులు చెప్పారు.

### పాక్ కాల్పుల్లో మహిళ మృతి, ఇద్దరికి గాయాలు

జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి తంగ్‌ధర్ సెక్టార్ పరిధిలో పాకిస్థాన్ గురువారం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక మహిళ మరణించగా, మరో ఇద్దరు పౌరులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ప్రజలకు చెందిన ఆస్తులు కూడా దెబ్బతిన్నాయి. పాక్ సైన్యానికి భారత్ సైన్యం దీటుగా జవాబిచ్చింది.

## కంటెయినర్ మృతులంతా చైనీయులే

బ్రిటన్ పోలీసుల వెల్లడి

**లండన్:** బ్రిటన్‌లో సంచలనం సృష్టించిన 'కంటెయినర్ మృతదేహాల' ఘటనకు సంబంధించి కీలక విషయం వెల్లడైంది. లారీలో మరణించిన వారంతా చైనీయులేనని బ్రిటన్ పోలీసులు గురువారం ప్రకటించారు. ఎనిమిది మంది మహిళలతోపాటు 31 మంది పురుషుల అనుమానాస్పద మరణంపై ఆ లారీని నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్ మో రాబిన్సన్‌ను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. వీరి మృతిలో వ్యవస్థీకృత నేరముఠాలకు పాత్ర ఉన్నదా? అన్న అంశాన్ని నిర్ధారించేందుకు కృషి చేస్తున్నట్లు నేషనల్ క్రైమ్ ఏజెన్సీ తెలిపింది. దీనిపై బెల్జియం ఫెడరల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం కూడా స్పందిస్తూ.. మృతులంతా బెల్జియంలోనే కంటెయినర్‌లోకి వచ్చారా? లేదా? అన్న సంగతి తెలియదని పేర్కొన్నది.

# విద్యార్థి నాయకుడి జీవితం



సందీప్‌మాధవ్

సమసమాజస్థాపనే ధ్యేయంగా పోరాట స్ఫూర్తిని కొనసాగించిన విద్యార్థి ఉద్యమ నేత జార్జ్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'జార్జ్‌రెడ్డి'. సందీప్ మాధవ్ ('వంగవీటి' ఫేమ్) టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. జీవన్‌రెడ్డి దర్శకుడు. మైక్ మూవీస్, సిల్లీమాంక్స్, త్రీలైన్స్ సినిమా పతాకాలపై అప్పిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్ 22న ఈ చిత్రం ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'వాణిజ్య హంగులతో రూపొందుతున్న జీవిత కథా చిత్రమిది. 1965-75 మధ్యకాలంలో ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొన్న సంఘటనలు, విద్యార్థి నాయకుడిగా జార్జ్‌రెడ్డి ప్రస్థానం నేపథ్యంలో ఆసక్తికరంగా సాగుతుంది. ట్రైలర్‌కు చక్కటి ఆదరణ లభించింది. ఈ సినిమా థియేట్రికల్ హక్కులను అభిషేక్‌నామా సొంతం చేసుకున్నారు. బిజినెస్ పూర్తయింది. రియలిస్టిక్‌గా సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని అన్నారు. సత్యదేవ్, దేవిక, శ్రీనివాస్, ముస్కాన్, మనోజ్‌నందం, చైతన్యకృష్ణ, శత్రు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సహనిర్మాతలు: దాముదెడ్డి, సుధాకర్ యెక్కంటి.



చిరంజీవి

# చిరంజీవి ఆధ్వర్యంలో అ'పూర్వ'కలయిక

సౌత్ యాక్టర్స్ రీ యూనియన్ పేరుతో ప్రతి ఏడాది 1980 దశకంలో చిత్రసీమకు పరిచయమైన దక్షిణాది తారలంతా ఒక చోట చేరి సినీ ప్రయాణంలోని మధురజ్ఞాపకాల్ని పంచుకుంటున్న సంగతి తెలిసిందే. 2009లో ఈ అపూర్వ కలయికకు అంకురార్పణ పడింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఒక్కో ప్రాంతంలో దక్షిణాది నటులంతా కలసుకుంటూ థీమ్‌పార్టీలతో సందడిచేస్తున్నారు. ఈ సారి సౌత్ యాక్టర్ రీ యూనియన్ పదో వసంత వేడుకలు అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగనున్నట్లు సమాచారం. సకల హంగులతో పునర్నిర్మించిన చిరంజీవి స్వగృహంలో 80లనాటి దక్షిణాది నటుల కలయికకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# నాని సమర్పణలో 'హిట్'



రుహానీశర్మ, విశ్వక్‌సేన్‌లపై క్లాప్‌నిస్తున్న నాని

స్వీయ నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తొలి ప్రయత్నంగా 'అ!' చిత్రాన్ని నిర్మించి విమర్శకుల ప్రశంసలందుకున్నారు యువ హీరో నాని. తాజాగా అదే బ్యానర్‌పై 'హిట్' పేరుతో గురువారం ద్వితీయ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సినిమాలో విశ్వక్‌సేన్, రుహానీ శర్మ జంటగా నటిస్తున్నారు. శైలేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. నాని సమర్పణలో ప్రశాంత్ త్రిపురనేని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.మణికందన్, సంగీతం: వివేక్‌సాగర్.



రాజ్‌తరుణ్, విజయ్‌కుమార్, ఆండ్రూ, రాధామోహన్

# 'ఒరేయ్ బుజ్జిగా' సెట్స్‌లో..

సినిమాటోగ్రాఫర్ ఆండ్రూ తన పుట్టినరోజు వేడుకల్ని గురువారం 'ఒరేయ్ బుజ్జిగా' సినిమా సెట్స్‌లో యూనిట్ సభ్యుల నడుమ జరుపుకున్నారు. రాజ్‌తరుణ్, మాళవికనాయర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి విజయ్‌కుమార్ కొండా దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. యూనిట్ సభ్యుల సమక్షంలో ఆండ్రూ పుట్టినరోజు వేడుకలు జరగడం ఆనందంగా ఉందని నిర్మాత తెలిపారు.



రాహుల్ రామకృష్ణ, నవీన్ పొలిశెట్టి, ప్రియదర్శి

# నాగ్‌అశ్విన్ నిర్మాణంలో 'జాతిరత్నాలు'

అలనాటి మేటి నటి సావిత్రి జీవితాన్ని 'మహానటి' చిత్రంలో అద్వితీయ రీతిలో ఆవిష్కరించి దర్శకుడిగా విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నారు నాగ్‌అశ్విన్. తాజాగా ఆయన నిర్మాతగా మారి స్వప్న సినిమా పతాకంపై రూపొందిస్తున్న చిత్రం 'జాతిరత్నాలు'. నవీన్ పొలిశెట్టి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనుదీప్ కె.వి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో నవీన్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ఖైదీలుగా కనిపిస్తున్నారు. వారి దుస్తులపై 210, 420, 840 నంబర్స్ ఉండటం ఆసక్తిని పంచుతుంది. 'సత్ప్రవర్తన వల్ల త్వరగా బయటికొస్తున్న మా వాళ్లు మీ జాతిరత్నాలు' అంటూ చిత్రబృందం పేర్కొన్నది. 'పూర్తిస్థాయి వినోదభరిత చిత్రమిది. 75 శాతం చిత్రీకరణ పూర్తయింది' అని దర్శకుడు పేర్కొన్నారు. ఫరియాఅబ్దుల్లా, మురళీశర్మ, వి.కె.నరేష్, బ్రహ్మాజీ, శుభలేఖసుధాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:రధన్, సినిమాటోగ్రఫీ: సిద్ధాన్ మనోహర్.











